
శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


శివరాత్రికి ఉచితంగా పండ్లు, అల్పాహారం

సంస్కరణల పేరుతో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

నో వెహికల్ జోన్‌గా కుంభమేళా


లోపలి పేజీల్లో



సంపుటి 27, సంచిక: 234 | బుధవారం | 12-02-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


## ప్రజా ప్రయోజనాలే
# ఎఐ లక్ష్యం



- కృత్రిమ మేధ గ్లోబల్ సౌత్‌కు చేరువ కావాలి
- సాంకేతికతను ప్రజాస్వామ్యీకరించాలి
- అందరికీ చేరువచేసేలా సమష్టి నిబంధనలు రూపొందాలి
- పారిస్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

**పారిస్ :** ప్రజాప్రయోజనాలే కృత్రిమమేధ (ఎ.ఐ) లక్ష్యం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధ వినియోగానికి విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పారిస్‌లో కృత్రిమ మేధ అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు ముగింపు రోజున మంగళవారంనాడు మోదీ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజాస్వామ్యీకరణ చేయాలన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలకు కృత్రిమమేధ చేరువకావాలన్నారు.''నవీన సాంకేతిక ఆవిష్కరణల గురించీ, వాటిని ఆమోదయోగ్యమైన పాలనా నిబంధనల ద్వారా నిర్వహించడం గురించి మనం చాలా లోతుగా ఆలోచించాలి, అదే సమయంలో కృత్రిమమేధ వినియోగంలో ఉన్న పరిమితులను, వివక్షను కూడా ప్రతివ్యక్తీ జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి, సమష్టిగా మనం రూపొందించే అంతర్జాతీయ నిబంధనలు కృత్రిమమేధను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేవిధంగా ఉండాలి, ముఖ్యంగా ఎక్కడైతే ఈ సామర్థ్యాలు తక్కువగా ఉన్నాయో అలాంటి గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కృత్రిమ మేధ వివక్షలేకుండా చేరువకావాలి, ఆర్థిక వనరులను, నైపుణ్యాన్ని, శక్తిసామర్థ్యాలను, ఆ డేటాను కృత్రిమ మేధ ద్వారా గ్లోబల్ సౌత్‌కు చేరువ చేయాలి'' అన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం వంటివాటిని మెరుగుపరచడం ద్వారా కోట్లాదిమంది ప్రజల జీవితాలను కృత్రిమమేధ మార్చేస్తుందన్నారు. స్థిరమైన వృద్ధి లక్ష్యాల దిశగా ప్రపంచం ప్రయాణించే పరిస్థితులను కృత్రిమమేధ సృష్టించగలదన్నారు. కృత్రిమమేధ వినియోగంలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రపంచ ప్రజల నమ్మకాలను దృష్టిలో ఉంచుకుని అందుకు తగ్గట్టుగా అంతర్జాతీయ నిబంధనలు రూపొందించాలని కోరారు. ప్రజలలే ప్రధానకేంద్రంగా, వారి ప్రయోజనాలే లక్ష్యంగా అప్లికేషన్లను తయారు చేయాలన్నారు. సైబర్ దోపిడీ, దుష్ప్రచారం, డీప్‌ఫేక్ వంటి సంబంధిత ప్రమాదాలకు పరిష్కారాలు సాధించే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాంటి వివక్షకు తావు లేకుండా నాణ్యతా ప్రమాణాలతోకూడిన డేటాను అభివృద్ధి చేయాలని ఉద్ఘాటించారు. మొదట ఒకచోట తయారుచేసిన సాంకేతిక సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానాన్ని తరువాయి 2లో

## రాజకీయాలకు అతీతంగా ఎస్‌సి ఉపకులాలకు
# మేలు చేస్తాం

- వర్గీకరణకు న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశాం : సిఎం రేవంత్‌రెడ్డి
- సిఎంను కలిసిన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఉపకులాల ప్రతినిధులు
- ఎస్‌సిలను గతంలోలాగా నాలుగు గ్రూపులుగా వర్గీకరించాలి : మందకృష్ణ
- అభ్యంతరాలపై ఉపసంఘం కమిషన్‌ను కలవాలని ముఖ్యమంత్రి సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్

రాజకీయ ప్రయాజనాలకు అతీతంగా, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేయాలనే మంచి ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో మాదిగ ఉప కులాల ప్రతినిధులు ముఖ్యమంత్రితో మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్‌సి ఉపకులాల వర్గీకరణకు ఎలాంటి న్యాయ పరమైన చిక్కులు ఎదురు కావద్దనే ఆలోచనతో ప్రక్రియను చట్టబద్ధంగా ముందుకు తీసుకువెళ్లామని, అందులో భాగంగానే తొలుత అసెంబ్లీలో చర్చించి, మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించడంతో పాటు న్యాయ కమిషన్ ఏర్పాటు చేశామని వివరించారు. అనంతరం సంబంధిత నివేదికలను తెప్పించి, కమిషన్ సిఫార్సులను కేబినెట్ లో, ఆ తర్వాత అసెంబ్లీలో ఆమోదించామని సిఎం గుర్తు చేశారు. కాగా, ఎస్‌సి వర్గీకరణకు సంబంధించి సమస్యలు, అభ్యంతరాలను మంత్రివర్గ ఉప సంఘంతో పాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.కేశవరావు, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ ఎస్.ఎ.సంపత్ కుమార్, పలువురు ప్రజా ప్రతినిధులు, మాదిగ ఉపకులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**నాలుగు గ్రూపులుగా వర్గీకరించాలి**

ఎస్‌సి రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం ఎ బి సి డి నాలుగు గ్రూప్‌లుగా వర్గీకరించాలని, ఒక వేళ తరువాయి 2లో

> ఎస్‌సి ఉపకులాల వర్గీకరణ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకున్నారు. వర్గీకరణ ప్రక్రియను ఒక నిబద్ధతతో చేపట్టిన ప్రజా ప్రభుత్వానికి, సిఎం రేవంత్ రెడ్డికి అండగా ఉంటాం. ఫిబ్రవరి 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్‌సి వర్గీకరణకు ఆమోదం తెలపడాన్ని స్వాగతిస్తున్నాం. గత ఆగస్టు 1వ తేదీన సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం జస్టిస్ షమీమ్ అఖ్తర్ నేతృత్వంలోని ఏక సభ్య కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికను ఆమోదించి, ఎస్‌సి వర్గీకరణను అమలు చేసేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాం
> – మందకృష్ణ మాదిగ



ఎన్నిసార్లు మోదీ అంటే
## అన్నిసార్లు రూపాయి పతనం

- బడ్జెట్ చర్చలో సిపిఐ ఎంపి సందోశ్‌కుమార్

05



కులగణనపై బిఆర్‌ఎస్ బిజెపికి
## మాట్లాడే హక్కులేదు

- కెటిఆర్, కెసిఆర్, హరీశ్‌కు సర్వే ఫారాలు పంపుతున్నాం
- బిసిలకు న్యాయం చేసేలా ప్రభుత్వం కృషి : పొన్నం

03



## ఉప ఎన్నికలు ఖాయం

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు తెలంగాణ ప్రజలు బుద్ధిచెబుతారు
- మాజీ సిఎం కెసిఆర్

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజక వర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయమని మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫాంహౌస్‌లో మాజీ మంత్రి తాటికొండ రాజయ్య బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి సన్మానించారు. ధర్మసాగర్ మాజీ జెడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు, మరికొంత మంది తరువాయి 2లో

జెఇఇ మెయిన్ తొలి ఎడిషన్‌లో
## మెరిసిన తెలంగాణ బిడ్డ



100 పర్సంటైల్ సాధించిన బని బ్రాత
దేశవ్యాప్తంగా మొత్తం 14 మందికి...

**న్యూఢిల్లీ :** జెఇఇ మెయిన్ మొదటి సెషన్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా మొత్తం 14 మందికి వంద పర్సంటైల్ సాధించారు. తెలంగాణ నుంచి బని బ్రాత 100 పర్సంటైల్ సాధించగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గుత్తికొండ మనోజ్ఞ కూడా 100 పర్సంటైల్ తో సత్తా చట్టారు. అయితే అత్యధికంగా రాజస్థాన్ నుంచి 100 పర్సంటైల్ సాధించివారిలో ఉన్నారు. టాప్ స్కోర్ సాధించిన 14 మందిలో తరువాయి 2లో

## బర్డ్ ఫ్లూపై రాష్ట్రం అప్రమత్తం

- ఇతర రాష్ట్ర కోళ్లు తెలంగాణలోకి రాకుండా చెక్‌పోస్టుల వద్ద నిలిపివేత
- ముందుజాగ్రత్తలపై అధికారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్లకు పశుసంవర్థకశాఖ ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



ఇతర రాష్ట్రాలలో 'బర్డ్ ఫ్లూ' కేసులు నమోదవుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ ప్రబలుతున్న పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి కోళ్ల వాహనాలను రాకుండా చెక్‌పోస్టుల వద్దనే నిలిపివేస్తున్నారు. పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమై 'బర్డ్ ఫ్లూ' వ్యాప్తికి తరువాయి 2లో





- కేంద్ర హోంమంత్రి వేయి జన్మలెత్తినా ఆ పని చేయలేడు
- అమరజీవి సిహెచ్. కొండన్న సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- లౌకిక ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయం కోసం సిపిఐ పోరు : చాడ
- కమ్యూనిస్టులు జనం పక్షాన పోరాడతారు : ఎమ్మెల్యే వాకిటి

## కమ్యూనిజం అంతం
# అమిత్ షా తరం కాదు

ప్రజాపక్షం/మక్తల్

కేంద్ర హోం మంత్రి అమిత్ షా తలకిందులు తపస్సు చేసినా, వెయ్యి జన్మలెత్తినా కమ్యూనిజాన్ని అంతం చేయలేరని కొత్తగూడెం శాసనసభ్యులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. మంగళవారం నారాయణపేట జిల్లా మక్తల్ మండల కేంద్రంలోని ఎఆర్‌ఎం ఫంక్షన్ హాల్‌లో సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి కార్మికోద్యమ నేత అమరజీవి సిహెచ్. కొండన్న సంస్మరణ సభకు హాజరయ్యారు. తొలుత సిహెచ్ కొండన్న చిత్రపటానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు. సంస్మరణ సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, సిహెచ్ కొండన్న పేద కుటుంబంలో జన్మించి చిన్నతనం నుండే అభ్యుదయ భావాల వైపు ఆకర్షితుడై మార్క్సిజం లెనినిజం సిద్ధాంతం వెలుగులో ఎర్ర జెండా నెత్తుకుని తాడిత పీడిత జనం పక్షాన కార్మిక కర్షకుల గొంతుకై నిలబడ్డ ధైర్యశాలి అని అన్నారు. దేశంలో మతోన్మాద విధానాలు పెచ్చరెల్లిపోతున్నాయని, దీని ఫలితంగా దేశం పెను సవాళ్ళ ఎదుర్కొంటుందని అన్నారు. మతోన్మాద భావజలాన్ని కూకటి వేళ్లతో పెకిలిస్తేనే దేశంలో భారత రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని అన్నారు. మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, కమ్యూనిస్టులు నిస్వార్థంగా సమాజ హితం కోసం తరువాయి 12లో

## నిబంధనలు ఉల్లంఘించిన
# భూములు స్వాధీనం





- రెండు సంస్థల నుంచి 17.77 ఎకరాల జాయింట్ వెంచర్ స్థలాలను వెనక్కి తీసుకున్న గృహ నిర్మాణ శాఖ
- శాఖ పరిధిలోని ఖాళీ స్థలాల్లో ప్రహరీగోడల నిర్మాణం
- భూములు ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

గృహ నిర్మాణాల విషయంలో నిబంధనలను ఉల్లఘించిన ''జాయింట్ వెంచర్'' కింద కేటాయించిన భూములను గృహ నిర్మాణ శాఖ స్వాధీనం చేసుకుంటుంది. ఎల్ఐజి గృహాల నిర్మాణం కోసం 'ఇందు ఈస్ట్రన్ ప్రావిన్స్ ప్రాజెక్ట్ లిమిటెడ్' సంస్థకు కేటాయించిన 10.41 ఎకరాల స్థలాన్ని, మధుకాన్ ప్రాజెక్ట్ నిమిత్తం కేటాయించిన 7.32 ఎకరాల స్థలాన్ని మొత్తంగా 17.77 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. యూనివర్సల్ డెవలపర్స్‌కు ఇచ్చిన పవర్ ఆఫ్ అటార్నీని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలాల్లో ప్రహరీగోడల నిర్మాణానికి రూ.25 కోట్లను మంజూరు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 28,499 రన్నింగ్ మీటర్ల ప్రహరీ గోడల నిర్మాణ పనులు వివిధ దశలో ఉన్నట్టు గృహ నిర్మాణ శాఖ తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ హౌసింగ్ బోర్డు 20 జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్ లను చేపట్టింది. ఇందులో 14 ప్రాజెక్ట్ లు పూర్తికాగా మిగిలిన ప్రాజెక్ట్‌లు కోర్టు వివాదాల్లో ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు కోర్టు వివాదాల్లో ఉన్న ప్రాజెకుల విషయంలో ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించేందుకు చర్యలు తీసుకున్నారు. తద్వారా వేల కోట్ల రూపాయిల తరువాయి 2లో

ఏదో ఒకనాటికి ఉక్రేన్
## రష్యాలో కలిసిపోవచ్చు!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు
అది కాదనలేని సత్యం : ద్మిత్రీ పెస్కోవ్



**న్యూయార్క్ :** ఏదో ఒకనాటికి ఉక్రేన్ రష్యాలో కలిసిపోవచ్చునని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. యుద్ధ విరమణకు సంబంధించి అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, ఉక్రేన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీల మధ్య ఈ వారంలోనే సమావేశం జరగనున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్య ప్రాధాన్యత సంతరించుకుంది. ఫాక్స్‌న్యూస్‌కు తరువాయి 12లో

కుంభమేళా నుంచి తిరిగొస్తూ
# మృత్యు ఒడికి హైదరాబాదీలు

మధ్యప్రదేశ్‌లో రెండు ఘోర రోడ్డు ప్రమాదాలు



- మొత్తం 9 మంది మృతి, మరో ఏడుగురికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఏడుగురు తెలంగాణ వాసులు
- నాచారం, రాఘవేంద్రనగర్‌లో విషాదఛాయలు

**జబల్‌పూర్/మైహర్/మేడ్చల్ :** మధ్యప్రదేశ్‌లో మంగళవారం రెండు ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, మైహర్ జిల్లాల్లో తెలంగాణకు చెందిన యాత్రికులు సహా మరి కొందరు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనల్లో మొత్తం 9 మంది దుర్మరణం చెందారు. కుంభమేళాకు వెళ్లిన తెలంగాణ వాసులు తిరిగి వస్తుండగా జబల్‌పూర్‌లో వారు తరువాయి 12లో

## కుల సర్వే చరిత్రాత్మకం

- రాజకీయాల్లో నైతిక విలువలు పాటించాలి
- ఓటర్ జాబితా, సర్వే లెక్కల మధ్య తేడా

శాసనమండలి చైర్మన్ గుత్తా

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి



దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ, కుల సర్వే నిర్వహించడం చరిత్రాత్మక నిర్ణయం అని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో తరువాయి 2లో

# గాజాలో మళ్లీ కమ్ముకుంటున్న యుద్ధ వాతావరణం!

## హమాస్‌కు మూడు రోజులే గడవు , లేకపోతే నరకమే

## బందీలను వదలకపోతే ఒప్పందం రద్దు: ట్రంప్ హెచ్చరిక




**వాషింగ్టన్ :** గాజాలో మళ్ళీ యుద్ధ వాతావరణం కమ్ముకు వస్తున్న ఛాయలు కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్ చేస్తున్న దారుణాలు, అమానవీయ ఉల్లంఘనలు సహించలేకపోతున్నామనీ,ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడుతున్నదనీ, అందువల్ల బందీల విడుదలను నిరవధికంగా వాయిదా వేస్తున్నామనీ హమాస్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెంటనే స్పందించారు.ఆయన మంగళవారంనాడు ఒక హెచ్చరిక చేస్తూ హమాస్‌కు మూడు రోజులు మాత్రమే గడువు విధించారు. రాబోయే శనివారం మధ్యాహ్నం నాటికి హమాస్ వద్ద ఉన్న మిగిలిన బందీలందరినీ విడుదల చేయకపోతే మధ్యవర్తుల ద్వారా జరిగిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ రద్దు చేసుకుంటుందని ప్రకటించారు. ఇక ఆ తర్వాత గాజాలో హమాస్ నరకం చూడాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు.దీంతో ఇజ్రాయెల్ తన సైన్యాన్ని తిరిగి యుద్ధానికి సర్వసన్నద్ధం చేసింది. ట్రంప్ హెచ్చరికలపై హమాస్ ప్రతినిధి ఒకరు తిగిరి స్పందించారు. గాజాను ట్రంప్ ఏనాటికీ నరకంగా మార్చలేరనీ, ఇలా చేసే బెదిరింపులకు ఎలాంటి విలువా ఉండబోదని ఎదురు హెచ్చరిక చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ గౌరవించాలని, ఈ విషయం వారికి చెప్పాలని ట్రంప్‌కు హమాస్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ తన సైన్యాన్ని సర్వసన్నద్ధం చేసింది. ఏ క్షణంలోనైనా కాల్పుల విరమణ ఒప్పందం రద్దుకావచ్చుననీ, తిరిగి దాడులకు సిద్ధం కావాలని సైన్యానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం నుండి ఆదేశాలు వెళ్ళాయి. హమాస్ వద్ద ఇంకా 79 మంది బందీలు ఉన్నారని అంచనా. ఒప్పందం ప్రకారం మార్చి 2వ తేదీలోపు 33 మంది బందీలను మాత్రమే హమాస్ విడుదల చేయాల్సి ఉంది. కానీ మిగిలిన వారిని కూడా విడుదల చేయాలని ట్రంప్ ఇప్పుడు షరతు విధించారు.ఇప్పటివరకూ 16 మంది బందీలను హమాస్ విడుదల చేసింది. ఒప్పందం ప్రకారం ఇంకా 17 మంది బందీలను హమాస్ విడుదల చేయాల్సి ఉంది. 566 మంది ఖైదీలను ఇప్పటివరకూ ఇజ్రాయెల్ విడుదల చేసింది. 2023 అక్టోబరు 7వ తేదీన హమాస్ దాడిచేసి 250 మందికిపైగా ఇజ్రాయెలీవాసులను బందీలుగా తీసుకుపోయింది. వీరిలో అనేకమంది మరణించగా కొందరు కాల్పుల విరమణ ఒప్పందానికి ముందే బయటపడ్డారు.

## జోర్డాన్,ఈజిప్టులకు హెచ్చరికలతో

# ట్రంప్‌పై పలుదేశాల విమర్శలు



**వాషింగ్టన్ :** గాజాను కొనుక్కుని, సొంతం చేసుకునేందుకు అమెరికా ప్రకటించిన రియల్ ఎస్టేట్ ప్రణాళికకు జోర్డాన్, ఈజిప్టు దేశాలు అంగీకరించకపోతే ఆదేశాలకు లభించే సహాయాన్ని పూర్తిగా నిలిపివేస్తామని ట్రంప్ హెచ్చరించారు. పాలస్తీనా ప్రజలు మరో పత్యామ్నాయం లేకపోవడం వల్లనే కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం గాజాకు తిరిగి వచ్చారని, వారంతా శిథిలాలమధ్య తిరుగాడుతున్నారనీ, అందువల్ల జోర్డాన్, ఈజిప్టు దేశాలు పాలస్తీనియన్లకు శరణార్థులుగా ఆశ్రయం ఇవ్వాలని, తాము గాజాను స్వాధీనం చేసుకుని ఒక సుందరమైన తీరప్రాంత అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ట్రంప్ అన్నారు. జోర్డాన్ రాజు అబ్దుల్లాతో సమావేశం జరగడానికి ముందుగా ట్రంప్ ఈ రెండు దేశాలకు హెచ్చరిక చేశారు. ఐతే కాల్పుల విరమణ ఒప్పందం మొదటి దశ పూర్తికాకముందే హమాస్ ఇలాంటి ప్రకటన చేయడానికి కారణాలు కూడా చెప్పింది. అదేపనిగా ఇజ్రాయెల్ సైన్యాలు తమపై కాల్పులు జరుపుతున్నాయనీ, కొన్ని రకాల మానవతా సహాయాన్ని గాజాలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారనీ, శిథిలాలను తొలగించడానికి బుల్‌డోజర్లను గాజాలోకి వెళ్ళేందుకు అనుమతించడంలేదనీ,ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో గడచిన మూడువారాలుగా జెనిన్ శరణార్థ శిబిరంపై దాడులు చేస్తున్నారనీ, ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో మౌలిక వసతులను బుల్‌డోజర్లతో కూల్చివేస్తున్నారనీ హమాస్ వెల్లడించింది. కాగా ఈజిప్టు అధ్యక్షుడు అల్ ఫతా అబ్దుల్ సిసి మాట్లాడుతూ, పాలస్తీనియన్లను తరలించకుండానే గాజా పునర్నిర్మాణ చర్యలు చేపట్టవచ్చునని అన్నారు. పాలస్తీనియన్లను గాజా నుండి తరలించాలన్న ట్రంప్ వాదనలను అల్ సిసి తిరస్కరించారు. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్ షారా కూడా ట్రంప్ ఆలోచనలను తిరస్కరించారు. నైతికంగా, రాజకీయంగా ఇది ట్రంప్ తప్పుడు నిర్ణయమన్నారు. ఈజిప్టు అధ్యక్షుడు ఎర్డొగాన్ స్పందిస్తూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేయడంలో ఇజ్రాయెల్ విఫలమైందని విమర్శించారు.

ప్రపంచం

# డిసెంబరులో బంగ్లా ఎన్నికలకు సన్నాహాలు



**ఢాకా :** రాబోయే డిసెంబరులో బంగ్లాదేశ్ పార్లమెంటు (హౌస్ ఆఫ్ నేషన్) ఎన్నికలకు ఇప్పటినుండే సన్నాహాలు జరుగుతున్నాయి.ఢాకాలోని ఎన్నికల సంఘం కార్యాలయంలో మంగళవారం ఉదయం బంగ్లాదేశ్ ఎన్నికల కమిషనర్ బ్రిగేడియర్ జనరల్ (రిటైర్డ్) అబ్దుల్ ఫజల్ హమ్మద్ సనుల్లా జాతీయ అంతర్జాతీయ మీడియా, పాత్రికేయులతో మాట్లాడుతూ డిసెంబరులో ఎన్నికలు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కోరుకుంటే సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేస్తామని ప్రకటించారు. రెండు ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించే విషయంపై కూడా చర్చ జరిగిందని, అందుకు ఎంత సమయం అవసరమనే విషయంపై కూడా చర్చించామన్నారు. బ్రిటన్, అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్, చైనా, దక్షిణ కొరియా దేశాల మీడియా ప్రతినిధులు కూడా ఈ పత్రికాగోష్ఠికి హాజరయ్యారు. గతంలో అన్నిస్థాయిలో ఎన్నికలను దశలవారీగా జరిపిన అనుభవాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. స్థానిక ఎన్నికలను గనుక దశలవారీగా నిర్వహిస్తే పార్లమెంటు ఎన్నికలు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. ''కానీ దేశంలో పార్లమెంటు ఎన్నికలకే ఇప్పుడు ప్రథమ ప్రాధాన్యత, దానిమీదే ప్రధానంగా దృష్టిపెట్టాం, ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికలను ముందుగానే జరపాలని ప్రభుత్వం ఆదేశిస్తే అలాగే చేస్తాం'' అన్నారు.

**మహిళలకు 50 సీట్లు రిజర్వేషన్**

బంగ్లాదేశ్ పార్లమెంటును జతియా సంగ్సద్ లేదా హౌస్ ఆఫ్ నేషన్ అని పిలుస్తారు. ప్రస్తుత బంగ్లాదేశ్ పార్లమెంటులో 350 స్థానాలు ఉన్నాయి. వీటిల్లో మహిళలకు ప్రత్యేకంగా 50 స్థానాలను రిజర్వు చేశారు. 2024 జనవరి 7న షేక్ హసీనా సారథ్యంలో బంగ్లాదేశ్ 12వ పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. ఐతే దేశంలో సంక్షోభం వల్ల ఆమె గత ఏడాది ఆగస్టులో దేశం వదలి భారత్‌లో ఒకచోట తలదాచుకున్నారు. బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ ఆగస్టు ఆరోతేదీన బంగ్లాదేశ్ పార్లమెంటును రద్దుచేశారు. 2008 నుండి జరుగుతున్న ఎన్నికల్లోబంగ్లాదేశ్ పార్లమెంటులో షేక్ హసీనా పార్టీయే ఆధిక్యంలో ఉంటున్నది. ఇప్పుడు ఆమె పార్టీని ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించారు. కాగా, రాబోయే డిసెంబరులో పార్లమెంటు ఎన్నికలు బంగ్లాదేశ్ దేశ చరిత్రలోనే అత్యుత్తమస్థాయిలో జరగాలని ఐక్యరాజ్యసమితి డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యుఎన్‌డిపి) ఆశాభావం వ్యక్తం చేసింది. ''మేం బంగ్లాదేశ్ ఎన్నికల సంఘానికి పూర్తి మద్దతు తెలియజేస్తాం, చాలా స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఈ ఎన్నికలు జరగాలని ఆశిస్తున్నాం'' అని బంగ్లాదేశ్‌లో నివాసం ఉంటున్న యుఎన్‌డిపిఅధికార ప్రతినిధి స్టీఫెన్ లిల్లెర్ అన్నారు.

# స్టీల్, అల్యూమినియంపై మార్చి 12 నుండి ట్రంప్ టారిఫ్‌లు

## భారత్ దేశీయ మార్కెట్‌లో ఇక చవగ్గా స్టీల్!





**వాషింగ్టన్ :** స్టీలు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా విధించిన 25 శాతం టారిఫ్‌లు మార్చి 12వ తేదీ నుండి అమలులోకి వస్తాయి. పొరుగున మెక్సికో, కెనడాలతోపాటు ఆసియాలో భారత్ సహా కొన్ని మిత్రదేశాలపై ఈ టారిఫ్‌ల భారం పడుతుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు ఈ విషయం చెప్పారు. దీనిపై యూరప్ స్పందిస్తూ కొత్త టారిఫ్‌ల నుండి రక్షణ చర్యలు తీసుకుంటామని, ప్రతిఘటిస్తామని ప్రతి హెచ్చరిక చేసింది. కెనడా 6 మిలియన్ టన్నులు, బ్రెజిల్ 4.1 మిలియన్ టన్నులు, మెక్సికో 3.2 మిలియన్ టన్నులు, దక్షిణకొరియా 2.5 మిలియన్ టన్నులు, వియత్నాం 1.2 మిలియన్ టన్నులు, జపాన్ 1.1 టన్నులు స్టీలును ఏటా అమెరికాకు ఎగుమతి చేస్తూ ఉంటాయి. భారత్ గత ఏడాది 95,000 టన్నుల స్టీలు ఎగుమతి చేసింది.చైనా విధించిన 25 శాతం టారిఫ్‌లు సోమవారం నుండి అమలులోకి వచ్చిన తర్వాత ట్రంప్ ఈ ప్రకటన చేశారు. భారత్, కెనడా, బ్రెజిల్, యూరప్, బ్రిటన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, వియత్నాం, జపాన్ తదితర దేశాలపై ఈ సుంకాలు విధించారు. ఈ సుంకాలు భారత్‌పై పెద్దగా ప్రభావం చూపించబోవని సంబంధిత భారత్ స్టీల్ విభాగం కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ స్పష్టం చేశారు. భారత్ గత ఏడాది 145 మిలియన్ టన్నుల స్టీలు ఉత్పత్తి చేయగా అందులో 95 వేల టన్నులు స్టీలు మాత్రమే అమెరికాకు ఎగుమతి చేసినట్లు సందీప్ పౌండ్రిక్ చెప్పారు. కానీ భారత్ స్టీల్ అసోసియేషన్ అధిపతి నవీన్ జిందాల్ స్పందిస్తూ, అమెరికా టారిఫ్‌ల ప్రభావం వల్ల ఇకమీదట చాలా తక్కువ ధరలకు స్టీల్ ఉత్పత్తులు కుప్పతెప్పలుగా భారత్ మార్కెట్‌లో దొరుకుతాయని, దేశీయంగా స్టీల్ ధరలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ టారిఫ్‌ల వల్ల అమెరికాకు చేసే స్టీలు ఎగుమతులలో 85 శాతం మేరకు తగ్గే అవకాశాలు ఉంటాయనీ, స్టీలు మిగులు ఉత్పత్తులు ఉంటాయనీ, ఈ మిగులు భారత్ మార్కెట్లను ముంచెత్తి ధరలు తగ్గుతాయనీ ఆయన అన్నారు. ఐతే సుంకాలను తగ్గించే విషయం పరిశీలిస్తానని ట్రంప్ చెప్పారని ఆస్ట్రేలియా ప్రకటించింది. బ్రిటన్ ప్రభుత్వం నుండి ఈ సుంకాల పెంపుపై వెంటనే అధికారికంగా ఎలాంటి స్పందనా ఇవ్వలేదు. కానీ ఆ దేశ సంస్థ మాత్రం స్పందిస్తూ, బ్రిటన్ స్టీలు పరిశ్రమకు ఇది పెద్ద వినాశకరమైన విఘాతమని పేర్కొంది. ఎంతమాత్రం సమర్థించడానికి వీలులేని టారిఫ్‌లపై వ్యాఖ్యలు చేయడం వృథా అని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండర్‌లేయన్ అన్నారు. ఐతే దీన్ని చూస్తూ ఊరుకోబోమని, గట్టి సమాధానం చెబుతామని ఆమె అన్నారు. ట్రంప్ చర్యలవల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోతుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ హెచ్చరించారు. ఇక అమెరికా ఐరన్ అండ్ స్టీల్ ఇనిస్టిట్యూట్ సమాచారం ప్రకారం, దక్షిణ కొరియా అత్యధికంగా అమెరికాకు స్టీలు ఎగుమతులు చేస్తుంది. అమెరికా, మెక్సికోలలో ఉన్న కియా, హ్యుందాయ్, శాంసంగ్, ఎల్‌జి వంటి సంస్థల ఫ్యాక్టరీలు దేశీయ మార్కెట్ అవసరాల నిమిత్తం వాటిని వాడుకుంటాయి.

## ఉప ఎన్నికలు ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు కెసిఆర్ సమక్షంలో బిఆరఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా మాజీ సిఎం కెసిఆర్ మాట్లాడుతూ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు తెలంగాణ ప్రజలు గట్టిగా బుద్ధి చెపుతారన్నారు. స్టేషన్ ఘనపూర్‌లో ఉప ఎన్నిక తప్పక వస్తుందని, కడియం శ్రీహరి ఓడిపోయి తాటికొండ రాజయ్య ఎమ్మెల్యేగా గెలుస్తారన్నారు. ఈ నెల 15న తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమక్షంలో స్టేషన్‌ఘనపూర్ నియోజక వర్గం నుండి సుమారు వెయ్యి మంది బిఆర్‌ఎస్‌లో చేరిక కార్యక్రమం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తీవ్ర వ్యతిరేకత భావంతో ఉన్నారన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు.

## బర్డ్ ఫ్లూపై రాష్ట్రం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లకు పశు సంవర్ధక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆయా జిల్లాలోని కోళ్ల ఫారాల్లో కోళ్లు చనిపోతే వెంటనే సంబంధిత వెటర్నీ దవాఖానలో సమాచారం ఇవ్వాలని కోళ్ల ఫారాల యాజమానులకు సూచించింది. బయోసెక్యూరిటీ చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, తద్వారా 'పక్షి ఫ్లూ' వ్యాప్తిని అడ్డుకోవడంతో పాటు, పౌల్ట్రీ రంగాన్ని రక్షించేందుకు అవకాశాలు ఉంటాయని పశుసంవర్ధక శాఖ సూచించింది. పొరుగు రాష్ట్రాలలో వైరస్ ప్రబలుతున్నందున ఆయా జిల్లాల నుంచి తెలంగాణ రాష్ట్రానికి కోళ్లు రాకుండా అధికార వర్గాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్దనే పొరుగు రాష్ట్రాల నుంచి వస్తున్న కోళ్ల వాహనాలను తిరిగి వెనక్కి పంపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్న కోళ్ల వాహనాలను కూడా వెనక్కి పంపించారు. రాష్ట్రంలోని పలు కోళ్లఫారాలపై ప్రత్యేక నిఘా పెంచాలని, ఎక్కడైనా అనుమానిత కేసులు నమోదైతే వెంటనే వెటర్నరీ విభాగానికి సమాచారం ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అనారోగ్యమైన కోళ్లను కోళ్ల ఫారాల నుంచి సురక్షితంగా తరలించాలని, అలాగే చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించాలని పశుసంవర్ధక శాఖ తెలిపింది. అటవీ, పోలీస్ శాఖ, ఆరోగ్య,, వెటర్నరీ,పశుసంవర్ధక శాఖలతో ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని, క్షేత్ర స్థాయి పరిస్థితులను అంచనా వేసి, తీసుకుంటున్న చర్యలపకైన ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ ఉత్తర్వులు జారీ చేశారు.

## మెరిసిన తెలంగాణ బిడ్డ

(మొదటి పేజీ తరువాయి)

14 మంది జనరల్ కేటగిరీకి చెందినవారు, ఉండగా, ఒకరు ఒబిసి, ఒకరు ఎస్‌సి కెటగిరీకి చెందిన వారు ఉన్నారు. 100 ఎన్‌టిఎ స్కోరు సాధించిన అభ్యర్థులలో ఐదుగురు రాజస్థాన్ నుండి, ఇద్దరు చొప్పున ఢిల్లీ , ఉత్తరప్రదేశ్ నుండి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, గుజరాత్, తెలంగాణ మరియు మహారాష్ట్ర నుండి ఒక్కొక్కరు ఉన్నారు. జెఇఇ మెయిన్ మొదటి సెషన్ పరీక్షను జనవరి 22 వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ జెఇఇ మెయిన్ మొదటి సెషన్‌కి మొత్తం 13.11 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 12.58 లక్షల మంది మాత్రమే హాజరయ్యారు. జెఇఇ మొదటి ఎడిషన్ జనవరి–ఫిబ్రవరిలో నిర్వహించగా, రెండవ ఎడిషన్ ఏప్రిల్‌లో జరగనుంది. పేపర్ 1ష పేపర్ 2 ఫలితాల ఆధారంగా, 23 ప్రీమియర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటిలు)లో ప్రవేశం పొందడానికి వన్‌స్టాప్ పరీక్ష అయిన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరు కావడానికి అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. జెఇఇ (మెయిన్)2025 పరీక్ష రెండు సెషన్ల తర్వాత, ఇప్పటికే రూపొందించిన విధానానికి అనుగుణంగా రెండు ఎన్‌టిఎ స్కోర్‌లలో ఉత్తమమైన వాటిని పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ర్యాంకులను విడుదల చేస్తారు.

## భూములు స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి)

విలువ చేసే 18 ఎకరాల భూములను రెండు సంస్థల నుంచి స్వాధీనం చేసుకున్నారు. జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్ ద్వారా ఎంతో కాలంగా రెవెన్యూ వాటాగా హౌసింగ్ బోర్డుకు రావాల్సిన రూ.589 కోట్లకు గాను గత ఏడాది రూ.45 కోట్లను వసూలు చేశారు. అల్పాదాయ, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలకు ఇళ్ల నిర్మాణానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం హౌసింగ్ బోర్డును ఏర్పాటు చేసింది. హౌసింగ్ బోర్డు, దిల్ పరిధిలో ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలోనే ఐదు వందల ఎకరాల భూములు ఉన్నట్టు గృహ నిర్మాణ శాఖ తెలిపింది. గతంలో సరైన పర్యవేక్షణ, పరిరక్షణ లేకపోవడంతో పలు ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు భూములు ఆక్రమణలకు గురయ్యాయి. భూముల ధరలు భారీగా పెరగడంతో భూములు కబ్జాలు పెరిగాయి. మరి కొన్ని కోర్టు వివాదాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిని రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**భూముల రక్షణకు సిసి కెమెరాలు**

ప్రభుత్వ భూముల రక్షణకు గృహ నిర్మాణ శాఖ సి.సి.కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు సెక్యూరిటీ గార్డులను నియమిస్తుంది. రానున్న కాలంలో సిసిటీవీలను కూడా శాటిలైట్ మానిటరింగ్ విధానంతో అనుసంధానం చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (దిల్),హౌసింగ్ బోర్డ్‌కు సంబంధించిన ఖాళీ స్థలాలకు జియోట్యాగింగ్ చేయడం ద్వారా ఆ విలువైన భూములను కాపాడేందుకు గృహ నిర్మాణ శాఖ చర్యలు తీసుకుంటుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలకు డిజిపిఎస్ సర్వే నిర్వహించడంతో పాటు, ఆ భూములకు జియోట్యాగ్ చేసింది. హౌసింగ్ బోర్డుకు చెందిన 703 ఎకరాల ఖాళీ స్థలాలకు జి.పి.ఆర్.ఎస్ సర్వే నిర్వహించింది. 410 ఎకరాల భూములకు 18 ప్యాకేజీల కింద రూ.10 కోట్ల విలువైన టెండర్లను ఆహ్వానించి, పనులు చేపట్టగా, ఇప్పటికి ప్రహరిగోడల నిర్మాణం దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నాయి. 'దిల్'కు సంబంధించిన 943.52 ఎకరాల భూములకు 15 ప్యాకేజీల కింద రూ.10 కోట్ల అంచనాతో టెండర్లను ఆహ్వానించగా ప్రహరిగోడ నిర్మాణ పనులు జూన్ నెలాఖరులోగా పూర్తి కానున్నాయి.

**భూములను ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హౌసింగ్ బోర్డు ఆధీనంలోని భూములను చట్టవిరుద్ధంగా ఆక్రమించిన వ్యక్తులపైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని గృహ నిర్మాణ,రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వానికి సంబంధించిన గజం స్థలం కూడా ఆక్రమణకు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హౌసింగ్ బోర్డ్ , దిల్ ఆధీనంలో వేల కోట్ల రూపాయిల విలువచేసే భూములు ఉన్నాయని, ఈ భూముల పరిరక్షణకు తమ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని వివరించారు. హౌసింగ్ బోర్డు భూములను జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్ పేరుతో గత ప్రభుత్వాలు ప్రైవేటు సంస్థలకు అప్పగించిందని వివరించారు. నిబంధనలను ఉల్లఘించిన ఆయా సంస్థల నుంచి భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

## మేలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వెనుకబాటుతనం ఆధారంగానే వర్గీకరణ చేస్తే ఆ సూత్రాన్నే గ్రూపు1, గ్రూపు 2, గ్రూప్3 లకు వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కోరారు. సిఎంతో భేటీ అనంతరం మీడియాతో మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వం ఆమోదించిన నివేదికలోని లోపాలను సవరించి, అన్ని కులాలకు సమన్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తూ పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువస్తూ విజ్ఞాపన పత్రాన్ని సమర్పించామని, వాటిని పరిశీలించి తగు సవరణలు చేయాలని కోరినట్లు తెలిపారు. లోపాలను సరిచేసిన తరువాతనే ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత చేయాలని, ఎస్‌సి వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చి ఎస్‌సిలలోని అన్ని కులాలకు తగిన న్యాయం జరిగేలా చూడాలని మంద కృష్ణ సిఎంను కోరారు. ఎస్‌సి ఉప కులాలకు రిజర్వేషన్ల కేటాయింపులో గానీ, ఏ కులాలను, ఏ గ్రూపులలో చేర్చాలనే విషయంలో గానీ నిష్పక్షపాతమైన, శాస్త్రీయతను పాటించలేదని, ఇందులో కొన్ని లోపాలు జరిగాయన్నారు. ఎస్‌సి వర్గీకరణలో మొదటి గ్రూపు1లో ఉన్న కులాలకు 1 శాతం రిజర్వేషన్ కేటాయించడానికి అందుకు తగిన జనాభా లేనప్పటికీ వెనుకబాటుతనం ప్రాధాన్యతగా తీసుకుని వీరికి 1 శాతం రిజర్వేషన్ కేటాయించారని, ఎస్‌సి కులాల్లో ఏకైక అతిపెద్ద జనాభా సంఖ్య 62 శాతం (32,33,642) కలిగి ఉండి కూడా అన్ని రంగాల్లో వెనుకబడిన మాదిగ కులానికి కేటాయించబడిన రిజర్వేషన్ శాతంలో అన్యాయం జరిగిందని, దీనికి విరుద్ధంగా ఎస్‌సి జనాభాలో రెండవ స్థానంలో 29 శాతం (15, 27,143 ) ఉండి అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన మాల కులానికి తమ జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్ కేటాయించారని మంద కృష్ణ వివరించారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, ఉద్యోగపరంగా, రాజకీయంగా, అత్యంత వెనుకబడిన, పట్టించుకోని గ్రూపు1లో పేర్కొనబడిన కులాల జాబితాలో గతంలోనే మెరుగైన ప్రయోజనం పొంది బి, సి గ్రూప్‌లలో చేర్చబడి ఉన్న మన్నె, కొలుపుల వాండ్లు, పంబాడ, పంభాలా, ముండాల, సంబన్, కులాలను కలిపారని, ఈ కులాలను గ్రూప్3లో చేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మధ్యస్తంగా లబ్ధి పొందిన ఎస్‌సి కులాల జాబితా గ్రూపు2లో 18 కులాలను పొందుపరిచారని, వీటిలో ఎల్లమ్మల్వార్, ఎలమ్మలవాండ్లు, పంచమ, పరయ అనే కులాలను గతంలో సి, డి గ్రూప్‌లలో ఉండగా, ప్రస్తుత నివేదిక ప్రకారం గ్రూప్–2 లో చేర్చారని, ఈ కులాలను తిరిగి గ్రూప్3లో చేర్చాలని ఆయన సూచించారు. గ్రూప్3లో పేర్కొనబడిన చర్మకార వృత్తి కులం అయిన ధోర్ కులాన్ని, ప్రస్తుతం గ్రూప్1లో చేర్చిన మాంగ్ గరోడి కులాన్ని గ్రూప్2లో చేర్చాలని, అలాగే గ్రూప్3లో ఉన్న పాకి, మోటి, తోటి, రెల్లి కులాలను గ్రూప్1లో చేర్చాలని ముఖ్యమంత్రిని కోరారు. ఎస్‌సి జనాభాలో 4వ స్థానంలో ఉన్న భేడబుడగ జంగం కులానికి (1,11,710), మరికొన్ని కులాలను కలిపి (1,71,625) జనాభాతో గ్రూప్1 ఏర్పాటు చేశారని, ఇదే తరహాలో జనాభాలో 3వ అతిపెద్ద 1,33,072 మంతి జనాభా కలిగిన నేతకాని కులానికి మహర్, హోలియదాసరి వంటి మరికొన్ని కులాలను కలిపి గ్రూప్3గా ఏర్పాటు చేయాలని, సామాజికంగా, ఆర్థికంగా, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అత్యంత ప్రయోజనాలు పొందిన మాల, ఇతర కులాలన్నింటిని కలిపి గ్రూప్4గా ఏర్పాటు చేయాలని ఆయన సిఎంను కోరారు.

## ఎఐ లక్ష్యం (మొదటి పేజీ తరువాయి)

ఉచితంగా అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని, ప్రజల ప్రయోజనాలు మెరుగుపరచడంకోసం ఆ సాంకేతికతను పునఃపంపిణీ చేసేందుకు వీలు కల్పించాలని, ఆ విధంగా సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో అభివృద్ధికరమైన మార్పులు చేర్పులకు అవకాశం ఉండేట్టు చూడాలని కోరారు. సాంకేతికత మూలాలు స్థానికంగా ఉండాలని, మానవజాతికి మేలుచేసేవిధంగా జీవావరణవ్యవస్థ అభివృద్ధికి భవిష్యత్ మార్పులు చేర్పులకు వీలుగా కృత్రిమమేధ రూపొందాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమమేధ శక్తిసామర్థ్యాలను ప్రస్తుతిస్తూ మోదీ తన ప్రసంగం ప్రారంభించారు. వైద్యరంగంలో ఉన్న అర్థంకాని చిక్కుముడుల భాషను, సంక్షిప్తమైన ఔషధ చీటీల భాషను కృత్రమమేధ సంక్షిప్తీకరించి అందరికీ అర్థమయ్యేలా ఎంతో సులభతరం చేసిందన్నారు. తద్వారా కృత్రిమమేధ తన విశ్వాసాన్ని, బాహాటత్వ విధానాన్ని నిరూపించుకుందన్నారు. 100 దేశాలకు చెందిన ప్రముఖులు, ప్రపంచ అత్యున్నత సాంకేతిక కంపెనీల సిఇఓలు, అడ్వాన్స్‌డ్ హైటెక్ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో మోదీ ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకించారు. ఫ్రాన్స్‌తోపాటు ఈ సదస్సుకు భారత్ సహాభాగస్వామ్యం వహించి ఆతిథ్యం ఇచ్చింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తోపాటు ఈ సదస్సుకు మోదీ సహాధ్యక్షత వహించారు. ఉమ్మడి కృషితో ప్రపంచదేశాలు రూపొందించే ఈ కృత్రిమ మేధ నిబంధనలలో బాహాటత్వం ఉండాలని అన్నారు. రాజనీతిశాస్త్రం, ఆర్థికశాస్త్రాలతోపాటు భద్రత, అంతర్జాతీయ సమాజం కూడా కృత్రిమ మేధవల్ల భారీ మార్పులకు గురవుతోందని అన్నారు. లాభాపేక్షలేని ఒక సంస్థ తరహాలో ఈ శతాబ్దంలో మానవజాతి చరిత్రను, మానవతను కృత్రిమ మేధ తిరగరాస్తోందని అన్నారు. ఈ పరిస్థితులలో కృత్రిమ మేధను కట్టడిచేసి చట్టబద్ధంగా నిర్వహించాలన్నారు. చట్టబద్ధ నిర్వహణ అంటే కేవలం కేవలం అంతర్జాతీయ నిబంధనలలో, ఆపదలను, శత్రుత్వాలను సమర్థవంతంగా నియంత్రించగలగడమో కాదనీ, నవకల్పనలను ప్రోత్సహించేందుకు, ప్రపంచానికి మంచి చేసే విధంగా ఉపయోగించడమేననీ అన్నారు. ప్రామాణికతలు నెలకొల్పడానికి, ప్రపంచవ్యాప్తంగా మానవజాతి వివిధ ప్రాంతాలలో నెలకొల్పిన మహోన్నతమైన విలువలను సమున్నతంగా నిలబెట్టడానికి ప్రపంచ దేశాలు ఉమ్మడి కృషి చేయడం ద్వారా కృత్రిమ మేధకు నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని మోదీ ఉద్ఘాటించారు. తన భావాలను అందరి ఆలోచనల్లో చేరేందుకు, వారిని ఒప్పించేందుకు ఈ అంతర్జాతీయ వేదికపై తన వాదనను వినిపించారు. పారిస్ సదస్సుకు వెళ్ళగానే మోదీని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ గాఢాలింగనం చేసుకుని ఆహ్వానం పలికారు. ''నా స్నేహితుణ్ణి కలుసుకోవడం నాకెంతో ఆనందం కలిగించింది'' అని మోదీ ఎక్స్ వేదికగా తన భావాలు పంచుకున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌తో కలిసి మోదీ రాత్రి డిన్నర్ చేశారు. ఆయనతో కరచాలనం చేశారు. ఆయన పార్టీ సాధించిన ఘనవిజయంపట్ల అభివనందనలు తెలియజేశారు.

**ఎఐతో ఉద్యోగాలు పోవు**

**పని విధానం మారుతుంది**

కృత్రిమమేధ ప్రవేశంతో పనివిధానంలో మార్పులు జరుగుతాయి తప్ప ఉద్యోగ నష్టం జరగదని మోదీ అన్నారు. కృత్రిమమేధవల్ల ఉద్యోగ నష్టం జరుగుతుందన్న ఆందోళనలపై ఆయన మాట్లాడారు. సాంతికేతికతవల్ల మన పని అదృశ్యమైపోదనీ, మనం చేసే పనివిధానంలో మార్పులు వస్తాయనీ మోదీ అన్నారు. కొత్త తరహా ఉద్యోగాలు మనకు లభిస్తాయని అన్నారు. ఎ ఐ శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ, ప్రజల నైపుణ్యం, పునఃనైపుణ్యంలో పెట్టుబడులతో కృత్రిమమేధ భవిష్యత్తులోకి నడిపిస్తుందన్నారు. ''ఎ ఐ ద్వారా ఉద్యోగనష్టం జరుగుతుందన్నది ఎక్కువమంది భయపడేవిషయం, కానీ చరిత్రను చూస్తే మానవశ్రమ ఎప్పటికీ అదృశ్యం కాలేదు, మానవశ్రమలో మార్పులు చేర్పులు సంభవించాయి, కొత్త రకం ఉద్యోగాల సృష్టి జరిగింది, సాంకేతికత దానికి తోడైంది, నైపుణ్యంలో, పునఃనైపుణ్యంలో మనకు పెట్టుబడులు ఎంతో అవసరం, ఈ శతాబ్దంలో మానవత్వాన్ని కృత్రిమమేధ లిఖించింది, ఇతర సాంకేతికతలకంటే ఎ ఐ చాలా భిన్నమైనది, మానవజాతి చరిత్రలో ఎ ఐ ఒక మైలురాయి, ఇది ఇప్పటికే రాజకీయాలకు, ఆర్థికవ్యవస్థకు, మన భద్రతకు పునఃరూపాన్ని ప్రసాదించింది, చివరకు మన సమాజానికి కూడా చాలా పెద్ద పునఃరూపాన్ని ఇచ్చింది, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం వంటి అనేక రంగాలలో మార్పుల ద్వారా మానవజాతి జీవితాలను ప్రభావితం చేసింది, మార్చేసింది కృత్రిమమేధ'' అని మోదీ అన్నారు.

## కుల సర్వే చరిత్రాత్మకం

(మొదటి పేజీ తరువాయి)

అయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో నిర్వహించిన విధంగా 94,863 ఎనిమినేటర్స్ 9628 సూపర్వైజర్స్, 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా కేవలం 50 రోజుల్లో ఈ సర్వే నిర్వహించడం జరిగిందని ఈ సర్వేలో 97 ప్రజలు 97శాతం వివరాలు నమోదు చేసుకున్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న జనాభా లెక్కలకు ప్రభుత్వ నిర్వహించిన సర్వే లెక్కలు సరి కావడం లేదు, దీనికి ప్రధాన కారణం ఒక్కొక్కరికి రెండు చోట్ల ఓట్ల హక్కు ఉండటం, ఓటర్ జాబితాని ఆధార్ కి అనుసంధానం చేయకపోవడం ఒక ప్రధాన కారణం అన్నారు.కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం సర్వే లెక్కలు తప్పుల తడఖా అని విమర్శలు చేయడం సబబు కాదు. ప్రభుత్వం చేసిన కృషిని ఏ పార్టీ వారైనా అభినందించాలన్నారు. 3 లక్షల కుటుంబాలు సర్వే అధికారులకు వివరాలు ఇవ్వలేదు .వారు కూడా ఇప్పుడు వివరాలు ఇవ్వవచ్చు అని పరోక్షంగా బిఆర్‌ఎస్ నాయకులను విమర్శించారు.సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉన్నతాధికారులను,అధికారులను అభినందిస్తున్నాను గత పది సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డ్స్ లబ్ధిదారులు ఎదురు చూస్తూనే ఉన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుత ప్రభుత్వం రేషన్ కార్డ్స్ ను ఇస్తుంది అలాగే బిపిఎల్,ఏపీఎల్ కార్స్ ఇవ్వాలని తను ముఖ్యమంత్రి కి లేఖ రాశాను. దీనికి సీఎం అనుకూలంగా స్పందించారు అని తెలిపారు.బిపిఎల్,ఎపిఎల్ కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 12,728 గ్రామపంచాయతీలో బిసిలకు రిజర్వు చేసిన స్థానాలు 2625 అంటే 20.62 శాతం, కానీ మొత్తం బీసీ అభ్యర్థులకు గెలిచిన స్థానాలు 4274 అంటే 33 శాతం,అలాగే ఎంపీటీసీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం స్థానాలు 571 అందులో బీసీలకు కేటాయించిన స్థానాలు 12 24 అంతే 21 కానీ బిసి అభ్యర్థులు జనరల్ స్థానాలు వారికి కేటాయించిన సీట్లు అన్నీ కలిపి 22 అంటే 38 గెలిచారు. రాజకీయాల్లో నైతిక విలువలు పాటించాలి.అధికారులు ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం సబబు కాదన్నారు.

# సంస్కరణల పేరుతో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంస్కరణల పేరుతో మోదీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ విమర్శించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యావ్యవస్థను దెబ్బతీసే విధంగా పాలన సాగిస్తోందని, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయాలని కుట్రలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. యుజిసి నిబంధనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు ఎఐఎస్ఎఫ్ ఒయు కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విరాజ్ దేవాంగ్, దినేష్ సిరంగరాజ్ మీడియాతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం జాతీయ విద్యావిధానం పేరుతో విద్య కాషాయీకరణకు పూనుకుంటుందన్నారు. యుజిసి ముసాయిదా ప్రతిపాదనలు రాష్ట్రాల హక్కులను, నిర్ణయాధికారాన్ని బలహీన పరుస్తూ మొత్తంగా ఫెడరల్ స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ ,రాజ్యాంగ మూల సూత్రాలకు వ్యతిరేకంగా ఉన్నదని వారు మండిపడ్డారు. గవర్నర్ చేతిలో విసిల నియామక బాధ్యత అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్రం తన సొంత ఎజెండాను వర్సిటీలలో అమలుపరిచేందుకు కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ.స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రం ఒకొక్కటిగా తమ ఆధీనంలోకి తీసుకుంటూ, రాష్ట్రాలపై తన విధానాలను బలవంతంగా రుద్దుతోందని దుయ్యబట్టారు. ఇప్పటికే తమిళనాడు, కేరళ వంటి అనేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు యుజిసి నిబంధనలకు, గవర్నర్లతో విసిల నియామకాన్ని వ్యతిరేకిస్తూ నిర్ణయం తీసుకున్నాయని వారు వివరించారు. యుజిసి ప్రతిపాదనలను వ్యతిరేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. ఈ మీడియా సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు గ్యార నరేష్, ఒయు అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య, నాయకులు ఆరెకంటి భగత్,ఉప్పల ఉదయ్,అశ్వన్,ప్రసాద్, దిలీప్, గోపగోని ఉదయ్ సలీం, పేర్ల రాము పాల్గొన్నారు.

# మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** దేశంలో రానున్న రోజులలో మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దేశంలో అనేక రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బిజెపిని ఓడించడంలో చతికిలపడిందని అన్నారు. మరో వైపు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని అన్నారు. భారత దేశంలో మావోయిస్టులు తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అన్న తమ పంథాను వీడి ప్రజా స్వామ్య ఉద్యమాలలో కమ్యూనిస్టులతో కలిసి రావాలని అన్నారు. చీలిపోయిన కమ్యూనిస్టులు సైతం ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు పెరిగిపోతున్నాయని, రూపాయి పతనంతో మరింత ఆర్థిక మాంద్యం ఏర్పడిందని అన్నారు.

ఈ క్రమంలో ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారని, దేశంలో మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలిచారని అన్నారు. తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీకి బలమున్న స్థానాలలో పోటీకి సమాయత్తం కావాలని అన్నారు. ఈ సందర్భంగా సిపిఐ శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో పార్టీ జిల్లా నాయకులు, మండల కార్యదర్శులు, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు పార్టీ సాహిత్యం, బుక్‌లెట్‌లు, మెమెంటోలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి , జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునగాల బిక్షపతి, నాయకులు జక్కు రాజుగౌడ్, వేల్పుల సారంగపాణి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, అనుకారి అశోక్, మాలోతు శంకర్ నాయక్, రాసమల్ల దీనా, కండె నర్సయ్య, ఏదునూరి వెంకట్రాజం, రమేష్ దీవా, నిమ్మల మనోహర్, రమా, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, గోకన రాజయ్య, ఇల్లందుల రాములు, కొంగర రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే..

# జనాభా లెక్కలు తప్పనిసరి

బిఆర్ఎస్ మాజీ ఎంపి వినోద్‌కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలనే డిమాండ్ నుంచి తప్పించుకునేందుకే మోదీ ప్రభుత్వం ప్రతి పదేళ్ల కోసారి జరిగే 'జనగణన'ను చేపట్టడం లేదని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే జనాభా లెక్కలు తప్పనిసరి అని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, లీగల్‌సెల్ సభ్యులు సి.కళ్యాణ్‌రావుతో కలిసి వినోద్‌కుమార్ మాట్లాడుతూ జనాభా లెక్కలు తీయకపోవడంతో ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత చట్టం స్ఫూర్తి దెబ్బ తింటుందని, మహిళా రిజర్వేషన్లకు కూడా విఘాతం కలుగుతోందని మండిపడ్డారు. కొత్త జనాభా లెక్కల ప్రకారమే మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు కావాలని, కానీ మహిళా రిజర్వేషన్లను మరో 20 ఏళ్లు వాయిదా వేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పార్లమెంటు జీరో అవర్‌లో సోనియా గాంధీ జనగణనకు సంబంధించిన మంచి అంశాన్ని ప్రస్తావించారని వినోద్‌కుమార్ అన్నారు. జనాభా లెక్కలను ప్రతీ పది సంవత్సరాలకోసారి నిర్వహించాలని, ఇది బ్రిటిష్ కాలం నుంచి ఆనవాయితీగా కొనసాగుతోందని వినోద్ కుమార్ గుర్తుచేశారు. బడ్జెట్‌లో జనాభా లెక్కలకు కేటాయించింది కేవలం రూ.574 కోట్లు మాత్రమేనని అన్నారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే జనాభా లెక్కలపై ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేసి, అందుకు తగిన నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. పట్టభద్రుల ఎన్నికల్లో బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కయిందని పిసిసి అధ్యక్షుడు మహేష్‌గౌడ్ వ్యాఖ్యానించడాన్ని ఆయన ఖండించారు. బిఆర్ఎస్ ఎంఎల్‌సి ఎన్నికలకు దూరంగా ఉండేందుకు ప్రత్యేక కారణాలు ఏమీ లేవని, ఇదివరకు కూడా బిఆర్ఎస్ పోటీకి దూరంగా ఉన్న సందర్భాలూ ఉన్నాయని వినోద్ కుమార్ అన్నారు. ఎంఎల్‌సి ఓటర్ల నమోదు ప్రక్రియ బ్రిటీష్ కాలం నాటి పద్ధతులు అమలులో ఉన్నాయని, వాటిని మార్చాలని అన్నారు.

# కులగణనపై బిఆర్ఎస్, బిజెపికి మాట్లాడే నైతిక హక్కు లేదు

కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులకు సర్వే ఫాంలు పంపుతున్నాం

బిసిలకు న్యాయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోంది

ప్రగతిశీల భావాలుంటే అర్బన్ నక్సలైట్లు అవుతారా?

రాష్ట్ర రవాణా, బిసి శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** దేశంలోనే మార్గదర్శకంగా కులగణన సర్వే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాంగ్ డైరెక్షన్‌లో పోయేలా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ప్రవర్తిస్తున్నాయని, ఆ రెండు పార్టీలకు కులగణనపై మాట్లాడే నైతిక అర్హత లేదని విమర్శించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మొన్నటి సర్వేలో పాల్గొనని కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావుకు ఫామ్‌లు పంపుతున్నామని ఎద్దేవా చేశారు. బిజెపికి చేతనైతే దేశవ్యాప్త సర్వేకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనుమతి తీసుకోవాలన్నారు. బిసిలకు న్యాయం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. కులగణన సర్వేపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ రీసర్వే చేస్తే కెసిఆర్‌తో సహా తాను కులగణన సర్వేలో పాల్గొంటానని ప్రభుత్వానికి సవాల్ విసిరిన విషయం తెలిసిందే. కెటిఆర్ వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావులకు కులగణన సర్వే ఫారాలు పోస్టు చేశారు. సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు ఫారాలు నింపి పంపాలని కోరారు. ఎవరి లెక్క ఎంతో తేలాలని రాహుల్‌గాంధీ భారత్ జూడో యాత్రలో చెప్పారన్నారు. ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో కులగణన సర్వేచేశామని, ఇప్పుడైనా వివరాలు ఇస్తే కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులకు మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. బిజెపికి చేతనైతే దేశవ్యాప్త సర్వేకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనుమతి తీసుకోవాలని, నిర్ణయం నుంచి నివేదిక దాకా, నివేదిక నుంది నిధుల దాకా అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బిజెపి, బిఆర్ఎస్‌కు బిసిల పట్ల చిత్తశుద్ధి ఉందా? చేతగాకపోతే నోరు మూసుకుని కూర్చోవాలన్నారు. కులగణనపై బిజెపి కుట్ర చేస్తోందని, సూచనలు, సలహాలు ఇస్తే తీసుకుంటామని పేర్కొన్నారు. బిసిలకు న్యాయం చేసేలా కృషి చేస్తున్నామని, మేధావులు, అన్ని కులాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. బిసిలలో ముస్లిం మైనార్టీ అనేది ఇప్పుడు కొత్తది కాదని, మైనార్టీలు ఎప్పటి నుంచో బిసిల్లో ఉన్నారని స్పష్టం చేశారు. అర్బన్ నక్సల్స్ పేరుతో ఒక సెక్షన్ క్రిందకు నెట్టవద్దని అన్నారు. బలహీన వర్గాలకు న్యాయం జరగడం ఇష్టం లేదనా అని ప్రశ్నించారు. ఎర్ర చొక్కా వేసుకున్న వాళ్లంతా నక్సల్స్ అనడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రగతిశీల భావాలు కలిగిన తాను నిన్న నామినేషన్ సంధర్భంగా ఎర్ర చొక్కా వేసుకున్నానని.. అంత మాత్రాన తాను నక్సలైట్‌ను అవుతానా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లిక్కర్ నినాదం అయిపోయిందని, ఇప్పుడు బిసి నినాదం ఎత్తుకున్నారని అన్నారు. కవితకు అప్పుడప్పుడు జాగృతి గుర్తుకు వస్తుందని, ఏమీ లేకపోతే బతుకమ్మ నినాదం ఎత్తుకుంటారన్నారు. ఆమె ఒక ఆడబిడ్డ అని.. ఆమెను విమర్శించాలని తమకు లేదని అన్నారు.

# 'గంజాయి..డ్రగ్స్' అమ్మకాలపై జల్లెడ పట్టండి

కమలాసన్‌రెడ్డి


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై జల్లెడ పట్టాలని ఎస్‌టిఎఫ్‌లను (స్టేట్ టాస్క్ ఫోర్స్ టీమ్) ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని అబ్కారీభవన్‌లో ఎస్‌టిఎఫ్ అధికారులతో కమలాసన్‌రెడ్డి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దూల్‌పేట్‌లో గంజాయిని కట్టడి చేశామని, దీంతో ఆ దందా శేరిలింగంపల్లికి మారిందని, ఇక్కడా నిరంతరం దాడులు నిర్వహించామని వివరించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు చేపడుతున్నట్టు సమాచారమున్న నేపథ్యంలో ఎస్‌టిఎఫ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అనుమానం ఉన్న అన్ని ప్రాంతాలపై నిఘా పెంచాలని, గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా అరికట్టాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ విక్రయించే వారు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. డగ్స్, గంజాయి అమ్మకాలపై దాడులు నిర్వహిస్తున్నామని, ఇందుకు ప్రజాప్రతినిదుల కూడా తమ వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఎస్‌టిఎఫ్ ఎబిసిడి టీమ్ లీడర్లు అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, వెంకటేశ్వర్లు, తిరుపతి యాదవ్ తమ తమ బృందాల పనితీరును కమలాసన్ రెడ్డికి వివరించారు. బాగాపని చేసిన సిబ్బందికి కమలాసన్ రెడ్డి పలువురికి ప్రశంసా పత్రాలను అందజేశారు. జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవీ, అడిషనల్ ఎస్‌పి భాస్కర్‌తో పాటు ఎస్‌టిఎఫ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే..

# స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

* ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటం సిఎం రేవంత్‌రెడ్డికి చేతగాదు
* ఎన్నికల హామీలను అమలుచేయకపోవటం వల్లనే ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ చిత్తు

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈరోజు ఫిబ్రవరి 11 ప్రామిసస్ డే .. ఈప్రామిసేస్ డే సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. బిసిలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని మాజీ మంత్రి హరీష్‌రావు సూచించారు. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయకపోవటం వల్లనే ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించారన్నారు. సిద్దిపేట జిల్లా కోనాయిపల్లి గ్రామంలో పద్మావతి గోదాసమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి హరీష్ రావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద బ్రాహ్మణులు హరీష్‌రావును సన్మానించి ఆశీర్వచనం అందేజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవటం వల్లనే మహారాష్ట్ర, హర్యాన, ఢిల్లీలో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని ఆరోపించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్రనేతలు గుండు భూపేశ్, దువ్వల మల్లయ్య, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, మోహన్‌లాల్. రజనీకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సిపిఐ బరిలో నిలిచేందుకు సిద్ధం కావాలి

పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/దేవరకొండ :** రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పక్షాన బరిలో నిలిచేందుకు శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో సిపిఐ దేవరకొండ నియోజకవర్గ మండలాల కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థలైన ఎంపిటిసి, జెడ్పిటిసి, మునిసిపల్, సర్పంచ్ ఎన్నికల్లో అధిక స్థానాలలో పోటీ చేసి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే ఎర్రజెండా గ్రామగ్రామానికి విస్తరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది సిపిఐ పార్టీ మాత్రమేనని, సిపిఐ పార్టీ అవసరాన్ని ప్రజలు గుర్తించి కమ్యూనిస్టు పార్టీలో చేరాలని కోరారు. పార్టీ శ్రేణులు అన్ని గ్రామాలు తిరిగి కొత్త శాఖల ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు. దేవరకొండ నియోజకవర్గానికి సాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ సర్వే బిసి కులగణనతో పాటు 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటమైన ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ తెలంగాణ అసెంబ్లీలో చేసిన ఆమోదాన్ని స్వాగతిస్తున్నామని, అట్టి ఆమోదాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్లో చట్టం చేసి ఈ వర్గాలకు న్యాయం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలో ఏ ఒక్క అంశాన్ని కూడా నిధుల కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన చేసిన సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయించకపోవడం శోచనీయం అని అన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి బిజెపి ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రజలకు ఎంత మాత్రం ప్రయోజనం జరగలేదన్నారు. పార్లమెంట్లో పదేండ్ల కాలంలో సాధించిన పురోగతిలేదన్నారు. క్రమంగా వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరగడం, పండించిన పంటలకు మద్దతు ధరలు రాకపోవడంతో తీవ్ర సంక్షోభంలోకి వ్యవసాయం నెట్టబడింది తప్ప, కనీసం మద్దతు ధర కల్పించలేకపోయిందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రైతు బంధు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు సంక్షేమ పథకాలు ఇచ్చే ప్రక్రియ వెంటనే చేపట్టి అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. ఉప్పునూతల వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ ఉజ్జిని యాదగిరిరావు, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు, మండల కార్యదర్శులు తూం బుచ్చిరెడ్డి, మైనోద్దీన్, వెంకటయ్య, జయరాములు, అచ్చయ్య, పాండురంగారెడ్డి, రామస్వామి, ఆంజనేయులు, అన్ని మండలాల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ప్రభుత్వాలలో సంస్కరణలకు..

# యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామ సభల నిర్వహణ, గ్రామ పంచాతీయలను స్వయం సమృద్ధిగా మార్చేందుకు, స్థానిక ప్రభుత్వాలలో సంస్కరణలు తీసుకొచ్చేందుకు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. సచివాలయంలో మంత్రి సీతక్కతో 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్'(క్రిస్ప్ ) థింక్ ట్యాంక్ సంస్థ మెంబర్ సెక్రటరీ, భారత ప్రభుత్వ మాజీ అధికారి ఆర్. సుబ్రాహ్మణ్యం మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యా, వైద్య వ్యవస్థలు, మహిళా సాధికారతల బలోపేతంపై చర్చించారు. పేదరిక నిర్మూలన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిఆర్ఐఎస్‌పి సంసిద్ధత వ్యక్తం చేసింది. క్రిస్ప్ ప్రభుత్వంతో ఎంఒయు కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలను మంత్రి సీతక్క సమక్షంలో క్రిస్ప్ మెంబర్ సెక్రటరీ సుబ్రాహ్మణ్యం, సిఆర్‌డి డైరక్టర్ సృజన మార్చుకున్నారు. కాగా 14 రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలతో కలిసి సిఆర్ఐఎస్‌పి పనిచేస్తోంది.

ఈ సంస్థ ఆ రాష్ట్రాలలో ఉచితంగా సేవలందిస్తుంది. తమ సంస్థ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి సీతక్కకు సుబ్రహ్మణ్యం వివరించారు. రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో తీసుకొచ్చిన సంస్కరణలు, ఫలితంగా సాధించిన పురోగతిని మంత్రికి తెలిపారు. ఈ యాక్షన్‌ప్లాన్‌పై క్యాబినెట్‌లో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీతక్క హామీనిచ్చారు.

# శివరాత్రికి ఉచితంగా పండ్లు, అల్పాహారం

అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహా శివ రాత్రి పండుగ పర్వదినం నేపథ్యంలో అన్ని శైవ క్షేత్రాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఈనెల 25 నుంచి 27 వరకు మహా శివరాత్రి పర్వదినం జరగనున్న నేపథ్యంలో కొండా సురేఖ మంగళవారం సచివాలయంలో ఆ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా శివాలయాల్లో మహా శివరాత్రి సందర్భంగా ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఇఒలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉపవాసం ఉండే భక్తులకు పండ్లు, అల్పాహారం ఉచితంగా పంపిణీ చేయాలని తెలిపారు. ప్రతి ఆలయం దగ్గర ఎంట్రీ పాయింట్లు, ఎగ్జిట్ పాయింట్లను పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని దేవాలయాలను సమన్వయం చేసేందుకు హైదరాబాద్ ఎండోమెంట్ కమిషనరేట్ ఆఫీసులో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని సూచించారు.

గోదావరి నది, ఇతర నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో నదీ హారతి వంటి కార్యక్రమం చేపట్టేందుకు అవసరమైన కసరత్తు చేయాలని కోరారు.

# రాహుల్ గాంధీ వరంగల్ టూర్ రద్దు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** రాహుల్ గాంధీ వరంగల్ టూర్ రద్దు అయ్యింది. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు ఆయన వరంగల్ కు రావాల్సి ఉంది. ఇక్కడ రెండు గంటల పాటు ఉండి.. రాత్రికి ట్రైన్లో చెన్నైకి వెళ్లాల్సి ఉంది. అయితే భద్రత, ఇతర అనివార్య కారణాలతో ఆయన టూర్‌ను రద్దు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# భయం గుప్పిట్లో 'మోతే'

పది రోజుల వ్యవధిలోనే 15 మంది మృతి

వరుస మరణాలతో భయాందోళనలో గ్రామస్తులు

**ప్రజాపక్షం/దుబ్బాక :** సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని మోతే గ్రామం ఓ కుగ్రామం. గ్రామంలో 2200 మంది జనాభా ఉన్నారు. ప్రశాంతంగా ఉండే మోతే గ్రామంలోని ప్రజలు గత వారం రోజులుగా తీవ్ర భయాందోళనతో బిక్కుబిక్కుమంటున్నారు. గ్రామానికి చెందిన పలువురు వివిధ కారణాలతో 15 మంది గత ఐదు రోజుల వ్యవధిలోనే మృతి చెందారు. సోమవారం ఒక్క రోజే గ్రామానికి చెందిన ఐదుగురు దేవుని మల్లవ్వ, బాలకిష్టయ్య, చిలుక మల్లేశం, కాలేరు మల్లేశం, నర్సవ్వలు మృతి చెందారు. దీంతో గ్రామంలో అకాల మరణాల పట్ల జోరుగా చర్చ సాగుతోంది. గ్రామానికి ఏమైందని, ఎందుకు చనిపోతున్నారని, ఏదైనా దోషం పట్టిందా...అంటూ గ్రామంలో చర్చ సాగుతోంది. ఇటీవల గ్రామంలో అప్పుల బాధతో కొందరు బలవన్మరణానికి పాల్పడి మృతి చెందగా, మరికొందరు అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. సోమవారం ఐదుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వరుస మరణాలతో గ్రామప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా.**

ఆర్.నెం. టికెజెఎల్ /ఇ/21/2024-25, ఆసక్తి వ్యక్తీకరణ ఆహ్వాన ప్రకటన తేదీ: 10-02-2025

తుర్కయాంజాల్ మున్సిపాల్టీలో ఒక సంవత్సరం కోసం మంజూరు చేయబడిన గ్రాంట్ల కింద సమగ్ర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలు, రోడ్ల అభివృద్ధి, పార్కులు, జంక్షన్ల మెరుగుదల, భవనాలు, మురుగునీటి కాలువలు, వివిధ అభివృద్ధిపనుల థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ కోసం ఇదే తరహా పనులలో అనుభవం కలిగిన కన్సల్టెంట్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణను సీల్డ్ కవర్లలో ఆహ్వానించబడింది. వారు కమిషనర్, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పేరిట రూ.10,000/- (నాన్ రిఫండబుల్) డిమాండ్ డ్రాఫ్ట్‌తో కూడిన సీల్డ్ కొటేషన్ డాక్యుమెంట్లను దాఖలు చేయడం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. సీల్డ్ ఆసక్తి వ్యక్తీకరణను దాఖలు చేయడానికి ఆఖరి తేదీ: 14-02-2025న సా.4.00 గంటలు వరకు.

**షరతులు :**

(1) కన్సల్టెంట్లు ఏ రాష్ట్రంలోనైనా, ఏ డిపార్ట్‌మెంట్‌లోనైనా తప్పకుండా ఇంపానెల్ అయ్యి ఉండాలి.
(2) తెంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ విభాగంలో 12సంవత్సరాల అనుభవాన్ని తప్పకుండా సమర్పించాలి.
(3) ఇదే తరహా పని స్వభావానికి సంబంధించి ఎన్ఏబిఎల్ అక్రిడిటేషన్‌ను తప్పకుండా కలిగిఉన్న సంస్థతో కనీసం 2 సంవత్సరాల అనుభవం కలిగి ఉన్నటువంటి కన్సల్టెంట్లు మాత్రమే పరిగణనలోనికి తీసుకోబడతారు.
(4) పైన పేర్కొన్న షరతులను నెరవేర్చే / అంగీకరించే సంస్థ మాత్రమే ఈ అవసరాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
(5) ఈ ఆసక్తి వ్యక్తీకరణ (ఇ.ఒ.ఐ) సీల్డ్‌ను అంగీకరించడం లేదా తిరస్కరించే అన్ని అధికారాలను తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ కలిగి ఉంటారు.

ఎలాంటి ఇతర వివరాల కోసమైనా పనివేళల్లో తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ఇంజినీరింగ్ సెక్షన్‌ను సంప్రదించవచ్చు.
కాంటాక్ట్ మొబైల్ నెంబర్ : మున్సిపల్ ఇంజినీర్ : 9701425845.

సం/- కమిషనర్,
తుర్కయాంజాల్ మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 10160-PP/CL/ADVT/1/2024-25, Date: 11-02-2025

ప్రజాపక్షం
బుధవారం, ఫిబ్రవరి 12

# ట్రంప్‌తో మోదీ చర్చలు కీలకం

అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ వాషింగ్టన్‌లో రేపు (12వ తేదీ) జరిపే ఆత్మీయ సమావేశానికి విశేష ప్రాధాన్యత ఉంది. ఇజ్రాయెల్, జపాన్ ప్రధానుల తదుపరి ట్రంప్‌తో ముచ్చటించే అవకాశం మోదీకి లభించటానికి కొందరు ప్రచారం చేస్తున్నట్లు వారి వ్యక్తిగత స్నేహం కారణం కాదు; అమెరికా ఆసియా వ్యూహంలో చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను ఉపయోగించుకునేందుకు అది ఇస్తున్న ప్రాధాన్యత ఫలితం. భారత్ పట్ల ట్రంప్‌కు ప్రత్యేక పరిగణన ఉన్నట్లయితే భారత ప్రధాని చర్చలకై అమెరికా రానుండగా, భారతీయ అక్రమ వలస ప్రజల తొలి బ్యాచ్‌ని బేడీలు, సంకెళ్లు వేసి సైనిక విమానం ద్వారా అమృతసర్‌లో దించేవారా? అంతేగాక, అల్యూమినియం, ఇనుము–ఉక్కు దిగుమతులపై ట్రంప్ ప్రతిపాదిస్తున్న 25 శాతం సుంకాల పెంపుదల కార్యరూపం దాల్చితే అందుకు గురయ్యే దేశాల్లో భారత్ కూడా ఉంది. ఫార్మాస్యూటికల్స్, వస్త్రాలు – దుస్తులు, స్వర్ణాభరణాల వంటి భారత్ ఎగుమతులు కూడా ట్రంప్ దిగుమతి సుంకాల పెంపుదల జాబితాలో ఉన్నాయి. భారత్‌లో దిగుమతి సుంకాలు చాలా హెచ్చుగా ఉన్నాయని ట్రంప్ ప్రభుత్వం పాటపాడుతూనే ఉంది. స్వచ్ఛందంగా తగ్గించకపోతే తమ దిగుమతులపై సుంకాలు పెంపుదల ఉంటుందని హెచ్చరిస్తున్నారు. తన సుంకాల పెంపుదల హెచ్చరికలకుగల ద్విముఖ ప్రయోజనాన్ని ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఒకటి, ఇమ్మిగ్రేషన్ (వలసలు) వంటి సమస్యలపై రాయితీలు రాబట్టటం; రెండు, ప్రభుత్వ బడ్జెట్‌లోటు తగ్గించేందుకు సహాయపడటం. ఇమ్మిగ్రెంట్ల విషయంలో ట్రంప్ ముందుగా కెనడా, మెక్సికోలపై కొరడా ఝుళిపించారు. ఆ పొరుగు దేశాలనుండి దిగుమతులపై సుంకాలు 25 శాతం పెంపుదల ప్రకటించారు. ఆ రెండు దేశాలు అమెరికా ఒత్తి కి తలొగ్గక తప్పలేదు. తమ 'వలస ప్రజలను' వెనక్కి తీసుకునేందుకు అంగీకరించాయి. సుంకాల అమలును ట్రంప్ నెలరోజులు వాయిదా వేశారు. పలు లాటిన్ అమెరికా దేశాలు తమ 'వలస జనాలను' వెనక్కి తీసుకుంటున్నాయి. చైనాపై 10 శాతం సుంకాలు పెంచగా, చైనా అదే మోతాదు లో అమెరికన్ సరుకులపై సుంకాల పెంపుతో ఎదురుదాడి చేసింది. ఈ నేపథ్యంలో 'ప్రియ మిత్రుడు' ట్రంప్‌తో నరేంద్రమోదీ సమావేశం – చర్చల్లో వస్తు వ్యాపార కోణం, మానవ సేవలకు భద్రత కోణం రెండూ ఉన్నాయి. అమెరికా నుంచి కొన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం తగ్గింపును భారత ప్రభుత్వం ముందుగానే ట్రంప్ ముందుపెట్టి ఆయన్ను సంతుష్టిపరిచే ఆలోచనలో ఉంది. సుంకాల పెంపుదల పరిమితంగా ఉండేటట్లు ట్రంప్‌కు నచ్చజెప్పటం మనదేశ ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలకు అవసరం. విదేశీ వర్తక – వాణిజ్య తరగతులు ట్రంప్ – మోదీ సమావేశంవైపు చూస్తున్నారు.

> ట్రంప్‌తో నరేంద్రమోదీ సమావేశం – చర్చల్లో వస్తు వ్యాపార కోణం, మానవ సేవలకు భద్రత కోణం రెండూ ఉన్నాయి...సమస్యలకు వాస్తవిక దృష్టితో కూడిన వెసులుబాటును మోదీ సాధిస్తారని భారత్‌లో లక్షలాది కుటుంబాలు ఆశగా చూస్తున్నాయి.

అక్రమ మార్గాల్లో అమెరికాలో ప్రవేశించిన భారత ఇమ్మిగ్రెంట్స్‌ను ట్రంప్ వెనక్కి పంపిన మేరకు మోదీ స్వీకరించక తప్పదు. ఆ విధానాన్ని మోదీ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. వలస ప్రజలను వెతికి పట్టుకుని వారి స్వదేశాలకు పంపే ట్రంప్ విధానం వలస ప్రజలను బేజారెత్తిస్తున్నది. ఇందులో రెండు రకాల వారున్నారు. ఏజంట్లకు డబ్బు చెల్లించుకుని నానా దేశాలు తిరిగి అమెరికా దక్షిణ సరిహద్దు గుండా ప్రవేశించినవారు ఒక కేటగిరి అయితే, సక్రమ వీసాలతో ప్రవేశించి వాటి గడువు ముగిసినా తిరిగి వెళ్లకుండా పనులు చేసుకుంటున్నవారు రెండో కేటగిరి. ఈ రెండు రకాలు ఏడులక్షల పాతికవేలు ఉంటారని అంచనా. వెనిజుల, గౌతమాల, మెక్సికోలకు చెందిన అక్రమ ఇమ్మిగ్రెంట్స్ తదుపరి పెద్ద సంఖ్య భారతీయులేనట. ఇది మానవతా దృక్పథంతో పరిష్కరించాల్సిన సమస్య.

విద్య, ఉద్యోగాల వంటి సక్రమ మార్గాల్లో అమెరికా వెళ్లిన వారిలో భద్రత భావం కలుగజేయటం, గరిష్టంగా హెచ్1బి వీసాలు సాధించటం మరో ముఖ్యాంశం. అన్ని పత్రాలున్నా పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకోవటానికి కూడా వారు భయపడుతున్నారు. ఉన్నత చదువులకు అమెరికా యూనివర్శిటీల్లో చేరినవారు పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకోవటంపై విధించిన నిషేధం పిడుగుపాటు లాంటిది. ఈ సమస్యలకు వాస్తవిక దృష్టితో కూడిన వెసులుబాటును మోదీ సాధిస్తారని భారత్‌లో లక్షలాది కుటుంబాలు ఆశగా చూస్తున్నాయి.

# 'ఓటమి' పాఠం నేర్వాలి


నిత్యా చక్రవర్తి

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపొంది పాలక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓటమి చెందడంతో ఇండియా ఐక్యసంఘటనకు గట్టి దెబ్బతగిలింది. అంటే దీని అర్థం ఆప్ లేదా ఇండియా ఐక్య సంఘటన అంతిమంగా కూలిపోయిందని కాదు. కొంతమంది మీడియా, టీవీ ఛానల్స్ వ్యాఖ్యాతలు ఆప్, ఇండియా ఐక్య సంఘటన పని అయిపోయిందని మాట్లాడుతున్నారు. గెలుపోటముల విషయాలను మాత్రమే గమనంలోకి తీసుకుని వ్యాఖ్య లు చేస్తున్నారు. రెండు దఫాలు ఆప్ గెలిచి పరిపాలించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు రోజు ల ముందు అంటే ఫిబ్రవరి 1వ తేదీన 2025–26 ఆర్థిక సంవత్సరానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలలో 12లక్షల వరకు ఆదాయపు పన్ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం, 8వ వేతన కమిషన్ వేయడానికి అంగీకరించ డం తో మధ్యతరగతి వేతన జీవులు, ఇతరులు ఆకర్షితులై బిజెపికి ఓటు వేశారనడంలో ఏ మాత్రం అనుమానంలేదు. రెండు పార్టీల మధ్య 2శాతం ఓట్లు మాత్రమే తేడా ఉంది. బడ్జెట్ ఆప్‌ని గణనీయంగా దెబ్బతీసింది. అంతమాత్రం చేత బిజెపి గెలుపు, ఆప్ ఓటమికి మధ్య గొప్ప తేడా ఉందని భావించరాదు. ఢిల్లీ ఓటర్లలో మధ్యతరగతి వేతన జీవులు 1.56శాతం ఉన్నారు. దాదాపు వీరంతా బిజెపికే ఓటువేసి ఉంటారు. ఆదాయపు పన్ను ఊరట వీరిని ఎక్కువగా ప్రభావితం చేసింది. బిజెపికి 45.56శాతం ఓట్లు లభించగా, ఆప్‌కి 43.57శాతం ఓట్లు వచ్చాయి. బిజెపికి 48సీట్లు రాగా, ఆప్‌కి 22సీట్లు వచ్చాయి.

ఇండియా కూటమిలో భాగస్వాము లైన ఆప్, కాంగ్రెస్ ఓట్లు కలిసి మొత్తం 50శాతం ఉన్నాయి. సీట్ల విషయం చూస్తే, 14సీట్లు అదనంగా వచ్చేవి. రెండు పార్టీల మధ్య పొత్తు ఉన్నట్లయితే 70 సీట్లలో 36సీట్లు గెలిచి కనీస మెజారిటీ తో విజయం పొందేవారు. దళితులు, పేదలు, ముస్లింలలో ఆప్ బలం ఇప్పటికీ అలాగే నిలిచిం ది. ఆప్ ఓట్లు పడిన విధానం ఈ విషయాన్ని ధృవీకరిస్తోంది. మధ్యతరగతి ఓటర్లు ఆప్ నుంచి బిజెపికి బదిలీఅయ్యారు. పేదల ఓట్లు ఆప్, కాంగ్రెస్‌కు దాదాపు పదిలంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆప్, కాంగ్రెస్‌లు పొత్తు అంశంలో క్షేత్రస్థాయి పరిస్థితులను ఆలోచించలేదు. ఒక పార్టీపై మరోపార్టీ వ్యతిరేకంగా ఆలోచించాయి. ఈ ఎన్నికల్లోనే కాకుండా మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా ఇదే విధంగా ఆలోచించి దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా ఈ రెండు పార్టీలు క్షేత్రస్థాయి పరిస్థితిని లోతుగా పరిశీలించి సయోధ్య కుదుర్చుకోవాలి. ముఖ్యంగా కాంగ్రెస్ ఈ విషయంలో తప్పుదారి పడుతోంది. త్వరలో జరగనున్న ఎన్నికల్లోనైనా ఇండియా ఐక్యసంఘటన పార్టీల మధ్య సయోధ్య కుదిరి కలిసికట్టుగా పోటీ చేసేలా చూడవలసిన పెద్దబాధ్యత కాంగ్రెస్ మీద ఉంది. ఓటమిని కేజ్రీవాల్ అంగీకరించి ప్రతిపక్షపార్టీగా బాధ్యతగా పనిచేస్తానని వాగ్దానం చేశారు. పార్లమెంటరీ వ్యవస్థలో ఇది ప్రజాస్వామ్య విధానం.

ప్రస్తుతం ఏర్పడనున్న రాజకీయ పరిస్థితిని పరిశీలించాలి. ఇంతవరకు ఆప్ పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో పరిపాలిస్తోంది. ఇప్పుడు ఢిల్లీలో ఓటమి పాలైంది. పంజాబ్‌లో మాత్రమే అధికారంలో ఉంది. పంజాబ్ మీద బిజెపి గట్టిగా దృష్టిపెడుతోంది. బీహార్‌లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఆ రాష్ట్రంపై ఉన్నతస్థాయి నాయకత్వం అన్ని రకాలుగా దృష్టి పెడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుకోసం ఎలాంటి విధాలనైనా ఆచరించేందుకు వెనుకాడకపోవచ్చు. ఈ సంవత్సరం చివరిలో పంజాబ్, బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం ఒడిదుడుకుల పాల య్యే అవకాశాలు న్నాయి. ఇందుకు బిజెపి గట్టి ప్రయత్నం చేస్తోంది. ఢిల్లీ, పంజాబ్‌లో ఎన్నికల విధానంలో కొన్ని పోలికలున్నాయి. పంజాబ్‌లో ఆప్ గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించింది.

ఈ నేపథ్యంలో ఆప్‌ను ఓడించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ క్రియాశీలంగా పనిచేస్తోంది. అదే సమయంలో బిజెపి కూడా తన పరిస్థితిని రాష్ట్రంలో మరింత విస్తరించేందుకు చిన్నచిన్న పార్టీలను కొత్తగా తనతో కలుపుకునిపోయేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇక్కడ కూడా ఆప్, కాంగ్రెస్‌పైన పోటీ చేయాలని బిజెపి భావిస్తోంది. ఆప్, కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకోకపోతే త్రిముఖ పోటీ జరుగుతుంది. మళ్లీ ఢిల్లీలో వచ్చి న ఫలితమే రావచ్చు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆప్, కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకోవడం వల్ల మేలు జరగవచ్చు. బీహార్‌లో ఇండియా ఐక్య సంఘటన భాగస్వాములు కలిసికట్టుగా ఎన్నికలలో పాల్గొనవలసిన అవసరం ఎంతైనాఉంది. అది కూడా ఇప్పటికే పనిచేస్తున్న మహాఘట్‌బంధన్ ఎటువంటి అరమరికలు లేకుండా ఆర్‌జెడి నాయకత్వంలో, నితీష్ కుమార్ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని సమర్థ మంతంగా ఎదుర్కోవాలి. సీట్ల సర్దుబాటు విషయంలోనూ ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఎంతైనా అవసరం. ఎన్నికలకు చాలా ముందుగానే ఆర్‌జేడీ, కాంగ్రెస్ సీట్ల సర్దుబాటు విషయంలో చర్చించి సర్దుబాటు కుదుర్చుకుని కలిసికట్టుగా ప్రచారం సాగించాలి. బీహార్‌లో సిపిఐ(ఎమ్‌ఎల్) కు కార్మిక వర్గంలో బలమైన పట్టు ఉంది. ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షపార్టీలైన సిపిఐ, సిపిఐఎం, సిపిఐ(ఎమ్ఎల్) మధ్య పటిష్టమైన సయోధ్యకుదిరే అవకాశం ఉంది. వామపక్షాలు 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 19సీట్లలో పోటీచేసి 12 సీట్లలో గెలుపొందాయి. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో మరి న్ని సీట్లు గెలిచే అవకాశం ఉంది. ఆర్‌జెడి ఈ అంశాన్ని గమనంలోకి తీసుకుని సహకరించవలసి ఉంది. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పులను గుర్తించి సయోధ్యతో కలిసి పోటీచేసి తప్పనిసరిగా విజయం సాధించ వలసిన అవసరం ఇండియా ఐక్యసంఘటనకు ఉన్నది.

ఈ సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన బిజెపి గట్టి విశ్వాసంతో పనిచేస్తోంది. మహారాష్ట్ర, హర్యానా, యూపీ ఉప ఎన్నికల్లో గెలుపొందిన ధీమాతో బిజెపి పనిచేస్తోంది. గెలుపు ఓటములు సాధారణమే. అయితే ఓటమి నుంచి తగిన పాఠాలు నేర్చుకుని జరిగిన తప్పులను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను అనుసరించాలి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో జరిగిన తప్పులను గుర్తించిన బిజెపి సరిదిద్దుకుని ఢిల్లీ ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందింది. బిజెపి విధానాన్ని గుర్తించి ఇండియా ఐక్య సంఘటన భాగస్వామ్యపార్టీలు కలిసికట్టుగా రానున్న ఎన్నికల్లో పోటీచేయాలి.





ఇండియా కూటమిలో భాగస్వాము లైన ఆప్, కాంగ్రెస్ ఓట్లు కలిసి మొత్తం 50శాతం ఉన్నాయి. సీట్ల విషయం చూస్తే, 14సీట్లు అదనంగా వచ్చేవి. రెండు పార్టీల మధ్య పొత్తు ఉన్నట్లయితే 70 సీట్లలో 36సీట్లు గెలిచి కనీస మెజారిటీ తో విజయం పొందేవారు. దళితులు, పేదలు, ముస్లింలలో ఆప్ బలం ఇప్పటికీ అలాగే నిలిచింది. ఆప్ ఓట్లు పడిన విధానం ఈ విషయాన్ని ధృవీకరిస్తోంది. మధ్యతరగతి ఓటర్లు ఆప్ నుంచి బిజెపికి బదిలీఅయ్యారు.

# డార్వినిజం అంటే...

చార్లెస్ డార్విన్ ఇంగ్లాండుకు చెందిన ప్రకృతివాది, భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే విషయంపై పరిశోధనలు చేశాడు. ఆయన పేరు తలుచుకుంటే చాలు ఎవరికైనా సరే వెనువెంటనే గుర్తుకు వచ్చేది జీవపరిణామ సిద్ధాంతం. ప్రకృతిలో జీవజాతులు వేటికవే ఏకకాలంలో రూపొందిన ట్లు ఎంతోకాలం నుండి నమ్ముతూ వస్తున్న ప్రజానీకానికి అదంతా వాస్తవం కాదని ఒక మాతృక నుంచి సకల జీవ రాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడతాయని, ఈ చర్య అనంతంగా కొనసాగుతూ ఉంటుందని మొట్టమొదటిసారిగా వివరించినవాడు చార్లెస్ డార్విన్ మాత్రమే. వానరుని నుంచి నరవానరుడు, నరవానరుని నుంచి నరుడు పరిణామపరంగా ఉద్భవించాడని తెలిపి సంచలనం రేపిన ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్.


ఆయన ష్రిప్స్ బర్గ్‌లో ఫిబ్రవరి 12, 1809లో జన్మించాడు. చిన్నవాడుగా ఉండేటప్పటినుండి కీటకాలను, ఖనిజాలను సేకరిస్తూ రసాయనిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ ఉండేవాడు. 16 యేండ్ల వయస్సులో మెడిసన్ చదవ టం కోసం ఈయనను ఎడిన్ బర్గ్ విశ్వ విద్యాలయంలో చేర్పించారు. కాని మత్తుమందులు లేకుండా చేస్తున్న ఆపరేషన్లను చూచి ఆ చిత్రహింసకు ఈయన కలత చెంది మెడిసిన్‌కు మనసు పెట్టి చదవలేకపోయాడు. 1828లో కేంబ్రిడ్జ్ కి వెళ్ళి థియాలజీ చదివాడు. వైద్యుడైన తండ్రి అన్ని సదుపాయాలూ సమకూర్చినా చదువు లో రాణించలేదు. అతడొక మందబుద్ధిగా ఉపాధ్యాయులు భావించేవారు. తండ్రి వైద్యవిద్య కోసం ఎడింబరో విశ్వవిద్యాలయంలో చేర్చినా డార్విన్ కొనసాగించలేకపోయాడు. ఏదో ఒక డిగ్రీ సంపాదించాలనే తండ్రి కోరికపై కేంబ్రిడ్జ్‌లో తత్త్వశాస్త్ర అధ్యయనంలో చేరినా అక్కడా అంతే. అక్కడి ప్రొఫెసర్ ఓసారి అతడికి 'బీగల్' అనే ఓ నౌక కెప్టెన్‌కి పరిచయం చేశాడు. వివిధ దేశాల్లో, దీవుల్లో ఉండే జీవుల పరిశీలనకు అవకాశం ఉంటుందనే ఆలోచన తో డార్విన్ తన తండ్రి వద్దంటున్నా వినకుండా ఆ ఓడ ఎక్కేశాడు. ఆ నౌకాయానంలో డార్విన్ అనేక ప్రాంతాల్లో మొక్కలు, రాళ్లు, శిలాజాలు, కీటకాలు, జంతువులను పరిశీలించి చాలా నమూనాలను సేకరించి ఇంటికి పంపుతూ వచ్చాడు. ఆ పరిశీలనల ఆధారంగానే జీవజాతుల పరిణామ క్రమంపై పుస్తకం రాశాడు. 150సంవత్సరాల క్రితం రాసిన ఈ గ్రంథం ఇప్పటికీ ప్రామాణికంగా నిలిచి ఉంది. జీవుల్ని ఏదో అతీత శక్తి ఏకకాలంలో సృష్టించలేదని, అవి వివిధ దశల్లో స్వాభావిక ఎంపిక ద్వారా పరిణామం చెందాయని డార్విన్ సిద్ధాంతం చెబుతుంది.

ఇది ఇప్పటి మైక్రోబయాలజీ, జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీలను సంఘటిత పరచడంలోనూ, డిఎన్ఏ పరీక్షల్లోనూ ప్రముఖ పాత్ర వహిస్తోంది. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం భూమి మీది జీవుల పరిణామక్రమాన్ని తెలియజేస్తుంది. ఆధునిక జీవశాస్త్రంలో డార్వినిజం చాలా మార్పు తెచ్చింది. మూఢ నమ్మకాలని విభేదించడంలో కూడా డార్వినిజం కీలక పాత్ర పోషించింది. మనిషి కోతి నుంచి వచ్చాడు, మనిషిని దేవుడు సృష్టించలేదన్న సిద్ధాంతాన్ని తెర మీద కు తెచ్చింది. ఇప్పుడు కూడా సృష్టివాదం పేరుతో డార్వినిజాన్ని వ్యతిరేకించే వాళ్ళు ఉన్నారు.

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం మార్క్సిస్ట్ చారిత్రక భౌతికవాద రచనలకి కూడా ఊపిరిపోసింది. మలేషియా నుంచి రసెల్ వాలేస్ (1823–1913) అనే వ్యక్తి పంపిన సిద్ధాంత వ్యాసం డార్విన్ వ్యాసం ఒకే విధంగా ఉన్నా యి.

డార్విన్1844లో తన రచనను, వాలేస్ పంపిన వ్యాసాన్ని లియన్ సొసైటీ జర్నల్‌కు అందచేశాడు. 1858, జులై 15న శాస్త్రవేత్తల సమావేశం జరిగింది. ఇరువురి వ్యాసాలు పరిశీలించారు. 1844లో డార్విన్ మొదలు పెట్ట గా, వాలేస్ 1858లో రాశాడు. కనుక డార్విన్ ముందు రాసినట్టు నిర్ధారించారు.

1831లో విజ్ఞాన శాస్త్ర పరిశోధనల నిమిత్తం యురోపియన్ దేశాలను చుట్టిరావటానికి బయలు దేరిన బీగల్ సముద్ర నౌకలో నేచురలిస్ట్ గా ప్రయాణం చేసే అవకాశం డార్విన్ కి లభించింది. ఈ అవకాశం ఆయన పాలిట సువర్ణావకాశమై గొప్ప శాస్త్రీయ ఆవిష్కరణకు ఆధారభూతమైనది. అయిదేళ్ళపాటు కొనసాగిన ఈ సముద్రయానంలో డార్విన్ ఎన్నో రకాల ప్రదేశాలను, జంతువులను దర్శించాడు. ప్రకృతికి, జీవరాశికి మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాల గురించి తీవ్రంగా ఆలోచించాడు. ఈ ఆలోచన ఫలితమే ప్రకృతి వరణ వాదంగా(నేచురల్ సెలక్షన్ థీయరీ)గా పరిణమించింది.



ఫిబ్రవరి 12 ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ జయంతి

ప్రస్తుతం ప్రపంచంలో కనబడుతున్న రకరకాల ప్రాణులు మొదటి నుంచీ లేవనేది ఈ సిద్ధాంతం యొక్క ప్రధానమైన వాదన. కుక్కలూ, నక్కలూ, తోడేళ్ళూ ఒక జాతివనీ, పిల్లులూ, చిరతపులులూ, పెద్ద పులులూ, సింహాలూ మరొక జాతికి చెందినవనీ, గుర్రాలూ, గాడిదలూ, జీబ్రాలూ ఒకలాంటి వే. గతంలో వీటికి తలొక 'పూర్వీకుడూ' ఉండి ఉండాలి. ఇంకా వెనక్కెళితే ఈ 'ఆదిమ' శునకానికీ, మార్జాలానికీ, అశ్వాని కీ జన్మనిచ్చిన మరేదో మృగం ఉండి ఉంటుంది. ఇన్నిరకాల ప్రాణు లు 'వాటంతట అవే' ఎలా ఉద్భవిస్తాయని వీరి వాదన సాగిపోతుంది.

1859లో ప్రపంచ ప్రసిద్ధి పొందిన 'ది ఆరిజన్ ఆఫ్ స్పీసిస్ ఆఫ్ నేచురల్ సెలక్షన్'పుస్తకాన్ని చార్లెస్ డార్విన్ వెలువరించాడు. ఈ పుస్తకం విడుదలైన రోజునే అన్ని ప్రతులూ అమ్ముడుపోయి సరికొత్త రికార్డును సృష్టించింది. చార్లెస్ డార్విన్ స్వంత దేశమైన బ్రిటన్ లో డార్వినిజం ఎన్నో ప్రశంసలు అందుకుంది. డార్వినిజం ప్రపంచంలో ఎంతో మంది భౌతిక శాస్త్రవేత్తలని, జీవ శాస్త్రవేత్తలని ఎంతగానో ప్రభావితం చేసింది.

కొన్ని యూరప్,అమెరికా దేశాలలో డార్వినిజం చాలా వివాదాస్పదమయ్యింది. సృష్టివాదాన్ని వ్యతిరేకించడం దైవ ద్రోహం అని మతవాదుల వాదన. కొన్ని దేశాలలో ఈ సిద్ధాంతాన్ని నిషేధించారు. 1868లో డార్విన్ 'ది వేరియేషన్ ఆఫ్ యానిమల్స్ అండ్ ప్లాంట్స్ అండర్ డొమెస్టికేషన్' అనే పుస్తకాన్ని ప్రచురించాడు. 'ఇంసెక్టివోరస్ ప్లాంట్స్' 'డీసెంట్ ఆఫ్ మ్యాన్', 'ది ఫార్మేషన్ ఆఫ్ గజిటబుల్ మౌల్డ్ థ్రూ ది ఏక్షన్ ఆఫ్ వార్మ్స్' వంటివి ఈయన రాసిన మరికొన్ని పుస్తకాలు. ఆయన 74 యేండ్ల వయస్సులో చనిపోయారు. డార్విన్ జీవులపై పరిశోధనలు ప్రపంచ గమనాన్నే మార్చాయి. జీవుల పుట్టుక గురించి ప్రాచీనులు నమ్మిన విషయాలు నిజం కాదని డార్విన్ రుజువు చేశారు.

ఎం.రాం ప్రదీప్,
9492712836

# రుణ ఎగవేతదారులను ఎన్నికల్లో నిషేధించాలి

ఉద్దేశ్యపూర్వక రుణ ఎగవేతదరులను స్థానిక సంస్థ ల నుంచి శాసనసభ, పార్లమెంటు వరకు ఏ ఎన్నిక ల్లో నిలబడకుండా నిషేధించాలని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ) సూచించింది. అలాంటివారిపై నేర అభియోగాలను మోపాలని కోరింది. వ్యవసాయ రుణాలపై ఏటా రెండు శాతం సాధారణ వడ్డీకే మంజూరు చేయాలి. ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌లో ఉండాల్సిన అంశాలపై కేంద్ర మంత్రి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పలు సూచనలు చేసింది. వాటిలో ముఖ్యమైనవి. కార్పొరేట్ ఎగవేతల భారాన్ని సాధారణ బ్యాంకు ఖాతాదారులపై చార్జిల రూపంలో మోపవద్దు. మరిన్ని డెట్ రికవరీ ట్రిబ్యునల్స్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి పారు బకాయిలను తిరిగి వసూలు చేసేందుకు మరిన్ని అధికారాలు కట్టబెట్టాలి. అలాగే మొండి రుణాలను తిరిగి పొందేందుకు, ఇన్సాల్వెన్సీ, బ్యాంక్‌రప్సీ (దివాళా) కోడ్(ఐబిసి) ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. 'హెయిర్‌కట్స్' పేరుతో కార్పొరేట్ మొండి రుణాలను రద్దు చేసి, నిరోధించాలి. ఉద్దేశ్యపూర్వక రుణ ఎగవేతదారుల జాబితాను ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆర్‌బిఐ విడుదల చేయాలి. రుణ ఎగవేతదారులు, వ్యవసాయ విద్య రుణ ఎగవేతదారుల జాబితాలను బహిర్గత పరచాలని ఆర్‌బికి సుప్రీం కోర్టు చేసిన సూచనతో ఆర్‌బిఐ సెక్షన్ 45 ఇ నిరుపయోగంగా మారినందున, దానిని వెనక్కి తీసుకోవాలి. విద్యా రుణాలను ఐదు శాతానికి అందించాలి. గ్రామీణ ప్రాంతాలు, కుగ్రామాలకు ఇంటి వద్దకే బ్యాంకు లావాదేవీలను తీసుకెళ్తున్న బ్యాంక్ మిత్ర, బ్యాంకిం గ్ కరస్పాండెంట్‌లను నేరుగా బ్యాంకులే నియమించుకొని, వారిని బ్యాంక్ వర్క్‌మెన్‌గా పరిగణించాలి. వారికి కనీసం నెలకు రూ.18 వేలు వేతనంతో పాటు ప్రోత్సాహకాలను లావాదేవీల ఆధారంగా ఇవ్వాలి. అలాగే అన్ని బ్యాంకుల్లో వారికి ఒకే వేతనం, సెలవు లు కల్పించాలి. ఇఎస్‌ఐ, మెటర్నిటీ ప్రయోజనా లు ఇవ్వాలి. గ్రామీణ ప్రజలకు, వ్యవసాయ రంగానికి అవసరమైన రుణాలు అందించేదంపకు వీలుగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు(ఆర్‌ఆర్‌బి)లను స్పాన్సర్ బ్యాంకుల్లో విలీనం చేయాలి. సహకార బ్యాంకులు, సహకార సొసైటీ లాభాలను ఆదాయ పన్ను పరిధి నుంచి మినహాయించాలి. అందుకు వీలుగా ఆదాయ పన్ను సెక్షన్ 1961ను ఉపసంహరించాలి. వైద్యనాథన్ కమిటీ సిఫార్సు మేరకు సహకార బ్యాంకింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలి. అందుకు అవసరమైన చోట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రీక్యాపిటలైజేషన్ చేయాలి. పంట పండనప్పుడు, ప్రకృతి ప్రకోపం చూపినప్పుడు చిన్న, మధ్య తరహా రైతులు రుణం కట్టలేని పరిస్థితులలో సహకార బ్యాంకింగ్ వ్యవస్థకు రీఫైనాన్సింగ్ కోసం బడ్జెట్‌లో ఏటా రూ.2లక్షల కోట్లతో ప్రత్యే నిధిని ఏర్పాటు చేయాలి.

ప్రభుత్వాలు ప్రకటించే వ్యవసాయ రుణమాఫీ నిధులను ఆయా ప్రభుత్వాలు బ్యాంకులు, సహకార బ్యాంకులు, ఆర్‌ఆర్‌బిలకు తిరిగి చెల్లించాలి. బంగారంపై రుణాలుకు వడ్డీ విధింపును నెలవారీగా, త్రైమాసిక, లేదా అర్థ వార్షిక సమయాలలో ఏదో ఒకటి ఎంపిక చేసుకునేందుకు రుణగ్రహీతలకు అవకాశం కల్పించాలి. సహకార బ్యాంకులు ఇచ్చే బంగారు రుణ పథకాల ను తీసుకున్న ఏడాదిలో కమర్షియల్ బ్యాంక్ మాదిరిగా కాకుండా ఏడాదిలో చెల్లించకపోతే పారు బాకీలుగా నిర్ణయించవద్దు. మైక్రో ఫైనాన్స్ సంస్థల ఇచ్చే రుణాలపై వడ్డీలకు పరిమితిని విధించాలి. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను ప్రైవేటీకరించవద్దు. ప్రభుత్వం 51శాతం కంటే ఎక్కువ వాటాను కొనసాగించాలి. ఐడిబిఐ బ్యాంకు విక్రయ నిర్ణయాన్ని నిలిపివేయాలి.

సహకార బ్యాంకులలో డిపాజిట్‌లకు మాత్రమే డిఐజిసిసి కింద డిపాజిట్ ఇన్సూరెన్స్ పథకాన్ని పరిమి తి చేసేలా చట్ట సవరణ చేయాలి. ఎందుకంటే ప్రభుత్వరంగ సంస్థలు దివాళా తీస్తే, వాటిని ఇతర బ్యాంకుల్లో విలీనం చేస్తున్నందున, అందులో డిపాజిట్‌లకు డోకా ఉండదు. సహకార బ్యాంకులకు ఆ పరిస్థితి లేదు.

# ఆధునిక టెక్నాలజీ వినియోగంతో ఉత్పాదకత పెంపు

12 ఫిబ్రవరి 1958న ఏర్పడిన జాతీయ ఉత్పాదకత కౌన్సిల్ (నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్)కు గుర్తుగా ప్రతి ఏట 12 ఫిబ్రవరిన జాతీయ ఉత్పాదకత దినం (నేషనల్ ప్రొడక్టివిటీ డే) నిర్వహించడం ఆనవాయితీగా మారింది. వ్యక్తి నుంచి బడా పరిశ్రమల వరకు వారి వారి ఉత్పాదకతకు పెంచి పోషించడానికి అనునిత్యం కావలసిన నాణ్యత పై దృష్టి, ఆరోగ్యకర పోటీతత్వం, క్రియాశీలత, మానవ వనరుల అభివృద్ధి, విలక్షణ ఆవిష్కరణలు లేదా ఇన్నొవేషన్లకు ప్రోత్సహించి, పెద్ద పీట వేస్తూ సుస్థిర దేశాభివృద్ధికి బాటలు వేయడాన్ని జాతీయ ఉత్పాదకతదినం వేదికలు ఉపయోగపడుతున్నా యి.

**మేధో సంపత్తిని పరిరక్షించుకుంటూ అధిక ఉత్పాదకతను నమోదు చేయడం:**

ఆధునిక డిజిటల్ ఏఐ యుగం అందిపుచ్చుకున్న శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సాంప్రదాయ పద్ధతులకు అవసరమైన సవరణలు చేసుకుంటూ ప్రగతి పరుగులు పెట్టించాలనే ఉద్దేశంతో జాతీయ ఉత్పాదకత దినం2025 ఇతివృత్తంగా ఆలోచనల నుంచి ప్రభావితం కావడం : స్టార్ట్ అప్లో పోటీతత్వం పెంచడానికి మేధో సంపత్తి పరిరక్షణ అనే అంశాన్ని తీసుకున్నారు. జాతీయాభివృద్ధి పరుగులు పెట్టించడానికి మనలో ఉద్భవించిన విలక్షణ ఆలోచనలు, ఆవిష్కరణలను క్షేత్ర స్థాయిలో ఆచరణలో పెట్టడం నేటి కనీస అవసరంగా మారిందని ఈ వేదికలు వివరిస్తున్నాయి. ఆర్థికాభివృద్ధి, ఆవిష్కరణలు, పరిశ్రమల్లో ఆరోగ్యకర పోటీతత్వం, దీర్ఘకాలిక విజయాలకు మేధో సంపత్తి ని రక్షించుకోవడం, వినుత్న ఆలోచనలకు ఆజ్యం పోయడం లాంటివి సుసాధ్యం చేయడానికి వ్యక్తులు, మేధావులు, విద్యావేత్తలు, పాలసీ మేకర్స్, పరిశ్రమలు కృషి చేయడం అవసరమని ప్రచారం చేయడం కొనసాగుతున్నది.




**జాతీయ ఉత్పాదకత దినం వేదికగా కార్యక్రమాలు:**

జాతీయ ఉత్పాదకత దినం రోజున అంకుర సంస్థలను ప్రోత్సహించడానికి పరిశ్రమల్లో లేదా కంపెనీల్లో కార్యశాలలు, వెబినార్లు, ఆన్లైన్ పోటీలు, హాకథాన్లు, కేస స్టడీస్, సిఎస్‌ఆర్ చొరవ, ఐపిఆర్ రిజిస్ట్రేషన్లు, అర్హులకు అవార్డులు లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఉత్పాదకత అంటే తక్కువ సమయంలో ఎక్కువ ఉత్పత్తులు చేయడం మాత్రమే కాదని, మనం స్మార్ట్ ఆలోచనలను ఆచరణలో పెట్టడ ం, నవ్య ఆలోచనలను ఆచరణలో పెట్టడం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నూతన ఆవిష్కరణలకు ఆజ్యం పోయడం కొనసాగాలని గమనించా లి. ఈ మార్గంలో ఔత్సాహికులు, విద్యార్థినీవిద్యార్థులు, ఉద్యోగులు, ఆవిష్కర్తలు, సృజనశీల మేధావులు తమ తమ పరిధిలో ఉత్పాదకత పెంచడానికి కృషి చేయాలనిభావించాలి.

నేటి నవ్య ఆలోచనలు, ఆవిష్కరణలను సత్వరమే ఆచరణలో పెడుతూ, నేటి టెక్నాలజీ రేపు అవుట్డేట్ అవుతుందని గమనించి తమ తమ పరిధిలో ఉత్పాదకత పెంచడానికి అందరు కృషి చేస్తే ప్రపంచం దేశాల్లో స్టార్ట్ అప్ల హబ్గా భారతం గుర్తించబడుతుందని ఆశిద్దాం, అత్యధిక ఉత్పాదకత రికార్డు చేసే స్థాయికి చేరుదాం.




## గవర్నర్ ఉదాసీనతపై కాంగ్రెస్ ధ్వజం

**న్యూఢిల్లీ :** రెండు అసెంబ్లీ సమావేశాల మధ్య ఆరు నెలలకు మించి వ్యవధి ఉండకూడదన్న రాజ్యాంగ నిబంధనపై మణిపూర్ గవర్నర్ ఎందుకు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని మంగళవారం కాంగ్రెస్ లోక్‌సభలో ప్రశ్నించింది. నిబంధన 174(1) ప్రకారం అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యవధి ఆరు నెలలకు మించరాదు. మంగళవారంతో మణిపూర్ అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యవధి గడువు తీరనుండడంతో గవర్నర్ ఈ విషయమై ఎందుకు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రసార విభాగం ఇన్‌చార్జి జైరాం రమేష్ లోక్‌సభ దృష్టికి తెచ్చారు. మణిపూర్ ప్రభుత్వానికి ఈ అంశంపై సమన్లు జారీ చేయకుండా గవర్నర్ ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. మణిపూర్ సిఎం బీరేన్ సింగ్ అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేయడంతో మణిపూర్ అసెంబ్లీలో స్తంభన ఏర్పడింది. అధికార బిజెపి తదుపరి నాయకత్వాన్ని ప్రకటించకపోవడంతో అసెంబ్లీ సమావేశాల వ్యవధి గడువు మించిపోతోంది. మణిపూర్ అసెంబ్లీలో ప్రతిపక్ష కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేసినా ఆలస్యంగా బీరేన్ రాజీనామా చేయడమే ఇందుకు కారణమని జైరాం రమేశ్ వెల్లడించారు. మణిపూర్‌లో 2023 మేలో జాతి విద్వేషాలు చెలరేగినప్పటినుంచి నేటివరకు 250మందికిపైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

## అసత్య ప్రచారాలను నమ్మొద్దు

**ఇంఫాల్ :** అసత్య ప్రచారాలను నమ్మొద్దని, ధృవీకరించని వార్తలకు ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని, ప్రశాంతంగా ఉండాలని మణిపూర్ ప్రభుత్వం మగళవారం ప్రజలను కోరింది. పుకార్లు, అసత్య సమాచారంతో ప్రజలలో భయం, అశాంతి నెలకొంటుందని ప్రభుత్వం పేర్కొన్నది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాజీనామా నేపథ్యంలో రాష్ట్రంలో రాజీకీయ అనిశ్చితి నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్రోహ శక్తులు ప్రజలలో భయభ్రాంతులను సృష్టించేందుకు అవాస్తవాలను ప్రచారం చేస్తాయని, వాటిని నమ్మొద్దని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కె.సింగ్ వెల్లడించారు. అవాస్తవాలను ధృవీకరించుకునేందుకు ప్రభుత్వం కంట్రోల్ రూంను ఏర్పాటు చేసిందని, అవాస్తవిక వార్తలను వాటిద్వారా ధృవీకరించుకోవచ్చన్నారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందని, ప్రజలు సమాచారం కోసం 9485280419 నంబర్‌ను సంప్రతించవచ్చన్నారు. శాంతి భద్రతల స్థాపన ప్రతి ఒక్కరి బాధ్యత అని, అసత్యాలను ప్రచారం చేసివారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సింగ్ కోరారు. అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సైబర్ నేర నిరోధానికి ఎఐ సాయం



**న్యూఢిల్లీ :** సైబర్ నేరాలకు పాల్పడేవారు తాము కొల్లగొట్టిన సొమ్మును ఎక్కడ దాస్తున్నారో తెలుసుకునేందుకు కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహాయం తీసుకోనున్నట్టు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. సోమవారం పార్లమెంట్ సంప్రతింపుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ, సైబర్ క్రైమ్ అంశంపై సమావేశానికి అధ్యక్షత వహించిన షా దేశభద్రత దృష్ట్యా 805 యాప్స్, 3,266 వెబ్‌సైట్లను నిషేధించినట్టు తెలిపారు. ప్రభుత్వ సైబర్ క్రైమ్ నియంత్రణ వ్యవస్థ సైబర్ క్రైమ్ సెంటర్ సూచనల మేరకు ఈ చర్య తీసుకున్నట్టు వివరించారు. 399 బ్యాంకులు, ఆర్థిక సంస్థలపై నిఘా ఉంచినట్టు, 19 లక్షల నకిలీ బ్యాంక్ అకౌంట్లను కనుగొన్నట్టు, 2,308 కోట్ల రూపాయల అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్టు గుర్తించామన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు రిజర్వు బ్యాంకు సహకారంతో కృత్రిమ మేధ సహాయాన్ని తీసుకోవాలని భావిస్తున్నట్టు తెలిపారు. 14సి పోర్టల్ ద్వారా 1,43,000మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు తెలిపారు. సైబర్ నేరాలపై ఫిర్యాదులకు 1930 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురయినా, గుర్తించినా ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. గత దశాబ్ద కాలంలో దేశంలో డిజిటలైజేషన్ విస్తృతమైందని, దేశవ్యాప్తంగా 95 శాతం గ్రామాలు వైఫైతో అనుసంధానం చేశామని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన డిజిటల్ లావాదేవీలలో 48 శాతం ఇండియాలోనే జరిగాయని, డిజిటలైజేషన్‌లో భారత్ సాధించిన అభివృద్ధికి ఇది నిదర్శనమన్నారు.

# ఎన్నిసార్లు మోదీ అంటే.. అన్ని సార్లు రూపాయి పతనం

### బడ్జెట్ చర్చలో సిపిఐ ఎంపి సందోష్‌కుమార్



**న్యూఢిల్లీ :** మోదీ మోదీ అని ఎన్ని సార్లు జపిస్తే, రూపాయి అంతగా పతనమవుతోందని సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకులు పి.సందోష్‌కుమార్ విమర్శించారు. దేశ ఆర్థికరంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నదనేని వాస్తవమని అన్నారు. రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో మంగళవారం నాడు ఆయన పాల్గొన్నారు. మోదీ హయాంలో దేశ అంతర్గత, విదేశీ అప్పులు 2019–20 వరకు రూ.100.01 లక్షల కోట్లు ఉండగా, 2023–24కు రూ.171.07 లక్షల కోట్లకు పెరిగాయని, నాలుగేళ్ళలో రూ.67 లక్షల కోట్లు పెరిగాయనేది కఠోర వాస్తవమన్నారు. కుటంబాల వినియోగ సర్వే ప్రకారం 34 శాతం జనాభా రోజుకు రూ.100 లోపే ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ కార్మికశక్తిలో 93 శాతం అసంఘటిత కార్మికులే ఉన్నారని, కాంట్రాక్టైజేషన్ నేపథ్యంలో ఆ సంఖ్య మరింత పెరిపోతుందని సందోష్ అన్నారు. వారికి బడ్జెట్‌లో నిధులు ప్రత్యేకంగా కేటాయించాలని అభ్యుదయవాదులు, కార్మిక సంఘాలు నిరంతరం కోరతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని, వారిని ఇఎస్ఐలో కూడా చేర్చడం లేదన్నారు. చట్టబద్ధమైన కనీస మద్దతు ధర ఇవ్వాలని దేశ రైతాంగం అనేక పోరాటలు చేస్తున్నప్పటికీ, కేంద్రం వాగ్దానం ఇచ్చినప్పటికీ అమలులోకి రావడం లేదని మండిపడ్డారు. ఈ అంశంపై తాను ప్రశ్నిస్తే గత యుపిఏ ప్రభుత్వం, నెహ్రూ పేర్లు చెప్పి కేంద్రం తన వైఫల్యాలను దాచిపెడుతోందని మండిపడ్డారు.

**స్కీమ్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలి :** కేంద్రం ప్రభుత్వం ఎన్ని మిషన్‌లు, ఎన్ని స్కీమ్‌లు ప్రకటిస్తుందో కేంద్ర మంత్రులకే తెలియదని సందోష్‌కుమార్ ఎద్దేవా చేశారు. వాటిపై శ్వేతపత్రం విడుదల చేయాలని, అందులో ఎన్ని స్కామ్‌లు ఉన్నాయో, ఎంత మంది లబ్ధి పొందారో, ఎన్ని విఫలమయ్యాయో తెలియజేయాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులను కూడా కేంద్రం ఇవ్వడం లేదన్నారు. కేరళ ఎఫ్ఆర్‌బిఎం ప్రకారం ద్రవ్యలోటు లేకుండా చూసుకోవాలని కేంద్రం చెబుతుందని, కానీ కేంద్రం మాత్రం 3.5 శాతం పరిధి దాటి 5.4 శాతం ద్రవ్య లోటు కలిగి ఉన్నదన్నారు. అలాగే జిడిపిః రుణ నిష్పత్తి 40 శాతం ఉండాల్సి ఉండగా, 58.1 శాతం ఉందన్నారు. మరో సిపిఐ ఎంపి పి.పి.సునీర్ రాజ్యసభ చర్చలో పాల్గొంటూ కేరళ ఆర్థికంగా ఇబ్బందులు గురిచేసేలా కేంద్రం గొంతు నులుమతోందన్నారు. పదే పదే బిజెపిని కేరళ ప్రజలు ఓడిస్తుండడంతో, కేరళ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం శిక్షిస్తుందని విమర్శించారు. సహకార సమాఖ్య విధానాన్ని కేంద్రం విస్మరిస్తుందని, ఇప్పుడు కేరళ, తరువాత బిజెపి యేతర పాలిత ప్రభుత్వాలు ఉన్న తమిళనాడు, తెలంగాణ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు బిజెపిని నిలదీస్తాయని స్పష్టం చేశారు.

## నో వెహికిల్ జోన్‌గా కుంభమేళా



**ప్రయాగ్‌రాజ్ :** మాఘ పూర్ణిమతో పాటు ఇంకొన్ని రోజుల్లో కుంభమేళా పూర్తికావొస్తుండటంతో ప్రయాగ్‌రాజ్‌కు భారీగా భక్తులు తరలిరానున్నారు. ఇప్పటికే 350 కి.మీ. దూరం వరకు వాహనాలు నిలిచిన సంగతి తెలిసిందే. వీటన్నింటిని దృష్టిలోపెట్టుకొని అధికారులు కొత్త ఆంక్షలను అమల్లోకి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం 4 గంటల నుంచి కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా మార్పు చేయగా, సాయంత్రం 5 గంటల నుంచి ప్రయాగ్‌రాజ్ మొత్తాన్ని కూడా నో వెహికల్ జోన్‌గా మార్చారు. శని, ఆదివారాల్లో లక్షల మంది కుంభమేళా యాత్రికులు ఏకంగా 24 గంటలకు పైగా రహదారి పైనే వాహనంలో ఉండిపోవాల్సి వచ్చింది. జబల్‌పూర్ ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయరహదారిపై సుమారు 350 కి.మీ. పొడవున వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఘటన ప్రపంచంలోనే అతి పొడవైన ట్రాఫిక్ జామ్‌గా చరిత్ర పుటలకు ఎక్కింది. మరో 48 గంటల పాటు ఎవరూ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లొద్దని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటించారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ట్రాఫిక్ పరిస్థితులను గూగుల్‌లో చూసుకుంటూ ముందుకుసాగాలన్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, సివనీ, కట్నీ, మైహర్, సాత్నా, రివా జిల్లాల్లో భారీగా ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. 50 కి.మీ. మేర దూరం వెళ్లడానికే 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు.ఇక, ట్రాఫిక్ ఏర్పాట్ల గురించి సోమవారం రాత్రి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో పోలీసులు, అధికారులు సమావేశమయ్యారు. రోడ్లపై వాహనాలు భారీగా చేరకుండా చూడాలి. రద్దీ లేకుండా చూసుకోవాలి. పార్కింగ్ ప్రాంతాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి అని సిఎం ఆదేశాలు ఇచ్చారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంగం ఘాట్ వద్ద చోటుచేసుకున్న ఆ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. దానిని దృష్టిలో ఉంచుకొని మాఘ పూర్ణిమ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా యూపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

## కోటాలో నీట్ విద్యార్థి ఆత్మహత్య




**జైపూర్ :** ఉన్నత చదువు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్ కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఒత్తిడి కారణంగా గత కొంతకాలంగా విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపూర్ జిల్లాకు చెందిన అంకుష్ మీనా అనే విద్యార్థి నీట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో కోటాలోని ఓ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. తాజాగా అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, అతని మరణానికి చదువు ఒత్తిడితో సంబంధం ఉండకపోవచ్చని పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలే ఆత్మహత్యకు దారి తీసి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో తేలినట్లు చెప్పారు. మరోవైపు విద్యార్థి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## రాజ్యాంగ నిర్మాతల ప్రతులే ప్రామాణికం

### రాజ్యసభ చైర్మన్ ధన్‌కర్ వెల్లడి



**న్యూఢిల్లీ :** రాజ్యాంగ నిర్మాతలు సంతకం చేసిన రాజ్యాంగమే ప్రామాణికమైనదని, దానికి చేసిన సవరణలతో కూడిన అంశాలే దేశవ్యాప్తంగా అమలవుతున్నాయని రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ మంగళవారం వెల్లడించారు. దానికి అతిక్రమించడం క్షమార్హం కాదని, ప్రభుత్వం దానిని తీవ్రంగా పరిగణిస్తుందని తెలిపారు. 'ఇందులో ఏమాత్రం సందేహం లేదు. రాజ్యాంగ నిర్మాతలు సంతకం చేసిన రాజ్యాంగాన్నే దేశవ్యాప్తంగా అమలు చేయాలి. దానిలో 22 సూక్ష్మ చిత్రాలు ప్రచురించారు. సవరణలతో కూడిన రాజ్యాంగమే ప్రామాణికం. న్యాయ వ్యవస్థ సహా మరే వ్యవస్థ అయినా దానిని అతిక్రమించరాదు. సభ నాయకుడు ప్రామాణిక రాజ్యాంగం దేశమంతటా అమలు అయ్యేలా బాధ్యత వహించాలి' అని ధనకర్ అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్న రాజ్యంగ ప్రతులలో నాటి 22 సూక్ష్మ చిత్రాలను విస్మరిస్తున్నారని బిజెపి ఎంపి రాధా మోహన్‌దాస్ లేవనెత్తిన అంశంపై ధనకర్ పైవిధంగా వివరణ ఇచ్చారు. దీనిపై ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గె మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్‌ను బిజెపి అప్రదిష్టపాలు చేసేందుకే దీనిని ప్రస్తావిస్తోందన్న అంశంపై చర్చకు ధనకర్ నిరాకరించారు. దీనితో కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలుపుతూ సభను బహిష్కరించారు. కాగా ఇందులో నిరసన తెలిపేందుకు ఏముందని కాంగ్రెస్ సభను బహిష్కరించిందో అర్థం కావడం లేదని సభ నాయకుడు జె.పి.నడ్డా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఈ అంశానికి మద్దతు తెలిపితే గౌరవంగా ఉండేదన్నారు. రాజ్యాంగాన్ని ముద్రించేవారు రాజ్యాంగ నిర్మాతల భావనను గౌరవించాలని, వాటిలో సూక్ష్మ చిత్రాలనుకూడా ప్రచురిస్తే బాగుంటుందన్నారు. ధనకర్‌కూడా ఇందుకు మద్దతు తెలిపారు. దీనిని సభ దృష్టికి తెచ్చిన ఎంపి రాధామోహన్‌ను ఆయన ప్రశంసించారు. రాధామోహన్ తన ప్రస్తావనలో రాజ్యాంగంలో ఉండాల్సిన రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, మహావీరుడు, చక్రవర్తి విక్రమాదిత్య, లక్ష్మిబాయ్, శివాజి, మహాత్మా గాంధి చిత్రాలు ప్రస్తుత ముద్రణలలో కనిపించడం సభ దృష్టికి తెచ్చారు.

## ప్రయోజనం లేని డిజిటలైజేషన్

### తొక్కిసలాటపై ఎస్‌పి నేత అఖిలేష్ కన్నెర్ర



**న్యూఢిల్లీ :** మహా కుంభమేళా నిర్వహణలో సమర్థత లేకపోవడంపై సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ కన్నెర్ర చేశారు. నేటి వరకు తొక్కిసలాటలో ఎంతమంది చనిపోయారన్న నిర్దిష్ట సంఖ్యను చెప్పలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. డిజిటైజేషన్‌పై పెద్దయెత్తున ప్రచారం చేసుకున్న ప్రభుత్వం సమాచారం అందించడంలో విఫలమైందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రెండు తప్పులను చేసిందన్నారు. కుంభమేళాను సమర్థంగా నిర్వహించకపోవడం, తొక్కిసలాటతో తీర్థయాత్రికు వచ్చినవారు 300 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడం అని వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్ అంటే కనీసం ట్రాఫిక్‌నుకూడా సరిగా నిర్వహించకపోవడమేనా అని ఎద్దేవా చేశారు. భూమిపై సమస్యలు పరిష్కరించలేనపుడు చంద్రునిపైకి వెళ్లడంలో అర్థం లేదన్నారు. తొక్కిసలాట జరిగినపుడు డ్రోన్స్ ఏమయ్యాయి? చనిపోయినవారి సంఖ్య, తప్పిపోయినవారి వివరాలు చెప్పలేని డిజిటైజేషన్ ప్రయోజనం ఏమిటి? అని ప్రశ్నించారు. ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి నిర్వహించే కుంభ మేళా ఈసారి జనవరి 13న ప్రారంభమై 45 రోజుపాటు కొనసాగనున్నది. పవిత్రమైన ముని అమావాస్య రోజున జరిగిన తొక్కిసలాటలో 30మంది చనిపోయారని, 60మందికి గాయాలయ్యాయని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రాథమికంగా తెలిపింది. కేంద్ర బడ్జెట్‌పై చర్చలో మాట్లాడుతూ సామాన్యునికి ఎంతమాత్రం ప్రయోజనం లేనిదిగా పేర్కొన్నారు. అమెరికానుంచి భారతీయులను అమానుషంగా బహిష్కరించడంపై కూడా అఖిలేష్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

## అందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు కాంగ్రెస్ యత్నం : సిబల్



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఎల్లప్పుడూ అందరినీ ఏకాభిప్రాయంతో ఏకతాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తుందని రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ఉద్ఘాటించారు. భవిష్యత్తులో ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలో నిర్ణయించుకోవడానికి, ప్రస్తుతం నెలకొన్న గందరగోళాన్ని తొలగించడానికి ఇండియా కూటమి పార్టీలు కలిసి కూర్చోవాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం సిబల్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హర్యానా, గోవా, గుజరాత్, ఇతర ప్రాంతాల్లో అభ్యర్థులను నిలబెట్టినప్పుడు ఆయనను ప్రశ్నించాల్సి ఉండే అని అన్నారు. కాంగ్రెస్ ఎల్లప్పుడూ అందరినీ ఏకాభిప్రాయంతో ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుందని, కొన్నిసార్లు సమస్యలు ఎదురవుతాయన్నారు. బిహార్ ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్ అంచనాలకు తగ్గట్టుగా రాణించలేదని, అయితే కాంగ్రెస్ కారణంగా తాము అధికారంలోకి రాలేమని ఆర్‌జెడి పేర్కొందన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలో నిర్ణయించుకోవాలన్నారు. బిజెపికి ఒకే ఆదేశం ఉండటం, దాని వల్ల వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ సమాజ్‌వాదీ పార్టీతో కలిసి ఎన్నికల్లో పోరాడిందని, ఆ పార్టీ సహాయం చేసిందన్నారు. తమిళనాడులో కూడా అదే జరిగిందని, అందువల్ల వారు ఎలా ముందుకు సాగాలి అనే దానిపై వారు తమలో తాము చర్చించుకోవాలని మాజీ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఇండియా కూటమి ఒక జాతీయ కూటమి అని ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ పేర్కొన్నారని చెబుతూ ఈ అంశంపై గందరగోళం ఉందని, దానిని పరిష్కరించాల్సిన అవసరం ఉందని సిబల్ అన్నారు. తరువాత, పిటిఐతో మాట్లాడుతూ భాగస్వాములు విడివిడిగా (ఎన్నికలలో) పోటీ చేయాలా లేదా కలిసి పోటీ చేయాలా అని కూటమి నిర్ణయించుకోవాలని సిబల్ సూచించారు. 'సంకీర్ణ రాజకీయాలు చేయాలనుకుంటున్నారా లేదా ఒంటరిగా వెళ్లాలనుకుంటున్నారా అనే దానిపై పార్టీ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని శరద్ పవార్ అన్నారన్నారు.

## ఒడిశాలో గిరిజన బాలికపై అత్యాచారం

### నలుగురు యువకులు అరెస్టు

**కోరాపుట్ (ఒడిశా) :** ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో 14 ఏళ్ల గిరిజన బాలికపై నలుగురు యువకులు అత్యాచారం చేశారని పోలీసులు మంగళవారం తెలిపారు. శనివారం రాత్రి ఆ బాలిక తన స్నేహితులతో కలిసి 'జాత్రా' (గ్రామ థియేటర్)ను సందర్శించినప్పుడు ఈ సంఘటన జరిగింది. ఆమె జాత్రా నుండి తిరిగివస్తుండగా, నలుగురు నిందితులు ఆమెను అపహరించి సమీపంలోని కొండకు తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. ఆమె ఇంటికి తిరిగి వచ్చాక అత్యాచార విషయం తల్లిదండ్రులతో చెప్పినట్లు బాలిక తండ్రి చెప్పాడు. ఆమె కుటుంబం సోమవారం లక్ష్మీపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని, నలుగురు నిందితులను పొరుగున ఉన్న రాయగడ జిల్లాలోని కాశీపూర్ పోలీస్ స్టేషన్ ప్రాంతం నుండి అరెస్టు చేసినట్లు అధికారి తెలిపారు. విచారణ తర్వాత మంగళవారం నలుగురిని అరెస్టు చేసినట్లు లక్ష్మీపూర్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌ఛార్జి సుగ్యాని సాహు తెలిపారు. 'కోరాపుట్ జిల్లా ప్రధాన కార్యాలయ ఆసుపత్రిలో బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారి తెలిపారు. కోరాపుట్ పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ వర్మ నేతృత్వంలోని బృందం ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతోంది. జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ కిషోర్ రహత్కర్ ఒడిశా పర్యటన సందర్భంగా భువనేశ్వర్‌లో 'మహిళా జన్ సున్వై' (పబ్లిక్ హియరింగ్) నిర్వహించనున్న నేపథ్యంలో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది.

## ఛత్తీస్‌గఢ్‌లో 47 శాతం తగ్గిన హింసాత్మక ఘటనలు

### లోక్‌సభలో మంత్రి నిత్యానందరాయ్ వెల్లడి



**న్యూఢిల్లీ :** ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ హింసాత్మక ఘటనలు 2010తో పోలిస్తే 2024లో 47 శాతం తగ్గాయని, పౌరులు, భద్రతా సిబ్బంది మరణాలు 64 శాతం తగ్గాయని ప్రభుత్వం మంగళవారం లోక్‌సభకు తెలియజేసింది. 2010లో నమోదైన 499 వామపక్ష తీవ్రవాద (ఎల్‌డబ్ల్యుఇ) హింస కేసులు 2024లో 267 నమోదయ్యాయని ఒక ప్రశ్నకు సమాధానంగా హోం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. 2010లో 343 మరణాలు నమోదయ్యాయని, 2024లో 122 మరణాలు రికార్డయ్యాయన్నారు. గత ఐదు సంవత్సరాలలో భద్రతా సంబంధిత వ్యయ (ఎస్ఆర్ఇ) పథకం కింద అన్ని ఎల్‌డబ్ల్యుఇ ప్రభావిత రాష్ట్రాలకు విడుదల చేసిన రూ.1925.83 కోట్లలో ఛత్తీస్‌గఢ్‌కు 43 శాతానికి పైగా అందిందని రాయ్ చెప్పారు. ఎల్‌డబ్ల్యుఇ హింసలో మరణించిన పౌరులు, భద్రతా దళాల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, భద్రతా దళాల శిక్షణ, కార్యాచరణ అవసరాలు, లొంగిపోయిన నక్సల్ కార్యకర్తల పునరావాసం, కమ్యూనిటీ పోలీసింగ్, నక్సల్ హింసలో ఆస్తుల నష్టానికి భద్రతా సిబ్బంది, పౌరులకు పరిహారం అందించడం ద్వారా సామర్థ్య నిర్మాణానికి ఎస్ఆర్ఇ పథకం నిధులు సమకూరుస్తుందని ఆయన అన్నారు. ఈ పథకం కింద గత ఐదు సంవత్సరాలలో (2019–20 నుండి ఇప్పటి వరకు) అన్ని ఎల్‌డబ్ల్యుఇ ప్రభావిత రాష్ట్రాలకు రూ. 1925.83 కోట్లు విడుదలయ్యాయని, అందులో ఛత్తీస్‌గఢ్‌కు రూ. 829.80 కోట్లు ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. గత ఐదు సంవత్సరాలలో ప్రత్యేక మౌలిక సదుపాయాల పథకం (ఎస్ఐఎస్) కింద అన్నిఎల్‌డబ్ల్యుఇ ప్రభావిత రాష్ట్రాలకు విడుదల చేసిన మొత్తం రూ. 394.31 కోట్లలో 21.6 శాతం కూడా రాష్ట్రం అందుకుందని ఆయన అన్నారు. ఈ పథకం ప్రత్యేక దళాలు, ప్రత్యేక నిఘా శాఖలు (ఎస్ఐబి), జిల్లా పోలీసులను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో ఛత్తీస్‌గఢ్‌కు రూ. 85.42 కోట్లు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు 147 సహా ఏడు వందల రెండు ఫోర్టిఫైడ్ పోలీస్ స్టేషన్లు (ఎఫ్‌పిఎస్‌లు) ఎల్‌డబ్ల్యుఇ ప్రభావిత రాష్ట్రాలకు మంజూరు చేశామని, వీటిలో ఛత్తీస్‌గఢ్‌లోని 125 సహా 612 ఎఫ్‌పిఎస్‌లు నిర్మాణమయ్యాయన్నారు. ఎల్‌డబ్ల్యుఇ ప్రభావిత జిల్లాల్లో అభివృద్ధికి మరింత ప్రోత్సాహాన్ని అందించడానికి, ప్రజా మౌలిక సదుపాయాలు, సేవలలో కీలకమైన అంతరాలను పూడ్చడానికి ప్రత్యేక కేంద్ర సహాయం (ఎస్‌సిఏ) పథకం కింద రాష్ట్రాలకు నిధులు అందించబడుతున్నాయని ఆయన చెప్పారు. ఈ పథకం కింద, గత ఐదు సంవత్సరాలలో (2019–20 నుండి ఇప్పటి వరకు) అన్ని ఎల్‌డబ్ల్యుఇ ప్రభావిత రాష్ట్రాలకు రూ. 2384.17 కోట్లు విడుదల చేశామని, ఇందులో ఛత్తీస్‌గఢ్‌కు రూ. 773.62 కోట్లు కేటాయించామన్నారు. ఎల్‌డబ్ల్యుఇ నిర్వహణ పథకం కోసం కేంద్ర సంస్థల సహాయం కింద, గత ఐదు సంవత్సరాలలో (2019–20 నుండి ఇప్పటి వరకు) హెలికాప్టర్లు, ఎల్‌డబ్ల్యుఇ ప్రభావిత ప్రాంతాల్లోని భద్రతా శిబిరాల్లో కీలకమైన మౌలిక సదుపాయాలను పరిష్కరించడం కోసం కేంద్ర సంస్థలకు రూ.654.84 కోట్లు ఇచ్చినట్లు రాయ్ చెప్పారు.

## లాటరీ పంపిణీదారులు కేంద్రానికి 'సేవ పన్ను'అవసరం లేదు


### సుప్రీంకోర్టు తీర్పు వెల్లడి

### పన్ను విధింపు అధికారం రాష్ట్రానికే ఉంటుందని 'సుప్రీం' స్పష్టీకరణ



న్యూఢిల్లీ : లాటరీ పంపిణీదారులు కేంద్ర ప్రభుత్వానికి సేవ పన్ను (సర్వీస్ ట్యాక్స్)ను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించడం లేదనే అప్పీల్‌ను మంగళవారం కేంద్ర ప్రభుత్వం కొట్టివేసింది. సిక్కిం హైకోర్టు జడ్జిమెంట్‌కు వ్యతిరేకంగా కేంద్రం చేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బివి.నాగరత్న, ఎన్‌కె.సింగ్‌లతో కూడిన ధర్మాసనం అంగీకరించలేదు. ఏ ఇతర ఏజెన్సీతో సంబంధం లేని కారణంగా ప్రతివాదులైన లాటరీ డిస్ట్రిబ్యూటర్లు సేవ పన్ను చెల్లించడానికి బాధ్యులు కారు. అయినప్పటికీ ప్రతివాదులు భారత రాజ్యాంగం రెండవ జాబితా, ఎంట్రీ 62 కింద జూదం పన్నును రాష్ట్రానికి చెల్లించడం కొనసాగించవల్సి ఉంటుంది' అని జస్టిస్ నాగరత్న తీర్పు వెలవరించిన సందర్భంగా చెప్పారు. 'లాటరీ టికెట్ కొనుగోలు, సంస్థకు మధ్య జరిగే లావాదేవీలపై సర్వీస్ ట్యాక్స్ విధించబడదు. పైన పేర్కొన్న చర్చల దృష్ట్యా కేంద్రం, ఇతరులు దాఖలు చేసిన అప్పీళ్లలో ఎలాంటి ప్రయోజనం లేదని మేం కనుగొన్నాం. అందువల్ల ఈ అప్పీళ్లను మేం రద్దు చేస్తున్నాం' అని ధర్మాసనం తన తీర్పును వెలువరించింది. సిక్కిం హైకోర్టు తీర్పును సమర్థిస్తూ లాటరీలపై పన్నులు విధించే అధికారం కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంటుంది తప్ప కేంద్రానికి ఉండదు' అని బెంచ్‌త స్పష్టంచేసింది. సర్వీస్ ట్యాక్స్ విధించే అధికారం తనకే ఉందని కేంద్రం వాదించింది. కేంద్రం 2013లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. లాటరీ సంస్థ 'ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వెలువరించింది.

## జమ్మూకశ్మీర్‌లో ఐఈడీ పేలుడు.. ఇద్దరు సైనికుల మృతి



**జమ్మూకశ్మీర్:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం మరోసారి తలెగరేసింది. ఎల్ఓసీ వెంబడి ఉగ్రవాదులు అమర్చిన ఐఈడీ పేలడంతో ఇద్దరు సైనికులు మృతి చెందగా మరో సైనికుడు గాయాలపాలయ్యారు. అఖనూర్ సెక్టర్‌లో మంగళవారం సైనికదళాలు సరిహద్దు వెంబడి గస్తీ నిర్వహిస్తుండగా మధ్యాహ్నం 3.30 సమయంలో ఈ బాంబు పేలినట్టు ఆర్మీ ఓ ప్రకటనలో తెలిపింది. పేలుడుతో త్రీవ గాయాల పాలైన సైనికులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఓ కెప్టెన్, మరో సైనికుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో సైనికుడిని చికిత్స నిమిత్తం గగన మార్గంలో ఆర్మీ ఆసుపత్రికి తరలించామని, అతడికి ప్రాణాపాయం తప్పిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మరో వైపు ఘటన తరువాత సైన్యం ఆ ప్రాంతంలో అదనపు దళాలను మోహరించింది. ఎల్ఓసీ వెంబడి తనిఖీలను ముమ్మరం చేసింది. పేలుడు ఘటన గురించి జమ్మూలోని వైట్ నైట్ కోర్ యూనిట్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సైనికులకు వందనాలు అర్పిస్తున్నామని పేర్కొంది. కాగా, రెండు రోజుల క్రితం ఖేరీ సెక్టర్‌లో ఎల్ఓసీ వెంబడి ఉన్న అటవీ ప్రాంతంలో దాగున్న ఉగ్రవాదులు ఆర్మీ గస్తీ దళంపై కాల్పులకు తెగబడ్డారు. సరిహద్దు దాటి దేశంలోకి అక్రమంగా చొరబడేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో ఆర్మీ ఎదురుపడటంతో వారు కాల్పులకు దిగారు. దీంతో, భారత సైనికులు కూడా ఎదురు దాడి చేశారు. ఆ తరువాత చొరబాట్ల నిలవరించే చర్యలను సైన్యం మరింత కట్టుదిట్టం చేసింది. గస్తీని తీవ్రతరం చేసింది.

# అవసరమైన విద్యుత్ అందించేందుకు సిద్ధం

రెప్పపాటు కూడా అంతరాయం ఏర్పడొద్దు

'1912' నెంబర్ వినియోగదారులందరికీ చేరాలి

ఉత్తమ సేవలు అందించే సిబ్బందికి పురస్కారాలు

విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రానున్న వేసవిలో డిమాండ్ మేరకు విద్యుత్తును అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్ర మార్క అన్నారు. ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ అధికారులతో వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళి కపై సమీక్ష సమావేశాన్ని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. గత వేసవిలో వచ్చిన విద్యుత్ డిమాండ్, రానున్న వేసవిలో ఏ మేరకు విద్యుత్తు డిమాండ్ ఉంటుంది, అందుకు తగిన విధంగా అధికారులు చేసుకున్న ప్రణాళికల వివరాలను డిప్యూటీ సిఎం సమీక్షిం చారు. క్షేత్రస్థాయిలో అవసరాల మేరకు అధికా రులు కోరిన అన్ని వసతులు కల్పించిన నేప థ్యంలో రానున్న వేసవిలో క్షణం కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా అనే ది సున్నితమైన అంశమని, నిత్యావసరం కూడా ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని నిరంతరం అధికా రులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి ప్రణాళికపై అన్ని స్థాయిల్లో అధికారులు వెనువెంటనే సమావేశం నిర్వహించుకుని క్షేత్రస్థా యిలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఏ రీతిలో సన్నద్ధంగా ఉన్నారు, వినియోగదారు లకు సైతం అవగాహన కల్పించాలి అన్నారు. విద్యుత్ శాఖలో లైన్‌మెన్ మొదలు విద్యుత్ శాఖ మంత్రి వరకు ఒక కుటుంబం మాదిరిగా పనిచే యాలని, క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా వెంట నే పై అధికారికి ఫోన్ చేయాలని, వారు స్పందించ నట్లయితే ఉన్నతాధికారికి, చివరకు తనకు కూడా ఫోన్ చేయవచ్చని సిబ్బందికి డిప్యూటీ సిఎం భరోసా ఇచ్చారు. హైదరాబాద్ నగరంలో ఎమ ర్జెన్సీ వాహనాల ద్వారా కొనసాగుతున్న విద్యుత్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించా లని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికా రులు కోరిన అన్ని అనుమతులు ఇచ్చాం, మార్చి మొదటి తేదీ నాటికి సబ్ స్టేషన్ల నిర్మాణం ఇతర పనులు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. గత మూడు సంవత్సరాలుగా సబ్ స్టేషన్‌లపై పెరుగు తున్న లోడ్ భారం వివరాలను డిప్యూటీ సిఎం సమీక్షించారు.

**బాగా పని చేసే వారికి ప్రోత్సాహకంగా అవార్డులు**

విద్యుత్ సంస్థలలో బాగా పనిచేసే వారికి ప్రోత్సా హకంగా అవార్డులు సైతం ఇచ్చే కార్యక్రమాన్ని విద్యుత్ శాఖలో ప్రారంభించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మొన్నటి భారీ వరదల సమయంలో అర్ధరాత్రి కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారని, అటువంటి వారిని గుర్తించాలని డిప్యూటీ సిఎం అన్నారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించా లని భట్టివిక్రమార్క కోరారు. పెరు గుతున్న విద్యుత్ డిమాండ్, ప్రత్యా మ్నాయ విద్యుత్తు ఉత్పత్తి రంగం లో ప్రపంచంలో వస్తున్న మార్పు లపై సిబ్బందికి అవగాహన అవసరమని డిప్యూటీ సిఎం అభిప్రాయపడ్డారు.

**1912 విస్తృత ప్రచారం..**

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన 'డయల్ 1912' కు విస్తృతంగా ప్రచారం కల్పిం చాలని ఆదేశించారు. ఇలాంటి సేవలు అందుబా టులో ఉన్నాయని ప్రతి వినియోగదారునికి తెలి సేలా వారి మొబైల్ నెంబర్‌కు 1912 ఎస్ఎంఎస్ చేయాలని, కరెంటు బిల్లుపై సైతం 1912 సేవల గురించి ప్రచురించాలని ఆదేశించారు. ఈ విభా గాన్ని పటిష్టం చేసేందుకు సిబ్బంది సంఖ్య పెంచడం, సాంకేతికంగా అదనపు సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులు కేటాయిం చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సిఎం తెలిపారు. స్టోర్స్‌లో అందుబాటులో ఉన్న సామాగ్రి, రానున్న రోజుల్లో డిమాండ్‌కు తగిన విధంగా చేసుకుంటున్న ఏర్పాట్లపై వివిధ విభా గాల్లో ఉన్న సిఈలతో ప్రత్యేకంగా డిప్యూటీ సిఎం సమీక్ష చేశారు. గత ఏడాదికి వస్తున్న సమస్యల్లో తేడాలు, ఫిర్యాదులు తగ్గడానికి చేపట్టిన చర్యలను అధికారుల ద్వారా డిప్యూటీ సిఎం అడిగి తెలుసు కున్నారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీ, ఇంధన శాఖ ఓఎస్‌డి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టెక్నాలజీ అంటేనే హైదరాబాద్ వైపు చూడాలి

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టెక్నాలజీ అంటేనే ప్రపంచం హైదరాబాద్ వైపు చూసేలా తీర్చిదిద్ద డమే సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హెచ్ఐసి సిలో మంగళవారం జరిగిన '32వ హైసియా నేష నల్ సమ్మిట్ అండ్ అవార్డ్స్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జిసిసి)కు హబ్‌గా హైదరాబాద్‌ను మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పుడు మరో అడుగు ముందుకేసి వాటిని గ్లోబల్ వాల్యూ సెంటర్లు(జివిసి)గా మార్చాలని సంకల్పించిన ట్లుగా వివరించారు. ఈ జివిసిలు తెలంగాణను.. ముఖ్యంగా హైదరాబాద్‌ను ప్రపంచ టెక్నాలజీ పటంలో అత్యున్నత స్థాయికి చేర్చుతాయన్నారు. తెలంగాణ ఐటీ రంగం వార్షిక వృద్ధి రేటు 13 శాతం పైచిలుకు, ఐటీ ఎగుమతుల విలువ 32 బిలియన్ డాలర్లు, దేశీయ ఐటీ అవుట్‌పుట్ 5 బిలి యన్ డాలర్లుగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారే సత్తా తెలంగాణకు ఉందన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభు త్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేస్తుందన్నారు. గ్లోబల్ ఇన్నోవేషన్, డిజి టల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో హైదరాబాద్ గ్లోబల్ లీడర్‌గా ఉందన్నారు. హైదరాబాద్‌ను సెమీ కండ క్టర్స్, డీప్ టెక్ సొల్యూషన్స్‌లోనూ గ్లోబల్ హబ్ మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. హైదరా బాద్ లో 1500కు పైగా ఐటీ కంపెనీలున్నాయని, వీటిలో 15లక్షల మంది పని చేస్తున్నారన్నారు. వీరిలో 3లక్షల మంది ఏఐ నిపుణులు, లక్ష మంది చిప్ డిజైనర్లు ఉన్నారని కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, హైసి యా అధ్యక్షుడు ప్రశాంత్ నందేలా, ఎస్టీపీఐ హైద రాబాద్ డైరెక్టర్ మెస్సీ కవిత పాల్గొన్నారు.

**నైపుణ్య శిక్షణలో బహ్రెయిన్‌కు సహకరిస్తాం: మంత్రి శ్రీధర్ బాబు**

టి హబ్, టి వర్క్స్ లాంటి సంస్థలను బహ్రెయిన్ లో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర ఐటి, పరి శ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భారత్ లో ఆ దేశ రాయబారికి హామీ ఇచ్చారు. హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో బహ్రెయిన్ రాయబారి అబ్దుల్ రహమాన్ అల్ గావుద్, బహ్రెయిన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతిని ధులు మంగళవారం సమావేశమయ్యారు. తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే 'టి హబ్, టి వర్క్స్' తరహా సంస్థలను తమ దేశంలో కూడా ఏర్పాటు చేస్తామని బహ్రెయిన్ ప్రతినిధి బృందం తెలిపింది. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ 'టి హబ్, టి వర్క్స్ సిఇఓలు, స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తో వర్చువల్ కాన్ఫరెన్స్‌ను నిర్వహి స్తామని బహ్రెయిన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. విద్యా సంస్థలకు, పరిశ్రమలకు మధ్య స్కిల్స్ యూనివర్సిటీ ఒక వారధిగా పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో ఏటా 2 లక్షల మందికి పైగా ఇంజనీ రింగ్ గ్రాడ్యుయేట్లు, లక్ష మంది వరకు సాధారణ గ్రాడ్యుయేట్లను పూర్తి చేసుకుంటున్నారని, వీరం దరు తమకు ఇష్టమైన రంగంలో శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు పొందేలా స్కిల్స్ యూనివ ర్సిటీ ప్రణాళికలను రూపొందించిందని బహ్రె యిన్ ప్రతినిధి బృందానికి మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. విద్యార్థుల మార్పిడి, బోధన అంశా ల విషయంలో 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ' ,సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకే షన్ (ఐటిఇ)తో మధ్య పరస్పర ఒప్పందం కుదిరిం దని తెలిపారు. స్కిల్స్ యూనివర్సిటీలో 33 రంగా లకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహి స్తామని, రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు బహ్రెయిన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ముందుకు రావాలని మంత్రి శ్రీధర్‌బాబు బహ్రెయిన్ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించారు. ప్రపంచ దేశాలకు సర ఫరా అవుతున్న వ్యాక్సిన్లలో 40 శాతం హైదరా బాద్‌లో తయారవుతున్నాయని, దేశంలో 33 శాతం జనరిక్ ఔషధాలు ఇక్కడే ఉత్పత్తి అవుతు న్నాయని వివరించారు. కృత్రిమ మేథలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచేందుకు ప్రత్యేకంగా 200 ఎక రాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సమావేశంలో బహ్రె యిన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు మహ్మద్ అల్ కూహెజి, టిజిఐఐసి సిఇఓ మధు సూదన్ పాల్గొన్నారు.

# మావోయిస్టుల నిర్మూలన పేరుతో కార్పొరేట్లకు ఊడిగం

ఛత్తీస్‌గఢ్ కాల్పులపై నిష్పాక్షిక విచారణకు సిపిఐ డిమాండ్

**న్యూఢిల్లీ :** 'మావోయిస్టు ఉగ్రవాదంపై పోరాటం' పేరుచెప్పి ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఎన్‌కౌం టర్ హత్యలపై భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) తీవ్రంగా స్పందించింది. మావోయిస్టులతో భారత కమ్యూనిస్టుపార్టీకి తీవ్రమైన సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికి చర్చలకు, రాజకీయ పరిష్కారానికి తావు లేనివిధంగా మావోయిస్టులను సామూహికంగా కాల్చి చంపే ప్రభుత్వవైఖరిని సిపిఐ జాతీయ కార్యద ర్శివర్గం ఖండించింది. ఈ మేరకు మంగళవారం నాడు ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఛత్తీస్‌గఢ్‌లో ఆందోళనకరమైన పరిణామాలు సంభవిస్తున్న తరు ణంలో ఈ ఎదురుకాల్పుల ఘటనలపై నిష్పాక్షికంగా, స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఎన్ కౌంటర్ పేరుతో చెబుతున్న మావోయిస్టుల హత్యలపై నిష్పాక్షిక, స్వతంత్ర విచారణ జరపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ప్రభుత్వం ఒకవేళ అన్యాయంగా, అక్రమంగా హింసాత్మకపద్ధతులు అవలంబిస్తోందని ఎలాంటి సందేహాలైనా ఉంటే వాటిని పోగొట్టడానికి, నిజానిజాలు బయటపడటానికి ఈ విచారణ చాలా అవసరమని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది. ''మావోయిస్టు ఉగ్రవాదంపై పోరాటం పేరుతో ఛత్తీస్ గఢ్‌లో ఇటీవల సామూహిక ఎన్‌కౌంటర్ హత్యలు సంభవించాయి. ఈ హత్యలు తీవ్ర ఆందోళన కలిగిం చాయి. స్థానిక ప్రజలు మాత్రం ఈ ఎన్‌కౌంటర్ హత్య లపై అనేక భయసందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆ ముసుగులో తప్పుడు పద్ధతులలో అమాయకులైన గిరిజనులను లక్ష్యంగా చేసుకుని హత్యలకు పాల్పడుతున్నారన్న భయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అపనమ్మకం తదుపరి మరింత బలపడుతుంది. ఛత్తీస్‌గఢ్ ప్రాంతం విస్తారమైన ప్రకృతి, అడవులు, ఖనిజవనరులతో నిండి ఉంది. ఈ ప్రాంతాన్ని, ఈ వనరులను రోజురో జుకూ బడా కార్పొరేట్ సంస్థలకు స్వాధీనంచేసే చర్యలు పెరుగుతున్నాయి. ఈ విధంగా కార్పొరేట్ వ్యాపార సంస్థలకు ఈ ప్రకృతివనరుల ప్రాంతాన్ని స్వాధీనంచేసే పరిణామాలు వేలాదిమంది గిరిజనులు నిరాశ్రయులు కావడానికి లేదంటే వారిని బెదిరించి, బలవంతంగా వారిని అక్కడి నుండి గెంటేయడానికి దారితీస్తాయి. దేశీయ ఆదివాసీ గిరిజన ప్రజల జీవి తాలను పణంగాపెట్టి ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థల దోపిడీకి స్వాధీనం చేసే చర్యలకు, 'మావోయి జానికి వ్యతిరేకంగా పోరాటం' అనే ముసుగు తగిలిస్తే సరిపోదు. అందువల్ల ఆందోళన కలిగించే ఈ పరిణా మాల నేపథ్యంలో నిష్పాక్షిక, స్వతంత్ర విచారణ అని వార్యంగా జరపాలి'' అని సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం ఆ ప్రకటనలో కోరింది.

# చిన్నారుల్లో ఆనందం నింపడానికే 'వన్ ఈవినింగ్ డిన్నర్' : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చిన్నారుల్లో ఆనందం నింప డమే 'వన్ ఈవినింగ్ ఆఫ్ టు గెదర్ అండ్ జాయ్' కార్య క్రమ ఉద్దేశమని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ధన సరి అనసూయ సీతక్క అన్నారు. అనాథ విద్యార్థులకు హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని ఎఎస్ఎఫ్ బిబిక్యూ, గ్రిల్ రెస్టారెంట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా చిన్నారులతో కలిసి సీతక్క కాసేపు సరదాగా గడిపారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకు న్నారు. తమ సంపాదనలో కొంత సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని సీతక్క సూచించారు. చిన్న ప్పుడే పిల్లల్లో సేవ భావం పెంపొందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిలో ఉందని, చిన్నప్పటి నుంచే పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల ఎలా నడుచుకోవాలనే విషయా లను పిల్లలకు నేర్పించాలని ఆమె తెలిపారు. సామాజిక బాధ్యతగా చిన్నారులకు మంచి రుచికరమైన నాణ్య మైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ నిర్వాహకులు కాడ అఖిల్, ఆరిఫ్ అలీ తెలిపారు. ఎన్‌జిఒ చెందిన 70 మంది చిన్నారులకు ఆహార అందించడం ఆనందంగా ఉందన్నారు.

# రైతులకు పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తోందని, రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సర కాలంలోనే రైతుల సంక్షేమం కోసం రూ. 55,256 వేల కోట్లు వ్యయం చేసిందని చిన్నారెడ్డి తెలిపారు. రైతు భరోసా ద్వారా సుమారు రూ. 40 వేల కోట్లు రైతుల ఖాతాలో నేరుగా జమ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందని చిన్నారెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి పంట కాలంలో 25 లక్షల 36 వేల మంది రైతులకు రూ. 20,617 వేల కోట్లు రుణ మాఫీ చేసిందని చిన్నా రెడ్డి తెలిపారు. రైతులకు మంచి చేయాలనే తపనతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం తపిస్తోందని, అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. పదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, రైతుల కోసం చేసింది ఏమీ లేదని చిన్నారెడ్డి ఆరోపించారు. అధికారం కోల్పో యిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ నాయకులు మతిభ్ర మించి మాట్లాడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వంపై అవా కులు చెవాకులు పేలుతున్నారని చిన్నారెడ్డి అన్నారు.

# ఎసిబికి చిక్కిన ధారూర్ ఎస్ఐ



**ప్రజాపక్షం/ధారూర్ :** లంచం తీసుకుంటు ఎసిబి అధికారులకు పట్టుబడిన వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ ఎస్ఐ వేణుగోపా ల్‌గౌడ్ ,ధారూర్ మండల ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి ఓ కేసు విషయంలో నాగస మందర్‌కు చెందిన వ్యక్తి వద్ద రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబికి పట్టుబడ్డాడు, ఓ కేసు విషయంలో ఆ వ్యక్తి వద్ద 70,000 వేలు డిమాండ్ చేయగా ,అందులో కొంత అమౌంట్ సమకూర్చిన అనంతరం గత కొన్ని రోజులుగా పోలీస్ స్టేషన్ చూట్టు తిరుగుతున్నా పని కాకపోవడంతో విసుగు చెందిన వ్యక్తి ఎసిబి అధికా రులను ఆశ్రయించడంతో మాటు వేసి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# ప్రజావాణిలో 2,480 దరఖాస్తులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో 2,480 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 139, విద్యుత్ శాఖకు సంబంధించి 110, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 36, ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,130 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 64, ప్రవాసీ ప్రజావాణిలో 01 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణా ళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పలు సమస్యలకు తక్షణ పరిష్కారం చూపారు.

# ఈ ఏడాది 6.4 శాతంగా జిడిపివృద్ధి అంచనా

చివరి త్రైమాసికంలో పుంజుకుంటున్నాం

లోక్‌సభలో నిర్మలాసీతారామన్

**న్యూఢిల్లీ :** భారతదేశ స్థూలజాతీయోత్పత్తి (జిడిపి)వృద్ధి పుంజుకుంటున్న దాఖలాలు కళ్ళకు కనిపిస్తున్నాయని, దేశం శరవేగంగా అభివృద్ధి చెందే ఆర్థికవ్యవస్థ జాబి తాలో కొనసాగుతోందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతా రామన్ అన్నారు. మార్చి 31వ తేదీతో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధిని 6.4 శాతంగా అంచ నావేస్తున్నట్లు ఆమె చెప్పారు. గడిచిన 12 త్రైమాసికాలలో కేవలం రెండు త్రైమాసికాలలో మాత్రమే వృద్ధి రేటు 5.4 శాతంగా లేదా కనిష్ఠస్థాయిలో నమోదైందని చెప్పారు. ప్రస్తుత ఆర్థికసంవత్సరం రెండోత్రైమాసికంలో నమోదైన 5.4 శాతం కనిష్ఠ జిడిపివృద్ధి నుండి ఆర్థికవ్యవస్థ ఈ చివరి త్రైమాసికంలో శరవేగంగా పుంజుకుంటున్నదని చెప్పారు. ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఉండేందుకు, అందుకు పూర్తి భరోసా ఇచ్చేందుకు వీలుగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. లోక్‌సభలో మంగళవారం నాడు 2025–26 కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చకు నిర్మ లాసీతారామన్ సమాధానం చెబుతూ, ప్రజల చేతుల్లో నగదు చెలామణీ, లావాదేవీల పెరుగుదలకు వీలుగా వివిధ చర్యలను బడ్జెట్‌లో తీసుకున్నామని చెప్పారు. ఒక వైపు ద్రవ్యపరమైన పొదుపు పాటిస్తూనే ఈ చర్యలు తీసు కున్నామన్నారు. 2026 ఆర్థిక సంవత్సరానికిగాను మూలధన పెట్టుబడి వ్యయంలో 99 శాతం మేరకు అప్పులు తీసుకోవడం ద్వారా ద్రవ్యపొదుపు పాటించా మని చెప్పారు. తమ ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని వినియోగదా రుల ధరల ద్రవ్యోల్బణం (సిపిఐ) భరించగలిగే స్థాయిలో 2–6 శాతం మధ్యలో ఉండేవిధంగా చూస్తున్నామని చెప్పారు. ద్రవ్యోల్బణం ధోరణి ప్రత్యేకించి ఆహార ద్రవ్యో ల్బణం మధ్యస్థంగా ఉందని చెప్పారు. జిడిపి వృద్ధి గురించి మాట్లాడుతూ, 2024–25 ఆర్థిక సంవత్సరంలో మూడేళ్ళ ముందుకాలం వరకూ జిడిపివృద్ధి సగటు నిష్ప త్తి ఎనిమిది శాతంగా ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్స రంలో భారత ఆర్థికవ్యవస్థ 6.4 శాతం మేరకు వృద్ధిసాధి స్తుందన్న అంచనాలు ఉన్నాయన్నారు. కాగా కేంద్ర ఆర్థి కమంత్రిత్వశాఖ చేసిన ఆర్థిక సర్వే, 2026 ఆర్థిక సంవ త్సరంలో వృద్ధిని 6.3–6.8 శాతం మధ్య ఉంటుందని అంచనా వేసింది.

''బలమైన ఆర్థిక పునాదులు ఉన్నందువల్లనే శరవేగంగా భారత ఆర్థిక వ్యవస్థ పుంజుకుందని, అందుకు మద్దతు ఇచ్చేందుకు తగిన చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నదని నిర్మలా సీతారామన్ లోక్‌సభలో చెప్పా రు. జులై–సెప్టెంబరు నాటి రెండో త్రైమాసికంలో జిడిపివృద్ధి గతంలో ఏడో త్రైమాసికంలో ఉన్నట్టుగా 5.4 శాతం మేరకు నమోదైందని చెప్పారు. ఇప్పుడు జరుగు తున్న ఆర్థిక పరిణామాలకు మద్దతుగా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటున్నదని, తద్వారా భారత్ శరవేగంగా వృద్ధిచెందే ఆర్థిక వ్యవస్థల జాబితాలో కొనసాగుతుందని చెప్పారు.

# బ్రౌన్ షుగర్ పట్టివేత.. ఇద్దరి అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిషేధిత బ్రౌన్ షుగర్‌ను విక్రయిస్తున్న ఇద్దరు యువకులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టిడిఎఫ్ సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కున్నారని శంషాబాద్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలి పారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎస్‌కె అలుల్ (27), హైదరాబాద్‌కు చెందిన నరసింహులు (26)లు పశ్చిమబెంగాల్‌లో బ్రౌన్‌షుగర్ ఒక గ్రాము రూ.1500 చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్‌లో గ్రాము రూ.5 వేలకు విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే నానక్‌రామ్‌గూడలో బ్రౌన్‌షు గర్‌ను అమ్ముతుండగా ఈ మేరకు సమాచారం అందుకున్న డిటిఎఫ్ సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**గంజాయి పట్టివేత..**

ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ సిఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి కూకట్‌పల్లిలో అక స్మిక తనిఖీలు జరపగా గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు యువకులు పట్టుబ డ్డారు. వారి నుంచి 1.150 కెజిల గంజాయిని పట్టుకున్నారు. గంజాయిని విక్రయిస్తున్న ఎండి సమీర్ (23), కొల్లెటి సాయికుమార్(19)లను అరెస్టు చేశారు.

# కానరాని 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్'

బడ్జెట్‌పై విపక్షాల విరుపులు

**న్యూఢిల్లీ :** బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న సబ్ కా సాథ్(అందరితో కలిసి), సబ్ కా వికాస్(అందరి పురో గతి) నినాదాలు కనిపించడం లేదని, బడుగు వర్గాలకు సంబం ధించిన పథకాల కేటాయింపులలో కత్తిరింపులు, రైతులు, ఎస్‌సి, ఎస్టీల గోడును పట్టించుకోవడం లేదని కేంద్ర బడ్జెట్‌పై మంగళ వారం రాజ్యసభలో జరిగిన చర్చలో విపక్షాలు పెదవి విరిచాయి. బడ్జెట్‌పై సమాజ్‌వాది పార్టీ ఎంపి జావేద్ అలి ఖాన్ మాట్లా డుతూ బడుగు వర్గాల సంక్షేమానికి నిర్దేశించిన పథకాలకు సంబంధించిన కేటాయింపులలో సంవత్సరాల తరబడి కోత విధి స్తున్నారని అన్నారు. 2024–25 వార్షిక బడ్జెట్‌లో బడుగుల పథ కాలకు సంబంధించి కొన్నింటిని ఉపసంహరించుకున్నారని, కొన్ని పథకాలకు కేటాయింపులలో కోత విధించారని అన్నారు. బడుగువర్గాల విద్యార్థులకు ప్రిమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబం ధించి 2023–24 బడ్జెట్‌లో రూ.433 కోట్లు కేటాయించారని, కానీ కేవలం రూ.94 కోట్లు మాత్రమే విడుదల చేశారని, 2024–25 వార్షిక బడ్జెట్‌లో రూ.326 కోట్లు కేటాయించి, కేవలం రూ.90 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని వివరించారు. ఇక పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి 2024–25 బడ్జె ట్‌లో రూ.1145 కోట్లు కేటాయించి, దానిని రూ.413 కోట్లకు తగ్గించారన్నారు. సాంకేతిక విద్యకు సంబంధించి మెరిట్ స్కాల ర్‌షిప్‌లను 2024–25 బడ్జెట్‌లో 33.8 కోట్లను కేటాయించి, కేవలం 7.34 కోట్లను మాత్రమే అందజేశారన్నారు. మదర్సా, మైనారిటీ పథకాలకు 2023–24 బడ్జెట్‌లో రూ.10 కోట్లు, 2024–25 బడ్జెట్‌లో రూ.2 కోట్లు కేటాయించగా ఇపుడది రూ.1 లక్షకు పరిమితమయిందన్నారు. వీటిని గమనిస్తే సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ తత్వం ఏమాత్రం కనిపించడం లేదన్నారు. మైనారిటీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తున్నారని, ముస్లింలను ప్రథమ శత్రువులుగా, క్రిస్టియన్లను ద్వితీయ శత్రువు లుగా బడ్జెట్‌లు ప్రతిఫలిస్తున్నాయని జావేద్ విమర్శించారు. రై తుల రుణ మాఫీపై కాంగ్రెస్ ఎంపీ మాట్లాడుతూ వ్యయ ఆధా రిత కనీస మద్దతు ధరను నిర్ణయించడానికి ఒక చట్టం రూపొం దించాలన్నారు. నిరుద్యోగంపై మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల చాలా తక్కువగా ఉన్నాయని, ప్రైవేటు రంగంలో ఆరో గ్యకరమైన పని వాతావరణం లేదన్నారు. దేశవ్యాప్తంగా కులగ ణన జరగాలిని, మాజీ ప్రధాన స్వర్గీయ మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిజు జనతాదల్‌కు చెందిన నిరంజన్ బిషి మాట్లాడుతూ పెట్రోల్, దీజిల్, గ్యాస్ ధల రను తగ్గిస్తే ద్రవ్యోల్బణం కూడా తగ్గేదని అన్నారు. బొగ్గు రాయి తీలను పెంచితే ఒడిషా తనవంతు న్యాయమైన వాటాను పొంద గలదన్నారు. నిరుద్యోగం పెరిగిందని, సామాన్య ప్రజలు, ఎస్‌సి, ఎస్టీ వర్గాలు ఎన్నో బాధలు ఎదుర్కొంటున్నాయన్నారు. బడ్జెట్‌లో వారి సంక్షేమం కోసం ఎలాంటి కేటాయింపులు లేవన్నారు. బడుగు వర్గాలు అభివృద్ధి చెందకపోతే 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కేరళకు చెందిన సిపిఐ సభ్యుడు పిపి సునీర్ ఇది బిజెపి అనుకూల బడ్జెట్ అని, కేంద్ర ప్రభుత్వం కేరళపై కక్షకట్టినట్టుగా ఉందన్నారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కేర ళను నిలువరించేందుకు బిజెపి ప్రభుత్వం వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. బిజెపి కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిం చినందునే కేరళ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు బిజెపి ప్రభుత్వం కక్షపూరిత విధానాలను అవలంబిస్తోందని ఆరోపిం చారు. గత యేడాది వరదలు, కొండచరియలు విరిగిపడడంతో విలవిలలాడిన వాయనాడ్‌కు నిధులు కేటాయించడంలో కేంద్రం అలసత్వం ప్రదర్శించిదని విమర్శించారు. సిపిఐ(ఎం) సభ్యుడు ఎఎ రహీం కూడా కేంద్ర ఆర్థిక విధానాలపై విరుచుకుపడ్డారు. వేతనాల పెరుగుదల, ప్రజల కొనుగోలు శక్తి పెరగినపుడే ఆర్థిక సమానత్వం ఏర్పడుతుందని, ప్రజల సమస్యలను పరిష్కరించ డంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు.

# భూదాన్ భూములపై కేసు విచారణ వాయిదా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూ దాన్ భూములపై నివేదిక ఇచ్చేం దుకు 4 వారాల గడువు కావాలని చీఫ్ సెక్రటరీ శాంతికుమారి హైకో ర్టులో కౌంటర్ దాఖలు చేశారు. భూములపై అధ్యయనానికి కమిటీ తుది విచారణ ఈనెల 15న జరు గుతుందన్నారు. ఫైనల్ రిపోర్టు ఇచ్చేందుకు సమయం ఇవ్వాలని సీఎస్ కోరడంతో విచారణను మార్చి 10వ తేదీకి వాయిదా వేస్తూ జస్టిస్ భాస్కర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

# మెట్రో విస్తరణపై 'పిల్'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎంజీబీఎస్ నుంచి శంషాబాద్ వరకు మెట్రో రైలు విస్తరణ పనులను ఆపాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. అనేక చారిత్రక కట్టడాలు ఉన్నప్పటికీ మెట్రో రైలు నిర్మాణాలు చేసేందుకు ప్రభుత్వం అను మతి ఇవ్వడాన్ని తప్పుపడుతూ మహమ్మద్ రహీం ఖాన్ పిల్ దాఖలు చేశారు. యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన డివి జన్ బెంచ్ ఎదుట విచారణకు వచ్చినప్పుడు పిటిషనర్ న్యాయవాది వాయిదా కావాలని కోరడంతో విచారణ మార్చి 18వ తేదీకి వాయిదా పడింది. ఫలక్ నుమా, చార్మినార్, పురానా హవేలి, దార్–ఉల్–షిఫా, అజాఖాన్ ఆయేజెహ్రా, ఇమా మసీద్, మొగల్‌పురా టూంబ్స్ వంటి చారిత్రక కట్టడాల భద్రతపై ఏవి ధమైన చర్యలు లేకుండానే మెట్రో రైలు నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం చెల్ల దన్నారు. చీఫ్ సెక్రటరీ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, హెచ్ఎండీయే కమిషనర్, మెట్రో ఎండీ, వక్ఫ్ బోర్డు సీఈఓలను ప్రతివాదులుగా చేశారు.

## నేడు కల్వకుర్తిలో మంత్రుల పర్యటన



ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి మండలంలో బుధవారం పంచాయతీరాజ్‌శాఖమంత్రి సీతక్క, ఎక్సైజ్‌శాఖమంత్రి జూపల్లికృష్ణారావులు పర్యటించనున్నట్లు కాంగ్రెస్‌పార్టీరాష్ట్ర నాయకులు, కల్వకుర్తి మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మంత్రులతో పాటు ఎంపి మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిలు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 2గంటలకు మార్చాలగ్రామంలో బిటిరోడ్డు ప్రారంభోత్సవం, 3గంటలకు మున్సిపాలిటిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు పాల్గొనడం జరుగుతుందన్నారు.



## ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన ఐదు రూపాయల భోజనం క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన ఆహారాన్ని కేవలం 5 రూపాయలకే భోజనం అందజేయడం జరుగుతుందని, భోజనం తయారు చేయడానికి 28 రూపాయలు ఖర్చు అవుతుంది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ నుంచి 23 రూపాయలను మహిళా సంఘాల సభ్యులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మంచి భోజనాన్ని ఆసుపత్రికి వచ్చే రోగులకు వారి సహాయకులు ఉపయోగించుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రూ.2.25కోట్లతో బిటి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గౌరారం గ్రామం నుంచి సల్కాలాపురం వరకు రూ.2.25 కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం పనులకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శిలాఫలకం వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, మేఘారెడ్డిలు మాట్లాడుతూ నియోజకవర్గాల పరిధిలోని ప్రతి గ్రామానికి, తండాకు బీటీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అర్హులైన అందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని అధైర్యపడవద్దని అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా ఇప్పటికే ఎకరంలోపే ఉన్న రైతులందరికీ పెట్టుబడి డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. ఈ నెల ఆఖరు వరకు మిగతా రైతులందరికీ జమ అవుతాయని అన్నారు. వారి వెంట ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

పజాపక్షం / మాగనూర్ : మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం 53 మంది లబ్ది దారులకు కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. ముఖ్యంగా వ్యవసాయాన్ని పండుగ చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, రైతులకు రుణమాఫి, రైతు భరోసా , రైతు భీమా, పంటల భీమా పథకాలతో రైతన్నలను ఆదుకుంటుందన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి లక్ష్మారెడ్డి, తహసీల్దార్ సురేష్ , ఎంపీడీఓ రహమ్మతుద్దీన్ , ఆర్ఐ శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్ , శివరాంరెడ్డి, రవీందర్ ,దూల తిప్పయ్య, వేణు, ఆనంద్ తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## జిపి ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

ప్రజాపక్షం / నారాయణపేట : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమక్షంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ నిశితం గా పరిశీలించారు. జిల్లా రెవెన్యూ డివిజన్లలోని ఒక్కో మండలం వారిగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు ఓపిఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానిలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకొని ప్రిసైడిం గ్ అధికారులు, ఓపిఓల ర్యాండమైజేషన్ జరిపారు. మాస్టర్ ట్రైనర్స్‌చే వీరికి పోలింగ్ నిర్వహణపై శిక్షణదా తరగతులు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిసిఈఓ భాగ్య లక్ష్మి , డిపిఓ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 14,15న మహబూబ్‌నగర్ నగరోత్సవం

### కలెక్టర్ విజయేందిర బోయి శిల్పారామం సందర్శన, ఏర్పాట్లపై అధికారులతో పరిశీలన

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: ఈ నెల 14,15 తేదీల్లో మన మహబూబ్‌నగర్ మహా నగరోత్సవం కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ పట్టణంలోని శిల్పారామంలో ఉదయం 10.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్ పట్టణంలోని శిల్పారామంను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి శిల్పారామంను సందర్శించారు.

ఈ నెల 14,15 తేదీలలో నిర్వహించనున్న మన మహబూబ్‌నగర్ మహానగరోత్సవం ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. వేదిక, స్టాల్‌ల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శ న తదితర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ మహబూబ్‌నగర్ కార్పోరేషన్ గా ఏర్పాటు సందర్భంగా మహబూబ్‌నగర్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14,15 తేదీల్లో రెండు రోజులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫన్ గేమ్స్, మూవీ నైట్, మార్కెట్ స్టాల్‌లు, ఫుడ్ స్టాల్‌లు, సాంస్కృతిక, ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంకు ఎంట్రీ ఉచితమని, మహబూబ్‌నగర్ పట్టణంలోని పురప్రముఖులు, ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.జడ్పిటిసి, ఎంపిటిసి, గ్రామపంచాయితీ ఎన్నికలకు మాస్టర్ ట్రైనర్‌లుగా నియమించిన వారు ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిర్వహణ నిబంధనలపై అవగాహన కలిగించాలి.



**మాస్టర్ ట్రైనర్‌లు ఎన్నికల సిబ్బందికి అవగాహన కలిగించాలి**

జడ్పిటిసి, ఎంపిటిసి, గ్రామపంచాయితీ ఎన్నికలకు మాస్టర్ ట్రైనర్‌లుగా నియమించిన వారు ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిర్వహణ నిబంధనలపై అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం జడ్పి సమావేశమందిరంలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్‌లు మండల స్థాయి ట్రైనర్‌లకు జడ్పిటిసి, ఎంపిటిసి గ్రామపంచాయితీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులను, అర్ఓ, ఏఆర్ఓలను నియమించినట్లు అలాగే గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులను స్టేజ్ 1 అర్ఓ, ఏఆర్ఓ, స్టేజ్ 2 అర్ఓలను నియమించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 15లోగా పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు, హ్యాండ్ బుక్ క్షుణ్ణంగా చదివి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు.

ఈ కార్యక్రమం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్పిసిఈఓ వెంకటరెడ్డి, డిఈఓ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

### ఎస్‌పి డి.జానకి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఇసు క తరలింపు, విక్రయం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో అనుమతి లేకుండా ఇసుకను తరలించడం, అక్రమంగా నిల్వ చేయడం వంటి కార్యకలాపాలను నిరోధించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక దాడులు నిర్వహిస్తోంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో దాడులు చేసి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

**కఠిన చట్టాలతో కేసులు నమోదు**

ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై ప్రివెన్ష న్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ చట్టం మైన్స్ అండ్ మినరల్స్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగు తుందని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి ప్రభుత్వ అనుమతులున్న వారికి మాత్రమే ఇసుక రవాణా, విక్రయించేందుకు హక్కు ఉం దని, ఇతరులెవరైనా తాము సబ్ కాంట్రాక్టర్స్ అంటూ ఇసుక రవాణాకు పాల్పడితే, వారిపై కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా గురించి ప్రజలు సమాచారం అందించాలని, 100 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతా మన్నా రు. ప్రభుత్వ ఆసుపత్రి ఉన్న ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్ల భద్రతను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వెల్లడించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి, నిఘా పెంచుతున్నామని తెలిపారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే లేదా అధిక ధరలకు విక్రయిస్తే, వారిపై కఠిన సెక్షన్ల కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.జానకి హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక లావాదేవీలు జరిపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని స్పష్టం చేశారు.

## ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

### ఎమ్మెల్యే డా.రాజేష్‌రెడ్డి



ప్రజాపక్షం/బిజినేపల్లి:మండలంలోని ప్రతి గ్రామంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా ఎక్కడికక్కడ కాలువలు తీసి పారేస్తున్నట్లు ఎమ్మెల్యే డా.రాజేష్ రెడ్డి అన్నారు. మండలంలోని సాయినిపల్లి శివారులోని కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిం చిన మార్కండేయ పంప్ హౌస్‌ను మంగళవారం ఆకస్మిక తనిఖీచేసి పనులను పరిశీలించి మాట్లాడారు. కాలువల పనులు సకాలంలో పూర్తిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండు పంటలకు నీళ్లు అందించేలా పనుల పురోగతి ఉండాలని నీటి పారుదల శాఖ ఇంజనీర్లను పార్థసారథి, శివరాంలను ఆదేశించారు. అలా గే పంప్ హౌస్ ద్వారా ఎర్రకుంట, ఊర చెరువులను నింపి ఆయకట్టు రైతులకు, చుట్టూ ఉన్న పొలాలకు సాగునీరు అందించి రైతుల కండ్లల్లో ఆనందం నింపుతానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల గుండె లలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధి పరుగులు పెట్టేలా సహకరించాలని రైతులను కోరారు. అనంతరం మార్కండేయ పంప్ హౌస్ కాలువలను, కుంటలను కలియ తిరిగి పరిశీలించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మాజీ సర్పంచు అవంతి శంకర్, అమృత్ రెడ్డి, తిరుపతయ్య, హరీశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, వీరేందర్, రాంచందర్ నాయక్, తదితరులు ఉన్నా రు.

**అభివృద్ధికి సహకరించండి**

మండలంలోని మార్కండేయ ప్రాజెక్టు ద్వారా వివిధ గ్రామాలకు తాండలలో వివిధ పంటలను సాగు చేసుకునే రైతన్నలకు సూచించారు. మంగళంవారం రోజు మండలంలోని వాసు రామ్ తండా ఇతర తాండలతో పాటు ఆయా గ్రామాల రైతుల యొక్క పంట పొలాలను పరిశీలించారు. ఆ పార్టీ ఈ పార్టీ అనకుండా జెండాలను ఎజెండాలను పక్కనపెట్టి రైతులు ఆర్థికంగా మరింత ఎత్తుకు ఎదిగేందుకు మార్కండే ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని సద్వినియోగం చేసుకొని వివిధ రకాల పంటలను సాగు చేసుకుని అధిక దిగుబడులను పొందుతూ ప్రతి రైతు ఆర్థికంగా మరింత ఎత్తుకు ఎదిగి అప్పుడే రైతు కలలో ఆనంద్ అని చూడడమే తన యొక్క లక్ష్యం అని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం రోజు విస్తృతంగా పర్యటన చేస్తూ అన్నారు. మనకు అనేక వనరులు సౌకర్యాలు పుష్కలంగా ఉన్నాయని ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు కేవలం రైతు పంట సాగు చేసి తక్కువ దిగుబడి పొందడం వల్ల నష్టపోవడం అనేది కాకుండా ప్రాజెక్టు ద్వారా వచ్చి నీటిని సద్వినియోగం చేసుకొని పంటలకు అందించి ఎక్కువ దిగుబడిను పొంది రైతు కళ్ళలో ఆనందం చూసినప్పుడే మనం మంచిగా ఉంటామని ఆయన ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. దీనిలో భాగంగా మార్కండేయ ప్రాజెక్టు ద్వారా రైతులకు సంపూర్ణ స్థాయిలో ప్రాజెక్టు కింద ఉన్న రైతులకు ప్రతి ఎకరాకు నీరు అందించడమే తన యొక్క లక్ష్యమని తెలిపారు.



## అభ్యంతరాలు తెలపండి

ప్రజాపక్షం/కల్వకుర్తి:కల్వకుర్తి ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలోల నోటిసుబోర్డుపై ఎంపిటిసి, జడ్పిటిసి 2024 ఎన్నికలకు సంబంధించిన పోలింగ్‌కేంద్రాల వివరాలను ప్రచురించినట్లు ఎంపిడిఓ వెంకట్‌రాములు మంగళవారం తెలిపారు. వాటికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 13వరకు తెలపగలరని ఆయన కోరారు. 14న మండల పరిషత్ కార్యాలయంలో గుర్తింపుపొందిన రాజకీయపార్టీలతో సమావేశం నిర్వహించి 15న తుదిజాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## రంగరాజన్‌పై దాడిచేసిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి

ప్రజాపక్షం/మక్తల్: అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ ఆధ్వర్యంలో స్థానిక మక్తల్ పట్టణ కేంద్రంలోని విశ్రాంతి గృహం నందు చిలుకూరి బాలాజీ టెంపుల్ పూజారి రంగరాజన్‌పై దాడిని నిరసిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తూర్పు గోదావరి జిల్లాకి చెందిన హిందూ మతోన్మాద దుర్మార్గులు వీర రాఘవ రెడ్డి అతడి అనుచరులు గత రెండు రోజుల క్రితం రామరాజ్య స్థాప నకు ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేస్తున్నామని కాబట్టి దానికి డబ్బులు ఇవ్వాల్సిందిగా చిలుకూరి బాలాజీ దేవాలయ బ్రాహ్మణ పూజారి రంగరాజన్‌పై ఒత్తిడి చేసిన వారిని కఠినంగా శిక్షించి, పూజారి రంగరాజన్‌కి న్యాయం చేయాలని డిమాండు చేశారు.గత కొంత కాలంగా గౌరవ ప్రజాప్రతినిధుల స్థాయిలలో ఉన్నటువంటి బండి సంజయ్, రాజాసింగ్ వంటి మతోన్మాద నాయకులు ఈ భారతదేశం ఒక్కప్పటి హిందూ దేశమని, ఇక్కడ రామరాజ్యం స్థాపిస్తామని ప్రకటనలు చేస్తూ కలిసిమెలిసి బతుకుతున్న ప్రజల మధ్య మతకలహాలకు కారణం అవుతున్నారని వీరివలన దేశవ్యాప్తంగా ఎక్కడ పడితే అక్కడ మతోన్మాద గుండాలు దాడులకు పాల్పడుతున్నారని, భవిష్యత్తులో ఇలాంటి సంఘట నలు పునరావృతం కాకుండా వీరిపై రాజ్య ద్రోహం కేసులు పెట్టి కఠినం గా శిక్షించాలని అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్ క్రియాశీలక సభ్యులు బ్యాగరి శ్రీహరి, కే.సురేష్, కర్నే సురేష్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



## ఇసుకరీచ్‌లలో ఆకస్మిక తనిఖీలు

### కలెక్టర్ బదావత్‌సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: ఉప్పునుంతల మండలం మొల్గర గ్రామంలోనిగల ఇసుకవాగును, పెద్దాపూర్‌వాగును జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్‌తోకలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఇసుకకమిటి సభ్యులతో కలిసి ఇసుకరీచ్‌లను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇసుకరీచ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుకతవ్వకాలకు ఉదయం 9గంటలనుండి సాయంత్రం 5గంటలవరకుమాత్రమే అనుమతి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ఇసుకరీచ్‌లవద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు విధుల్లో ఉంటారని వివరించారు. ఇసుకరీచ్‌వద్దకు చేరుకునే వినియోగదారులు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదుచేసుకున్న కూపన్లను సమర్పించాలి. సంబంధిత రెవెన్యూ పోలీస్ అధికారులు ముందుగా ఆన్‌లైన్‌లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇస్తారని తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను ఆరికట్టడంలోభాగంగా ఇసుకను ఆన్‌లైన్‌ద్వారా బుకింగ్‌చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. ఎన్‌టిటి నిబంధనలకు విరుద్ధంగాయంత్రాలతో ఇసుక తవ్వకాలుజరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అనుమతులు పొందిన పరిధిలోనే మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు జరగాలని మైనింగ్‌శాఖ అధికారులకు సూచించారు. ఈక్రమంలో పోలీస్, రెవెన్యూ, శాండ్‌కమిటి, ఇతర సంబంధితశాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

ఇసుక అక్రమ తవ్వకాలను ఆరికట్టేందుకు ప్రత్యేకబృందాలను ఏర్పాటుచేసి కఠినంగా తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇసుకలభ్యతపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ, ఇసుకరవాణ జరిగితేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని, వారిమీద అక్రమమైనింగ్‌యాక్ట్‌కింద , గవర్నమెంట్ ప్రాపర్టీతేఫ్ట్, గవర్నమెంట్ ప్రాపర్టీధ్వంసం కింద కేసులు నమోదుచేసి వారియొక్క జెసిబిలను, ట్రాక్టర్లను సీజ్‌చేసివారిపై కేసులు నమోదుచేసి జైలుకు పంపిస్తామని తెలిపారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇసుకను ఆన్‌లైన్ ద్వారా పొందే విధానాన్ని మరింత మెరుగుపర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ఈచర్యలవల్ల ప్రజలకు అవినీతిరహితంగా, సరళంగా ఇసుక అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్‌వెంట డిఎస్‌పి శ్రీనివాసులు, ఉప్పునుంతల తహసీల్దార్ ప్రమీల, ఆర్ఐ సుజాత, రెవెన్యూ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## పదవ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా కృషి

### విద్యాశాఖ అధికారికి కలెక్టర్ ఆదేశం

ప్రజాపక్షం / నారాయణపేట: దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం శ్రీ కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ అధికారులతో మాట్లాడు తూ పీఎం శ్రీ కార్యక్రమం లో అమలుపరుస్తున్న పనుల గురించి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొదటి విడతగా 12 పాఠశాలలు రెండో విడతగా ఏడు పాఠశాలలు ఎంపిక అయ్యాయని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలని తెలియజేశారు. ఎక్కడ కూడా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా పిఎం శ్రీ ఎంపికైన పాఠశాలలో కార్యక్రమం అమలు తీరుని జిల్లా విద్యాశాఖ అధికారి గోవింద రాజు ద్వారా అడిగి తెలుసుకున్నారు. పిఎం శ్రీ లో వచ్చిన నిధులను సక్రమం గా వినియోగించుకోవాలని ఆదేశించారు. సంబంధిత పాఠశాలల ద్వారా ఈ కార్యక్రమానికి సంబంధించి పూర్తి వివరాలను డాక్యుమెంట్ రూపంలో తయారు చేసి రాష్ట్రానికి పంపించే విధంగా చూడమన్నారు. అదేవిధంగా నిన్న జరిగిన పదవ తరగతి సమీక్ష సమావేశంలో ఉపాధ్యాయుల పనితీరుపై ఆసహనం వ్యక్తపర్చారు. వచ్చే నెలలో పదవ తరగతి పరీక్షలు జరగబోతున్నాయని అందుకు ప్రతి సబ్జెక్ట్ టీచర్ తమవంతుగా కృషి చేస్తూ ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించ విధంగా కృషి చేయాలని విద్యాశాఖ అధికారికి ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎం. గోవిందరాజులు , ఎఫ్ఏఓ చారి, జిల్లా విద్యా శాఖ సెక్టోరల్ అధికారులు విద్యాసాగర్ , శ్రీనివాస్ రాజేంద్రకుమార్ , నాగార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ

ప్రజాపక్షం / వీపనగండ్ల : వనపర్తి జిల్లా స్థాయిలో జరిగిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ లో వీపనగండ్ల జిల్లా పరిషత్ బాలుర పాఠశాల చెందిన విద్యార్థి ద్వితీయ స్థానంలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాను ప్రకా శ్ , ఫిజికల్ సైన్స్ టీచర్ మహేష్ తెలిపారు. ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాలలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ లో వీపనగండ్ల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు చెందిన పి. మనోజ్ అనే విద్యార్థి పాల్గొని 40 మార్కులకు 32 మార్కులు పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. ఎంపికైన విద్యార్థికి జిల్లా ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ చంద్రశేఖర్ , అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహనంది చేతుల మీదుగా ప్రైజ్ మని ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి మనోజ్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాను ప్రకాశ్ , ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు మహేష్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబర్చి పాఠశాలకు గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




## పెబ్బేరు పుర అభివృద్ధికి సహకరించండి

ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు పట్టణ నూతన మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి ప్రస్తుతం పెబ్బేరు మున్సిపాల్టీ పరిధిలో నెలకొన్న ప లు సమస్యలపైన వారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు పట్టణ మాజీ మున్సిపల్ , మాజీ వైస్ చైర్మన్ కర్రె స్వామి, మాజీ కౌన్సిలర్లు పార్వతి, మహేందర్ గౌడ్ , గోపిబాబు, బిఆర్ఎస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ దిలీప్ రెడ్డి, యువనాయకులు ఎద్దుల సాయినాథ్ , మంగరాయి మణ్యం, సిద్ధి రాములు, వసంత్ రావు, వేణు, విరేష్ తదితరులు పాల్గొన్నారు.





## అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాపక్షం/నారాయణపేట: నారాయణపేట జిఇల్లా పరిధిలో ఇసుకసురూలపై కఠినంగా వ్యవహరించాలని, కేసులు నమోదుచేసి కట్టుదిట్టం చేయాలని జిల్లా అధికారులకు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశించారు. జిల్లా పరిధిలో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ యోగేష్ గౌతమ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా, నిరోధించేందుకు ప్రజలు డయల్ 100కు కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. జిల్లాలో ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్ లు, స్టాక్ పాయింట్ల వద్ద భద్రత చర్యలు చేపట్టనున్నట్లు సూచించారు. పోలీసు వారి సూచనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి పొందిన వారికి మాత్రమే రాష్ట్రంలో ఇసుక రలించేందుకు ,విక్రయించేందుకు అనుమతి ఉంద న్నారు. ఇతరులు ఎవరైనా తాము ఇసుక సబ్ కాంట్రాక్టర్స్ అని ఇతర పేర్లతో ఎటువంటి లావాదేవీలు జరిపినా అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

# మహిళ

ఫోకస్

## మాటలకు.. చేష్టలకు పొంతన ఎక్కడ?

ప్రభుత్వాల మాటలకు, చేష్టలకూ ఎక్కడా పొంతన ఉండదని అనేక సందర్భాల్లో స్పష్టమైంది. ప్రపంచంలోనే అత్యధిక ఆదాయ వనరులున్న భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బిసిసిఐ) స్థానిక క్రికెటర్లకు కూడా కోట్ల రూపాయల్లో కాంట్రాక్టు సొమ్ము చెల్లిస్తున్నది. మాజీ క్రికెటర్లకు వివిధ రూపాల్లో భారీ మొత్తాలను అందిస్తున్నది. బాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ వంటి ఇతర క్రీడలకు అంతటి ఆదరణగానీ, సాయంగానీ లేదన్నది చేదు నిజం. ఇక మహిళల విషయంలో వివక్షకు అంతేలేదు. తాజా బడ్జెట్‌లో క్రీడలకు రూ. 350 కోట్ల మేర కేటాయింపులు పెరిగింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఘనంగా ప్రకటించారు కూడా. కానీ, క్రికెట్ మినహా ఇతర క్రీడలకు, ప్రత్యేకించి మహిళలకు



సరైన ప్రోత్సాహం లేదని చెప్పడానికి రష్మితా పాత్ర ఉదంతాన్ని మించిన రుజువు మరొకటి ఉండదు. అట్టడుగు స్థాయిలో క్రీడాకారులు గుర్తించి, ప్రోత్సహించడానికి చేపట్టిన 'ఖేలో ఇండియా' కార్యక్రమం కింద వివిధ పథకాలను చేపడుతున్నామని, అందుకే, 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో క్రీడలకు రూ.1,000 కోట్లు కేటాయించామని ఆమె వివరించారు. వచ్చే ఏడాదిలో ఒలింపిక్స్, కామన్వెల్త్ లేదా ఆసియా క్రీడల వంటి ప్రధాన క్రీడా ఈవెంట్లు ఏవీ లేకపోవడంతో ఈ పెరుగుదల చాలా ఎక్కువని పేర్కొన్నారు. మరి రష్మిత వంటి ఒకప్పటి క్రీడాకారిణులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎక్కడా ప్రస్తావించలేదు. వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఒకప్పుడు భారతదేశంలో మహిళల ఫుట్‌బాల్‌కు గర్వకారణంగా నిలిచిన రష్మిత పాన్‌లు అమ్ముతున్న వైనం అప్పట్లో దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కానీ, ఆమెకు ఊరట లభించలేదు. 12వ ఏట నుంచి రష్మిత ఫుట్‌బాల్ ఆడింది. అసాధారణ ప్రతిభాపాటవాలు ప్రదర్శించింది. 2008లో అండర్–16 మహిళల క్వాలిఫైయర్ కోసం ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఎఎఫ్‌సి) టోర్నీలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. ఆమె అద్భుత ప్రదర్శనలు ఒడిశాకు లాభించాయి. 2010లో అండర్–19 జాతీయ మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఒడిశాను విజేతగా నిలిపింది. ఆ సమయంలో రష్మిత పేరు మారుమోగిపోయింది. ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అంతా జోస్యం చెప్పారు. కానీ, వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. సరైన ప్రోత్సాహం, గుర్తింపు లేని కారణంగా ఆమె కెరీర్ ఆశించిన రీతిలో ముందుకు సాగలేదు. ఆర్థికంగా అంతంత మాత్రమే కావడంతో, ఫుట్‌బాల్‌ను కొనసాగించలేకపోయింది. పెళ్లి తర్వాత ఆమె కష్టాలు పెరిగాయే తప్ప తగ్గలేదు. భర్తకు నిలకడైన ఉద్యోగం లేదు. ఆదాయం లేదు. అందుకే ఆమె పాన్‌లు అమ్మడం మొదలుపెట్టింది. అంతర్జాతీయ వేదికలపై మెరవాల్సిన ఒక అద్భుత ఫుట్‌బాల్ క్రీడాకారిణి చివరికి బతుకు తెరువు కోసం పాన్ దుకాణంతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ఇలాంటి వారికి సాయం అందించే పథకం ఏదైనా తీసుకురావడం అత్యవసరం. ఈ దిశగా ప్రభుత్వాలు, క్రీడా సంఘాలు, సమాఖ్యలు ఆలోచించాలి. లేకపోతే, దేశంలో మహిళలు క్రీడల పట్ల ఆసక్తి చూపే అవకాశం ఉండదు.

## ఆధునిక రష్యన్ బ్యాలెట్ మార్గదర్శకురాలు పావ్లోవా

ఫిబ్రవరి 12న జయంతి




ప్రతిష్ఠాత్మకమైన 'రష్యన్ బాలేరినా' పురస్కారం పొందిన 20వ శతాబ్దపు నృత్యకారిణి అన్నా పావ్లోవా. 1881 ఫిబ్రవరి 12న జన్మించిన పావ్లోవాను ధునిక రష్యన్ బ్యాలెట్ నృత్య మార్గదర్శకురాలిగా పేర్కొంటారు. మైఖేల్ ఫోకిన్ ఆమె కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'ది డైయింగ్ స్వాన్'లో టైటిల్ రోల్ పోషించి, ప్రపంచ వ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు సంపాదించింది. భారత్, ఆస్ట్రేలియా, అమెరికా తదితర దేశాల్లో ఎక్కువ ప్రదర్శనలిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి, రష్యన్ బ్యాలెట్‌ను ప్రపంచ ఖ్యాతిని ఆర్జించిపెట్టింది. నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో పర్యటిస్తున్న సమయంలో, 1931 జనవరి 23న, తన 49వ ఏట తుదిశ్వాస విడిచిన పావ్లోవా జీవితం మొత్తం నృత్య ప్రదర్శనలకు, నృత్య దర్శకత్వానికి అంకితమైంది. చిన్న వయస్సులోనే తన బ్యాలెట్ శిక్షణను ప్రారంభించిన పావ్లోవా, పదేళ్ల వయసులో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఇంపీరియల్ బ్యాలెట్ స్కూల్‌లో చేరింది. 1899లో పట్టభద్రురాలైంది. అనంతరం అక్కడి బ్యాలెట్‌లో చేరి, తన ప్రతిభాపాటవాలతో కీలక సభ్యురాలిగా ఎదిగింది. ఆమె ప్రతిభ, కళాత్మకత ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకర్షించాయి. ఆమె వ్యక్తీకరణ ప్రదర్శనలు, మనోహరమైన కదలికలు, వేదికపై అద్భుతమైన నాణ్యతకు ప్రసిద్ధి చెందాయి. పావ్లోవా కచేరీలలో శాస్త్రీయ, సమకాలీన రచనలు ఉన్నాయి. ఆమె తన కాలంలోని గుర్తింపు పొందిన కొరియోగ్రాఫర్‌లతో కలిసి పనిచేసింది. 1909లో, పావ్లోవా ఇంపీరియల్ బ్యాలెట్‌ను విడిచిపెట్టి, 'పావ్లోవా కంపెనీ' పేరుతో తన సొంత కంపెనీని ఏర్పాటు చేసింది. విస్తృతమైన అంతర్జాతీయ పర్యటనలను ప్రారంభించింది. రష్యన్ బ్యాలెట్ గురించి తెలియని దేశాల్లోనూ ప్రదర్శనలిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా రష్యన్ బ్యాలెట్‌కు ఒక అద్భుత కళారూపంగా గుర్తింపు రావడానికి ఆమె పర్యటనలు కీలక పాత్ర పోషించాయి. బ్యాలెట్ డ్యాన్సర్‌గా ఆమె వారసత్వం, కళారూపానికి ఆమె చేసిన కృషి ప్రపంచవ్యాప్తంగా నృత్యకారులు, ప్రేక్షకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.



'ది డయింగ్ స్వాన్'లో హంస గురించి పావ్లోవా వివరణ, ఆమె సున్నితమైన, భావోద్వేగ కదలికలతో, బ్యాలెట్‌కి కొత్త స్థాయి వ్యక్తీకరణ సొబగులు అద్దింది. ఆ బ్యాలెట్‌లో వేదికపై హంస తప్ప పావ్లోవా కనిపించదు. నిజంగానే ఒక హంస మరణవేదనను అనుభవిస్తున్నదని ప్రేక్షకుల హృదయాలు బరువెక్కుతాయి. బ్యాలెట్ చూస్తున్న ప్రతి ఒక్కరి కళ్లూ చెమర్చడమే అందుకు ఉదాహరణ. రష్యన్ బ్యాలెట్‌ని కొత్త శిఖరాలకు చేర్చి, ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన మార్గదర్శకురాలు పావ్లోవా.

## వేళ్లలో తేడా..




మహిళలు, పురుషుల చేతి వేళ్లను పరీక్షిస్తే, ఒక కీలక విషయాన్ని గుర్తించవచ్చు. మహిళల చేతిలో మధ్యవేలు తర్వాత, బొటనవేలి పక్కన ఉండే చూపుడు వేలు ఎక్కువ పొడవుగా ఉంటుంది. పురుషుల్లో మాత్రం చిటికెన వేలు పక్కన ఉండే ఉంగరపు వేలు పొడవుగా కనిపిస్తుంది. గమనించండి.

## రోగ నిరోధక శక్తి మహిళల్లో ఎక్కువ!



పురుషులు చాలా బలవంతులని, వారు చాలా తక్కువగా వ్యాధులకు గురవుతారనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. కానీ, ఇది ఒక అపోహ మాత్రమే. నిజానికి పురుషుల కంటే మహిళల్లోనే బలమైన రోగనిరోధక శక్తి ఉంటుంది. వారిలో రెండు 'ఎక్స్' క్రోమోజోమ్‌లు ఉండడమే అందుకు కారణం. ఇది వాటిని ఇన్ఫెక్షన్లు, వ్యాధులతో పోరాడడంలో మెరుగ్గా ఉంచుతుంది. అలాగే అనారోగ్యాల నుండి త్వరగా కోలుకోవడానికి వీలు కల్పిస్తుంది. పురుషులతో పోలిస్తే స్త్రీలలో శరీర కొవ్వు శాతం కూడా ఎక్కువ. ఇది ప్రతికూలతగా అనిపించినప్పటికీ, ఇది వాస్తవానికి కొన్ని పరిస్థితుల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. బెల్జియంలోని ఘెంట్ విశ్వవిద్యాలయ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం ప్రకారం, మైక్రోఆర్ఎన్ఎ అని పిలిచే జన్యు పదార్థాల కారణంగా మహిళలకు మెరుగైన రోగనిరోధక శక్తి దక్కుతుంది. ఎక్స్ క్రోమోజోమ్‌లో మాత్రమే ఉన్న మైక్రోఆర్ఎన్ఎ, మహిళలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడటానికి కొన్ని జన్యువులను ఆపివేస్తుంది.

## మహిళలు సుకుమారులు!

మహిళలు అబలలుకాదు... సబలలు అనే నినాదం తరచు వినిపిస్తూ ఉంటుంది. నిజానికి దీనిని మానసిక దృఢత్వానికి సంబంధించినదిగా తీసుకోవాలి. ఎందుకంటే మహిళలు సుకుమారులు. ఈ విషయం ఎవరో చెప్పడం కాదు... అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పురుషులు అంగారక గ్రహం నుండి రాలేదు. స్త్రీలు శుక్ర గ్రహం నుండి రాలేదు. వారు ఒకే గ్రహం నుండి వచ్చిన ఒకే జాతికి చెందినవారు. కానీ, కొన్ని జీవసంబంధమైన విధులను నిర్వరించే అంశాలు వారిని వేరు చేస్తాయి. మహిళలు సుకుమారులు అనడానికి కారణం లేకపోలేదు. మహిళలతో పోలిస్తే పురుషుల్లో చర్మం 25 శాతం మందంగా ఉంటుంది. వారిలో కొల్లాజెన్ అనే ప్రొటీన్ సాంద్రత కూడా ఎక్కువే. సాధారణంగా పురుషులకు స్త్రీల కంటే బలమైన ఎముకలు ఉంటాయి. 14 నుండి 51 సంవత్సరాల వయస్సు వరకు, పురుషుల కంటే స్త్రీలకు ఎక్కువ ఐరన్ అవసరం . ఇది సాధారణంగా 28 నుండి 40 రోజుల చక్రంలో జరిగే ఋతుస్రావం సమయంలో వారి రక్త నష్టం కారణంగా ఉంటుంది. సగటున, పురుషులు సాధారణంగా మహిళల కంటే ఎక్కువ కండర ద్రవ్యరాశిని కలిగి ఉంటారు. ఆ అస్థిపంజర కండరాలు వేగంగా, శక్తివంతంగా ఉంటాయి. అంతమాత్రం చేత మహిళలను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఎందుకంటే, మహిళల కండరాలు అలసటను సులభంగా తట్టుకుంటాయి. అంతేగాదు, నొప్పి లేదా ఇతరత్రా పీడల నుంచి త్వరగా కోలుకుంటాయి.

(photo skin)



## వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తే పతనం తప్పదు

### మిర్చి రైతును ఆదుకోకుంటే ఆందోళన : బాగం హెచ్చరిక

**ప్రజాపక్షం/ఖమ్మం :** మిర్చి బోర్డును ఏర్పాటు చేసి మిర్చి ధరను స్థిరీకరించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తుల ధరలను స్థిరీకరించకపోవడం వల్లే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మిర్చి ధరలు పతనమై రైతులు తీవ్ర ఆవేదనకు, ఆందోళనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయని తద్వారా వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతుందని ఆయన తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు రైతు వద్ద ఉన్నప్పుడు ఒక ధర రైతు చేయి దాటగానే వ్యవసాయ ఉత్పత్తులకు ఎలా రెక్కలు వస్తున్నాయని హేమంతరావు ప్రశ్నించారు. రైతు వద్ద ఉన్నప్పుడు లేని ధర రైతు చేయి మారగానే ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. మిర్చి ధరకు సంబంధించి తక్షణం మిర్చి బోర్డును ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని లేని పక్షంలో ఆం దోళన చే పడతామని ఆయన హెచ్చరించారు. రైతాంగాన్ని విస్మరించిన ఏ ప్రభుత్వం మ నుగడ సాగించలేదని, రైతులను విస్మరిస్తే పతనం తప్పదని హేమంతరావు హె చ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్చి ధర కోసం త్వరలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని ఈ సందర్భంగా హేమంతరావు తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందుల్లో రిటైర్డ్ ఉద్యోగులు

### ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిలో 2021 జూలై 1 నుంచి పదవి విరమణ చేసిన ఉద్యోగుల యొక్క సవరించిన పెన్షన్‌ను వెంటనే చెల్లించాలని, అదేవిధంగా పెన్షన్ ఏరియర్స్ బకాయిలు కూడా చెల్లించాలని, జనవరి నుంచి నిలిపి వేసిన పెన్షన్లు వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి గుర్తింపు సంఘం) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని సిఎంపిఎఫ్ కార్యాలయంలో కమిషనర్ పచౌరితో మాట్లాడి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఈ నెలలో బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సిన రెగ్యులర్ పెన్షన్‌ను జీవన్ ప్రమాణ్ పత్రాలు ఆన్‌లైన్‌లో ఇచ్చినప్పటికిని ఎందుకు జమ చేయలేదని ఆయన కమిషనర్‌ను ప్రశ్నించారు. పెన్షన్లు జమ చేయక పోవడం వల్ల చాలా మంది రిటైర్డ్ ఉద్యోగులు అనేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని ఆయన తెలిపారు, వెంటనే నిలిపి వేసిన రెగ్యులర్ పెన్షన్లు రిటైర్డ్ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, అదే విధంగా పదకొండవ వేజ్ బోర్డులో దాదాపు వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగుల సవరణ పెన్షన్‌ను వెంటనే చెల్లించాలని, పెరిగిన సవరణ పెన్షన్ ఏరియర్స్ కూడా చెల్లించాలని ఆయన కమిషనర్‌ను డిమాండ్ చేశారు, రిటైర్డ్ ఉద్యోగులకు రివైజ్డ్ పెన్షన్ ఫేమెంట్ ఆర్డర్ కాఫీలు రాక చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారని, భర్త చనిపోతే భార్యకు వితంతు పెన్షన్ పొందేందుకు రివైజ్డ్ పిపిఓ కాఫీ లేక పోవడం వల్ల వితంతు పెన్షన్ దారులు ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి వెంటనే రివైజ్డ్ పెన్షన్ ఫేమెంట్ ఆర్డర్ కాఫీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దన్ బాద్ లోని సి.ఎం.పి.ఎఫ్ కమీషనర్‌కు లేఖను పంపుతామని, ఫిబ్రవరిలో రిటైర్డ్ ఉద్యోగుల పదకొండవ వేజ్ బోర్డు పెన్షన్ బకాయిలు చెల్లించాలని లేకుంటే ఎఐటియుసి ఆధ్వర్యంలో గోదావరిఖని సిఎంపి ఎఫ్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐటియుసి శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ & ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం పేర్కొన్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో యేసు రత్నం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు సమస్యలు పరిష్కారం కాక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్‌ను డిమాండ్ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ముఖ్యం గా కార్పొరేషన్ పరిధిలో జిఒ 60 ప్రకారము బిల్ కలెక్టర్ & కంప్యూటర్ ఆపరేటర్లకు రూ 19,500/, రూ 22,750/లు ఇవ్వాలని ప్రభు త్వం ఇచ్చిన ప్రకారము జీతాలు చెల్లించే విధం గా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా వారికి కనీస వేతనం రూ.26,000/లుగా చెల్లించుటకు మీ ద్వారా ప్రభుత్వానికి తెలియపర్చాలని, అలా గే కార్మికులకు పిఎఫ్ జమ చేయడం లేదని , కనుక వెంటనే అమలు చేయాలని, డ్రైవర్లకు, బిల్ కలెక్టర్లకు, పంప్ ఆపరేటర్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు జిఒ 60 ప్రకారము టెక్నికల్ వేతనాలు చె ల్లించాలని, వారికి సబ్బులు, నూనెలు, బట్టలు, టవల్స్, గ్లౌజులు, రెయిన్ కోట్‌లు తదితర సా మాగ్రిని ఇవ్వాలని, అలాగే పారిశుద్ధ్య కార్మికులందరికి జి.ఓ. ప్రకారము రావలసిన సంవత్సరానికి 15 రోజుల లీవులు అమలు చేయాలని, ఎన్నికల సమయంలో పని చేసిన కార్మికులందరికి ఎ న్నికల డబ్బులను ఇప్పించాలని ఎఐటియుసి డిమాండ్ చేస్తోందని ఆయన అన్నారు.అదేవిధంగా ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. గౌస్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికుల, ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు, లేనిచో ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు లింగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు అబ్బాస్ బీ


### ఈ తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం :గోదా శ్రీరాములు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)/భువనగిరిరూరల్:** మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ అబ్బా స్ బి (106) ఇటీవల మృతి చెందారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతి వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ అప్పటి నిజాం నిరంకుశత్వం తెలంగాణ ప్రాంతంలో అనేకమంది సాయుధులై భూస్వామ్యం పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాటం చేశారని అన్నారు. అబ్బాస్ బీ లాంటి వారి త్యాగాలు పోరాటాలు ఈనాటి యువతరానికి స్ఫూర్తిదాయకం ఆదర్శంగా తీసుకోవాలని, ఈ సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అ న్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ము త్యాలు, ఏశాల అశోక్, మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, మండల నాయకులు సోమనబోయిన నరసింహ, కుటుంబ సభ్యులు ఉస్మాన్, తాహెర్ పాష, మనువల్లు ఖాజా మైనుద్దీన్, నయీమ్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.



## టోల్‌గేట్ యాజమాన్యంపై చర్యలు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ్ నాయుడు డిమాండ్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్న చిల్లేపల్లి టోల్‌గేట్ యాజమాన్యంపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ధూళిపాళ ధనుంజయ్ నాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నేరేడుచర్లకు చెందిన సిపిఐ బృందం హుజూర్‌నగర్ ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నిబంధనల ప్రకారం యాజమాన్యం వ్యవహరించాలని 20కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలను లోకల్ యూనిట్‌గా పరిగణించి వాహనదారులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, అలాగే టోల్‌గేట్‌లో పనిచేసే సిబ్బంది విషయంలో స్థానికులకే అవకాశం ఇవ్వాలనే నిబంధనలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా నిర్లజ్జగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి, ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాస్తోరోకోలు, ధర్నాలు ఇతరత్రా రూపాల్లో ఉద్యమం చేసినప్పటికీ టోల్‌గేట్ యాజమాన్యంలో ఎటువంటి ఎలాంటి చలనం లేదని, అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేసి ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలు,రాస్తారోకోలే కాకుండా అవసరమైతే నిరాహారదీక్షలకు కూడా సిద్ధమై ఉన్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్,నేరేడుచర్ల పట్టణ సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఎఐఎస్ఎఫ్ నాయకుడు కొమ్రరాజు వెంకట్, ఎఐవైఎఫ్ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు పరికె భరత్,జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆ ముసాయిదాను రద్దు చేయాలి

### రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** నూతన వ్యవసాయ మార్కెట్ విధాన ముసాయిదాను రద్దుచేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. వరంగల్‌లోని తమ్మెర భవన్ శివనగర్‌లో జిల్లా అధ్యక్షుడు బొద్దుపెల్లి సాయిలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌కెఎం ఆధ్వర్యంలో నెలలో పాటు ఢిల్లీ సరిహద్దులను మూసివేత నిరంతర పోరాటాన్ని కొనసాగించిన ఫలితం గా మోదీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయడం జరిగిందని, ఇప్పటికి ఆ మూడు చట్టాలు రైతులకు మెడమీద కత్తిలా గా వేలాడుతూనే ఉన్నాయన్నారు. రైతు పండించిన పంటకుమద్దతు ధర గ్యా రెంటీ చట్టం, రైతు రుణముక్తి, చట్టం చేయాలని, నూతన వ్యవసాయ మార్కెట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడెట్‌లోరైతులకు, కార్మికులకు, నిరుపేద ప్రజలకు నిధులు కేటాయింపు అత్యంత దారుణం ఉందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంకు కేటాయించిన నిధులు అతి తక్కువగా ఉన్నాయని, బడ్జెట్‌ను సవరించి కార్మికుల వేతనాలు పెంచడానికి గ్రామీణా ఉపాధి హామీ పథకం మద్దతు ధరలు గ్యారెంటీగా అమలుచేయడానికి రైతు రుణమాఫీ చేయడానికి వీలుగా నిధులు కేటాయించాలన్నారు. అనంతరం నూతన కాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో వరంగల్ జిల్లా కార్యదర్శులు మొగిలిచుక్క, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ పాష, కోశాధికారి ప్రభాకర్, గౌరవాధ్యక్షుడు మద్దిరాజారాం, రత్నాకర్‌రెడ్డి, కోట సారయ్య, హసీనా, శోభ, అరుణ, శిరీష, హేమలత, సౌందరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణికి నూతన డైరెక్టర్ల ఎంపిక హర్షణీయం

### నూతన డైరెక్టర్లను కలిసిన ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీతారామయ్య, రాజ్ కుమార్

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణిలో నూతన డైరెక్టర్లుగా నూతనంగా డైరెక్టర్ ఆపరేషన్‌గా ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ పిపిగా కొప్పుల వెంకటేశ్వర్లును యాజమాన్యం సిఎండి బలరాం నాయక్ నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, నూతనంగా ఎంపికైన డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కొప్పుల వెంకటే శ్వర్లు ను మంగళవారం హైదరాబాదులో సింగరేణి భవన్‌లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌లు వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణిలో డైరెక్టర్లు లేక అనేక కార్మిక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. డైరెక్టర్ల నియామకంతో సమస్యలు పరిష్కారం అవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. సింగరేణికి మంచి అనుభవం ఉన్న డైరెక్టర్లను ఎంపిక చేసినందుకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంకు హృదయ పూర్వక కృతజ్ఞతలను వాసిరెడ్డి సీతారామయ్య,కొరిమి రాజ్ కుమార్‌లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు





## కీసరగుట్ట ట్రస్ట్ సభ్యుడు శంకరయ్యకు సన్మానం



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ భవానీ శివదుర్గసమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు రాపోలు శంకరయ్య ను బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్‌లోని మాజీ కార్పోరేటర్ బోమ్మక్ కళ్యాణ్ కుమార్ ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో బోడుప్పల్ నగర ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్తా, నాయకులు రాపోలు రామస్వామి, ఐల్లయ్య, దానగళ్ళ ఏల్లమ్, మీసాల గిరి, రాపోలు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## ఆర్‌సిసిపైప్ లైన్ పనులు ప్రారంభించిన కార్పొరేటర్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** డివిజన్‌లోని అన్ని బస్తీలను ఒక్కటొక్కటిగా అభివృద్ధి చేస్తున్నానని, మరే ఇతర సమస్యలనైనా తనకు తెలియచేయాలని మౌలాలి కా ర్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని నెహూనగర్ ప్రాంతంలో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టిన ఆర్‌సిసి పైప్ లైన్ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సుధాకర్, గోవిందమ్మ, సాధ న, దినేష్, సంగం మహేష్, శిరీష్, సుజాత, ఎల్లం, వెంకటేష్, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు వేగవంతం చేయాలని మంత్రి కోమటిరెడ్డికి వినతి



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మల్లంపేట ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నుండి బాచుపల్లి వరకు వెళ్లే రోడ్డు ను హెచ్‌ఎండిఎ వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ సమన్వయం లోపంతో నిధులు లేక రోడ్డును పూర్తి చేయనందున స్థానిక ప్రజలు ఇబ్బందులను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా మంగళవారం రోడ్డు భవనాల, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్డు సమస్య ఉందని మంత్రికి విన్నవించగా వెంటనే సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

## చెరువుల పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** చెరువులను పరిరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్‌లోని తుర్కచెరువు, శ్రీరామ కుంట చెరువులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెరువుల పరిరక్షణతో చుట్టు ప్రక్కల కాలనీలు, బస్తీలు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. పదేళ్ల కాలంలో మిషన్ కాకతీయ పథకం కింద నియోజకవర్గంలోని అనేక చెరువులను అభివృద్ధి పరిచామని వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గం పరిధిలోని అన్ని చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగకరమైన విధంగా తీర్చిదిద్దుతామన్నారు. స్థానికంగా గల హనుమాన్ దేవాలయంలో ఆంజనేయ స్వామి, కనకాల మేడలమ్మ అమ్మవారి దేవాలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబెర్ అలీ, మేనేజర్ జయరాజ్, పవన్, ఎఇ ప్రవీన్, నాయకులు దన్‌రాజ్, నరసింహారెడ్డి, చందు ముదిరాజ్, సుజాత, దూసకంటి వెంకటేశ్ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్‌లో ప్రభుత్వ స్థలంలో వెలసిన పలు అక్రమ నిర్మాణాలను మండల రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మంగళవారం బాచుపల్లి మండల తహశీల్దార్ పూల్‌సింగ్ ఆధ్వర్యంలో బాచుపల్లి పోలీస్ బందోబస్తుతో రెవెన్యూ సిబ్బందితో కలిసి జేసీబీ సహాయంతో నిజాంపేట్‌లోని సర్వేనంబరు 334లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన పలు అక్రమ భవనాలను నేలమట్టం చేశారు. ఎనిమిది గదులతో పాటు ఓ షెడ్డుని, బేస్ మెట్‌లను కూల్చివేశారు. గణపతి మండపాన్ని తొలగించేందుకు వెళ్లగా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో స్థానికంగా కొంతమేర ఉద్రిక్తత నెలకొంది.

## అభివృద్ధిలో దూసుకుపోతున్న 13వ డివిజన్



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** డివిజన్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి అన్నారు. మంగళవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్‌లో రాజీవ్ నగర్ కాలనీలో 12 లక్షలతో సీసీ పనులకు మాజీ కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి, కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి మాట్లాడుతూ, 13వ డివిజన్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని, పనులను త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని, అదే విధంగా డివిజన్‌లో అన్ని కాలనీలలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు కూడా అతి త్వరలో పూర్తి చేస్తామని, 13వ డివిజన అభివృద్ధికి సహకరించిన పాలకవర్గ సభ్యులకు డివిజన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దానగళ్ళ యాదగిరి, డివిజన్ అధ్యక్షుడు గోపు రాము, నానాజీ, గడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాలపై పోలీసులు అప్రమత్తం



**ప్రజాపక్షం/పరిగి :** పరిగి మండలం పరిధిలోని నరసయ్యగూడా గ్రామంలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంను పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరిగి సిఐ శ్రీనివాస్ రెడ్డి హజరై మాట్లాడుతూ సమాజంలో జరిగే దొంగతనాలపై అప్రమత్తంగా వుండాలని తెలియజేశారు. గ్రామలపై కూడా దొంగల ముఠాలు టార్గెట్ చేస్తున్నాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో సాధ్యమైనంత వరకు కలిసికట్టుగా గ్రామ పెద్దలు కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు , చేసుకోవలని సూచించారు. ఉద్యోగలను టార్గెట్ చూస్తు స్మార్ట్ ఫోన్ వాడే వారిపై నిఘా పెట్టి ఒటిపిల పేరుతో లింకుల పేరుతో లక్షల డబ్బులు వసూలు చేసి బ్లాక్ మెయిల్ చేసి ఇబ్బందులకు గురిచేస్తారని వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగవర్ధన్ ,పులిందర్‌రెడ్డి , గ్రామస్తులు మహిళలలు తదితరులు పాల్గోన్నారు.

## కార్మికుల జీతాలు చెల్లించకపోతే 19న...

# టివివిపి కమిషనర్ ఆఫీస్ ముట్టడి

### టివివిపి కమిషనర్‌కు ఎఐటియుసి నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏడు నెలలుగా జీతాలు లేకుండా తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) పరిధిలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి.యూసుఫ్, ఎం.నరసింహ డిమాండ్ చేశారు. కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించనట్లయితే ఈ నెల 19న టివివిపి కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఎఐటియుసి ప్రతినిధి బృందం టివివిపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను కలిసి లేఖ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ టివివిపి పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ఏడు నెలల నుంచి జీతాలు లేవని, ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి గత నెల 21న తీసుకువచ్చినా ఫలితంలేకపోయిందన్నారు. దీంతో కార్మికులు టివివిపి ఆసుపత్రుల్లో ప్రతిరోజు ఒక గంట నిరసన



ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినటుగా వ్యవహరిస్తున్నారని, కార్మికుల జీతాలు చెల్లించడంలో అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం, కాంట్రాక్టర్లు ఎవరికి వారే అన్న తీరుగా వ్యవహరిస్తూన్నారని వారు దుయ్యబట్టారు. పేద కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో వారు ఏ విధంగా విధులకు హాజరవుతారని తమ కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి అద్దెలతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్న వారి బాధను పట్టించుకునే నాధుడే లేకుండా ఉన్నారని వారు అన్నారు. కార్మికులను చిన్నచిన్న తప్పులకే తొలగిస్తున్న కాంట్రాక్టర్లు నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే కార్మికులు ఏ విధంగా ఉద్యోగాలు చేయాలో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో ప్రతి ఆరు నెలలకు ఒకసారి కార్మికులు జీతాలకై పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే దీనిని సవరించి కార్మికులకు ప్రతినెల జీతం, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటరాజ్యం, తుల సి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్తు సరఫరా నిలిచిపోనున్నట్టు సిబిడి సి–2 ఎడిఇ జి.నాగేశ్వర్‌రావు తెలిపారు. విద్యుత్తు లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల నరికివేత, గాలిపటాల తొలగింపు, పలు మరమ్మతుల కారణంగా నారాయణగూడ వాటర్ వర్క్స్, శాంతి థియేటర్, విఠల్‌వాడి, తెలంగాణ టూరిజం, తెలుగు అకాడమీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగనున్నదని పేర్కొన్నారు. గౌరమ్మగల్లి, సాయిబాబా కమాన్, సుందరయ్య పార్క్, రెడ్డి కాలేజీ, హెచ్‌ఆర్‌డి డిగ్రీ కళాశాల, దుర్గా మెస్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఎంఆర్‌ఓ కార్యాలయం, 10 టివి సబ్బు కర్మాగారం, ఆర్‌టిసి కళ్యాణమండపం, రాజేంద్ర ఆయిల్ మిల్లు, అచ్చయ్యనగర్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు రాదని వివరించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

## విద్యుత్ బస్సులతో ఆర్‌టిసి ఉద్యోగులకు ఆందోళన వద్దు

### ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్న గౌడ్




**ప్రజాపక్షం/ హైదరాబాద్:** విద్యుత్ బస్సులతో టిజిఎస్ ఆర్‌టిసి ఉద్యోగుల భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదని ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్నగౌడ్ తెలిపారు. బస్సుల నిర్వహణ ప్రైవేట్ కు అప్పగించకుండా ఆర్‌టిసినే చేపట్టాలనే విజ్ఞప్తిపై సిఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్ నారాయణగూడలోని ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు బస్సులను ఆర్‌టిసి కాకుండా ప్రైవేటు సంస్థలు నిర్వహించాలన్న కేంద్రం దుర్మార్గపు విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో అమలు చేయబోదని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రత, భవిష్యత్తు దృష్ట్యా ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి ప్రభుత్వంతో చర్చిస్తున్నారని పేర్కొన్నారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.మహమూద్ సమావేశంలో ఆర్.డి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు జి. అబ్రహం, డి.గోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి జె. మల్లేష్, కార్యదర్శి ఎస్. సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసిల అణచివేతను నిరసిస్తూ మార్చి 9న బిసి కులగణన రణభేరి

### లక్షలాది మంది తరలిరావాలంటూ జాజుల పిలుపు




**ప్రజాపక్షం/ ఖైరతాబాద్:** బిసిల రాజకీయ అణచివేతకు నిరసనగా, డెడికేటెడ్ కమిషన్, బిసి కులగణన సర్వే నివేదికలను వ్యతిరేకిస్తూ మార్చి 9న లక్షలాది మందితో 'బిసి కులగణన రణభేరి' పేరిట చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చేలా పార్టీలకతీతంగా బిసిలంతా ఈ రణభేరికి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బిసి కులగణన సర్వే, డెడికేటెడ్ కమిషన్‌తో బిసిలను దగా చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని మండిపడ్డారు. 2019 స్థానిక సంస్థల ఎన్నికల తరహాలోనే ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లు కేటాయించి, మిగిలిన స్థానాలను బిసిలకు ఇవ్వాలని డెడికేటెడ్ కమిషన్ తన నివేదికలో పేర్కొనడం అన్యాయమన్నారు. కమిషన్‌తో బిసిలకు ఏ రాజకీయ భవిష్యత్తు చేకూరదని పేర్కొన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి, బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో బిసిలు తాడోపేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వచ్చే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో బిసి అభ్యర్థులైన పూల రవీందర్, ప్రసన్న హరికృష్ణ, కొమురయ్యలను భారీ మెజార్టీతో గెలిపించాలని శ్రీనివాస్‌గౌడ్ బిసిలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు మణి మంజిర, హైదరాబాద్ అధ్యక్షులు రాజేశ్, నేతలు శ్యామ్, దేవిక తదితరులు పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ' నమూనా గృహానికి శంకుస్థాపన

### అర్హులైన ప్రతి పేదవారికి మంజూరు : స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి/కోట్‌పల్లి :** వికారాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయ అవరణలో ఇందిరమ్మ ఇల్లు నామూనా గృహనికి శాసనసభా స్పీకర్ ప్రసాద్‌కుమార్ పూజచేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాల మేరకు ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇంటి నిర్మాణం చేసుకునేందుకు పనులు మొదలు పెట్టడం జరిగిందన్నారు. ముందుగా రాష్టంలోని అతి నిరుపేదలైన ప్రజలకు మొదటి విడుతగా ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇండ్ల నిర్మాణంలో ప్రాధాన్యత క్రమంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అవకాశాన్ని కల్పించడం జరుగుతుందని అయన తెలిపారు. ప్రభుత్వం తీసుకున్నా మంచి నిర్ణయానికి ప్రతి ఒక్కరు తోడ్పాటు అందిస్తూ ఇట్టి సదవకాశనికి ప్రతి ఒకరు సద్వినియోగం, చేసుకోవాలని ప్రజలకు సూచించారు. రెండో విడుతలో బండలు కలిగి ఉన్న ఇండ్లను గుర్తించి అట్టివారికి కూడా ప్రభుత్వం సహాయం చేస్తుందని తెలిపారు. ఇండ్ల కోసం ఎంపిక చేసే లబ్ధిదారుల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అర్హులైన వారిని ఎంపిక చేసి లబ్ధి చేకూరే విధంగా అధికారులు నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సభాపతి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్‌డిఒ వాసుచంద్ర , కృష్ణయ్య , తహసీల్దార్ లక్ష్మి నారాయణ ,పిఎసిఎస్ డైరెక్టర్ కిషన్‌నాయక్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గోన్నారు.

### అభివృద్ధి పనులు ప్రారంభించిన స్పీకర్


కోట్‌పల్లి మండల పరిధిలోని రూ.4కోట్ల 30లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సభాపతి ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. ఎన్‌ఆర్‌జిఎస్ క్రింద నిధులతో జిన్నరంలో రూ.25లక్షలు, కంకనాలపల్లిలో రూ.35లక్షలు, మల్‌శెట్టిపల్లి తండాలో రూ.50లక్షలతో సీసీరోడ్లు, రూ.23లక్షల 44వేల వ్యయంతో మండల ప్రాథమిక పాఠశాల భవనం నిర్మాణ , మన ఊరు మనబడి కింద మౌలిక వసతులు క ల్పించి చేపట్టిన పనులకు ప్రారంభోత్సవం చేశారు. రాంపూర్‌లో రూ.23లక్షల, కోత్తపల్లిలో రూ. 35లలు, ఎన్నారంలో రూ.40లక్ష లు ,బార్వద్ లో రూ.50లక్షలు , మద్గుల్ తాండాలో రూ.15లక్షలు ,మోత్కుపల్లి లో రూ.40లక్షలు నాగసప ల్లి తాండాలో రూ.20లక్ష లు, బిరోల్ గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లను స్పీకర్ ప్రారంభించారు. అనంతరం కోట్‌పల్లి తాహసీల్దార్ కార్యాలయంలో 116మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి సాధీ ముబారక్ చె క్కులను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్ధానాల మేరకు ఒక్కొక్కొటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అదికరి సిపిఓ అశోక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ దానియల్, ఎంఇఒ చంద్రయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింగ్‌నాయ క్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య ,జిల్లా మైనర్టీ అధ్యక్షులు హయుప్ అన్సారీ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## ఆరోగ్య పరిరక్షణకు పరిసరాల పరిశుభ్రత అవసరం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రతలో భాగంగా చెత్తను నిర్దేశించిన ప్రాంతాల్లోనే వేయటం, తమ ఇళ్లల్లోని చెత్తను తమ ఇంటికి వచ్చే స్వచ్ఛ ఆటోల వారికే ఇవ్వటం విధిగా పాటించాలని జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఉప వైద్యాధికారి (ఎఎంఒహెచ్) అన్నారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతంలోని బిజెఆర్ నగర్ ప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామంటూ హెచ్చరికలతో ఏర్పాటు చేసిన మైకులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్, సానిటరీ సూపర్‌వైజర్ శేఖరయ్యలతో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బహిరంగ ప్రాంతాల్లో చెత్తను ఎట్టి పరిస్థితుల్లో పడేయవద్దన్నారు.

## పరిసరాల పరిశుభ్రతే ప్రాధాన్యం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** పరిసరాల పరిశుభ్రత విషయంలో స్థానికులు సహకరించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. మంగళవారం డివిజన్‌లోని విద్యానగర్ కాలనీలో పరిశుభ్రతపై ఇంటింటికి అవగాహన కార్యక్రమం, పాద యాత్ర ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మరుగు దొడ్లు, మూత్ర శాలలు, షీ టాయిలెట్‌లను వినియోగించుకోవాలని, దోమలు విజృంభించకుండా బాధ్యతాయుతంగా చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఎఎంహెచ్‌ఒ డా.మంజులసానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌ఏలు బాలమణి, గోవిందమ్మ, గిరి, ఎండమాలజిస్టు వనజ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులుగా మహిపాల్ రెడ్డి , కార్యనిర్వహక అధ్యక్షులుగా పడిగళ్ల అశోక్‌ను మాజీ ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు అనంద్ నియమించారు. ఈ సమావేశంలో మండల బిఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గోని కార్యకర్తల అభిప్రాయం మేరకు మండల అధ్యక్షనిగా నయమించడం జరిగింది అని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులుగా నియమించినందుకు జిల్లా అధ్యక్షునికి ధన్యవదలు తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీకోసం పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగేందర్ గౌడ్, మాజీ బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్‌పటేల్ , మాజీ ఎంపీపీ చంద్రకళకమల్‌రెడ్డి, మాజీ సర్పంచు సంఘం అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి ,మైనార్టీ మండల పార్టీ అధ్యక్షులు గాయజ్ తదతరులు పాల్గోన్నారు.




## అవగాహనతో 'క్షయ' నివారణ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** అపోహలు లేకుండా సరైన అవగాహనతో వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా క్షయ వ్యాధిని గుర్తించగలిగితే ప్రాథమిక దశలోనే అరికట్ట వచ్చని రాష్ట్ర క్షయ వ్యాధి సంయుక్త సంచాలకులు డాక్టర్ ఏ. రాజేశం అన్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి డిఎంహెచ్‌ఒ డా.శోభారాణి అధ్యక్షతన మంగళవారం స్వస్థ నగరంపై స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి తీవ్రత, నిర్ధారణ పరీక్షలు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ చికిత్సలు, మందుల పంపిణీ సేవలను వివరించారు. వైద్యాధికారులు స్వస్థ నగరం కార్యక్రమానికి సంబంధించి పరిశోధన, అమలు, ప్రోటోకాల్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ ఇమర్షన్ అధ్యయన ఫలితాలు ప్రదర్శించి చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన అధికారి డా.శ్రీదేవి, రాష్ట్ర ప్రోగ్రాం అధికారి డా.పునీత్ దివాస్, బోడుప్పల్, ఫిర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్లు శైలజ, త్రిలేశ్వర్ రావు, క్షయ వ్యాధి నిర్మూలన వైద్యాధికారులు జ్యోతి జాజు, పృథు, అనిషా, రాజేష్, సమీర్, రాజేశ్వరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## వికారాబాద్ మెడిక్యూర్, పరిగి సాధన హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/పరిగి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న మెడిక్యూర్ ,పరిగి సాధన హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలని డిఎంఎచ్‌ఒకు అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.మహేందర్ , బి.మలేశం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మల్టీ స్పెషాలిటీ పేరుతో కొనసాగుతున్న వికారాబాద్ మెడిక్యూర్, పరిగి సాధన హాస్పిటల్స్‌లో కనీస సౌకర్యాలు లేవని ఫీజులు మాత్రం అధికంగా వసులు చేస్తున్నారని వికారాబాద్ జిల్లా అరోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఒక ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్ష రిపోర్టులు మరోక హాస్పిటల్స్‌లో చెల్లవు మళ్లీ టేస్టులు చేయించుకోవాలి, అడిగినంత ఇవ్వలి వికారాబాద్‌లోని అన్ని ప్రైవేట్ హాస్పిటల్ ఇదే తంతు కోనసాగుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసులు చేస్తున్న జిల్లా వైద్యఅధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో రాములు ,యాదయ్య నర్సింలు తదితరులు పాల్గోన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని రైలు ఢీకొని గౌస్‌పాషా (45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడిని మున్సిపల్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన షేక్‌ఖాసీం కుమారుడు గౌస్‌పాషాగా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహన్ని షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి రైల్వే స్టేషన్ మాస్టర్ రాహుల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

# మహానగరి

## గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గాయపడి చికిత్స పొందుతున్న గ్రామ పంచాయతీ కార్మికుడు మంగళవారం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల పరిధిలోని వెల్‌జర్ల గ్రామ పంచాయతీలో వాటర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న యాదయ్య మంచినీటి వాల్ తిప్పుతుండగా ఒక్కసారిగా కాలుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందితూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కార్మిక సంఘం నాయకులు ఎన్.రాజు, శ్రీనునాయక్‌లు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి దైర్యం చెప్పారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

## 'స్థానిక'లో వైశ్యుల వాటా తేల్చాలి

కాచం సత్యనారాయణ డిమాండ్




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో వైశ్యుల వాటా తేల్చాలని వైశ్య వికాస వేదిక ఫౌండర్, చైర్మన్ డా.కాచం సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని, వివిధ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైశ్యులకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని స్పష్టంచేశారు. ఎస్‌సిల తరహాలోనే ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వర్గీకరించాని, అప్పుడే అగ్ర కులాల పేదలకు సమన్యాయం దక్కుతుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు వైశ్యులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని కోరారు. వైశ్య కార్పొరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షణీయమని, ఇందుకు సిఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్‌కు వచ్చే బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో 'వైశ్య రణభేరి' నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో వేదిక కార్యదర్శి ఎన్.రమేశ్, కోశాధికారి రామ్, ప్రతినిధులు బి.ఈశ్వరయ్య, ప్రభు, దయాకర్‌రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఆదర్శవంతమైన ప్రాంతంగా గడ్డిఅన్నారం డివిజన్ తీర్చిదిద్ది మౌలిక వసతుల కల్పనకు కృషిచేశానని డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ కార్పొరేటర్‌గా బాధ్యతలు చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్పొరేటర్ ప్రేమ్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నాయకులు అభిమానులు కార్పొరేటర్‌కు శాలువాలు సన్మానం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు దాసరి ప్రకాష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, రాంరెడ్డి, బండి నిర్మల, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

## ఫార్మా రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా

మహేశ్వరం జోన్ డిసిపి సునితారెడ్డి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** ఫార్మా రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని మహేశ్వరం జోన్ డిసిపి సునితారెడ్డి రైతులకు తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎసిపి కార్యాలయం లో యాచారం మండలంలోని మేడిపల్లి నక్కర్త, నానక్ నగర్,కుర్మిద్ద , తాడిపర్తి గ్రామాలకు చెందిన ఫార్మా రైతుల అభిప్రాయ సేకరణ సమావేశానికి డిసిపి సునితారెడ్డి హాజరై మాట్లాడుతూ ఫార్మా రైతులు శాంతి యుతంగా ఆందోళన చేసుకోవాలన్నారు. ఫార్మాలో భూములు కోల్పోతున్నామనే బాధ రైతులకు సహజం కాని పరిహారం కోసం ప్రభుత్వాన్ని అడగటంలో తప్పులేదన్నారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎసిపి కేవిపి రాజు, గ్రీన్ ఫార్మా పోలీస్ స్టేషన్ సిఐ కృష్ణం రాజు, ఇబ్రహీంపట్నం, యాచారం సిఐలు జగదీశ్వర్, నర్సింహ్మా రావు, ఫార్మా రైతులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తత

ఎన్ఐసి డైరెక్టర్ డిఐఒ జి.సర్వలత



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సైబర్‌నేరాల పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని, ఇంటర్‌నెట్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలని ఎన్ఐసి డైరెక్టర్ డిఐఓ జి.సర్వలత సూచించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వలత మాట్లాడుతూ ప్రజలందరు జాగ్రత్తగా, బాధ్యతయుతంగా, ఎంతో భద్రంగా ఇంటర్‌నెట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, మాజీ ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్ళి యువకుడు మృతి

**ప్రజాపక్షం/కొత్తూరు:** చేపల వేటకు వెళ్ళిన ఓ యువకుడు మృతి చెందిన సంఘటన షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండలం జహంగీర్ ఫీర్ దర్గాలో చోటు చేసుకుంది. గిరిజనులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం జహంగీర్ దర్గా సమీపంలోని మెల్లగూడ గ్రామపంచాయతీ పరిధిలోని కాలనీ తండాకు చెందిన ఎస్.రాజుభోగ్య దర్గా సమీపంలో ఉన్న చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్ళినట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు చెరువులోకి జారి పడి గల్లంతయ్యాడని తెలిపారు. చెరువులో పడిన యువకుడి శవం వెలికి తీసేందుకు ఎంత ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయిందని, ఇదే విషయంలో స్థానిక అధికారులకు సమాచారం ఇస్తే వారు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని గిరిజనులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న గజ ఈతగాళ్ళు చెరువు వద్దకు చేరుకొని మృతుడు రాజుభోగ్యను బయటకు తీశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తూరు పోలీసులు తెలిపారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణలపై జిహెచ్‌ఎంసి కొరడా


ఫైల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫుట్‌పాత్ ఆక్రమణలపై మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) కొరడా ఝుళిపిస్తోంది. ఆపరేషన్ రోప్‌లో భాగంగా జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం ట్రాఫిక్ పోలీసులతో కలిసి గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రహదారులను ఆక్రమించి, వాహనశ్రేణి సాఫీగా సాగకుండా ట్రాఫిక్ స్తంభించేందుకు కారణమవుతున్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించేందుకు జిహెచ్‌ఎంసి ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపట్టింది. ట్రాఫిక్ స్తంభించే ప్రధాన రహదారులలో ప్రాధాన్యత క్రమంలో ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుతో రహదారుల్లో వాహన శ్రేణి సాఫీగా సాగేందుకు వీలవుతోంది. 2024 డిసెంబర్ నుంచి జనవరి వరకు జిహెచ్‌ఎంసి పరిధిలోని అన్ని సర్కిళ్లలో మొత్తం 744 ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఫుట్‌పాత్‌ల అక్రమణలు, రహదారులకు అడ్డుగా నిర్మించిన కట్టడాలను తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను ఇక నుంచి తరచుగా నిర్వహిస్తామని జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఆక్రమణ తొలగింపును పోలీసు శాఖతో కలిసి చేపడుతున్నారు.

**ఇప్పటి వరకు తొలగించిన ఆక్రమణలు**

| జోన్ | తొలగించిన ఆక్రమణలు |
|---|---|
| ఎల్.బి.నగర్ | 11 |
| చార్మినార్ | 211 |
| ఖైరతాబాద్ | 156 |
| శేరిలింగంపల్లి | 243 |
| కూకట్‌పల్లి | 42 |
| సికింద్రాబాద్ | 81 |
| మొత్తం | 744 |

## చెరువుల్లో మట్టి పోస్తే.. హైడ్రాకు సమాచారమివ్వండి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చెరువులలో మట్టి పోస్తున్న వారి సమాచారాన్ని తెలియజేయాలని హైడ్రా కోరింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఫోన్ నెంబరు 9000113667 కేటాయించింది. అలాగే చెరువులో మట్టి పోస్తున్న లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, మట్టిని సర్దుతున్న జెసిబిల వీడియోలను కూడా పంపించాలని కోరింది. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో పాటు కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు ఇలా అందరూ ఈ క్రతువులో చేతులు కలపాలని హైడ్రా విజ్ఞప్తి చేసింది.

**ఇప్పటి వరకూ 48 కేసులు..** రాత్రిపగలూ నిఘా ఉంచి నెల రోజుల్లో 31 లారీలను పట్టుకుని సంబంధిత వ్యక్తులపై హైడ్రా కేసులు నమోదు చేసింది. ఇందులో లారీ ఓనర్లతో పాటు నిర్మాణ సంస్థలకు చెందిన వారు కూడా ఉన్నారు. ఈ నిఘాను తీవ్రతరం చేసి, చెరువులను మట్టితో నింపుతున్న వాహనదారులతో పాటు మట్టి తరలించే కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థలపైనా కఠిన చర్యలు తీసుకోవాలని హైడ్రా నిర్ణయించింది.

## గ్రామ పంచాయతీల్లో వసతులు

జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్ :** గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి అన్నారు. షాబాద్ మండల పరిధిలోని ఎస్సి సబ్ ప్లాన్ కింద రూ. 55 లక్షల నిధులతో వివిధ గ్రామ పంచాయతీలో గుడిమల్కాపూర్ వైజ్ చైర్మెన్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మార్కెట్ కమిటి చైర్మెన్ పీసరి సురేందర్ రెడ్డి, గ్రామ మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, కుమ్మరి చెన్నయ్య, నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఖాజమియా, శ్రీనివాస్‌గౌడ్, జనార్ధన్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, సుబాన్ రెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన స్థలాలు కాపాడండి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** కబ్జాకు గురైన స్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని కోరుతూ స్థానిక కాలనీవాసులతో కలిసి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మంగళవారం జిల్లా రెవిన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. సుమారు రూ,18 కోట్ల స్మశాన వాటిక స్థలాని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టాలని, స్మశాన వాటికకు రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ సంగీతకి కాలనీ వాసులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల ముసుగులో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక మాజీ ప్రజా ప్రతినిధి తుర్కయంజాల్ మున్సిపాలిటీ, తుర్కయంజాల్ రెవెన్యూ కమ్మగూడ పరిధిలో సర్వే నెంబర్ 212 లో రెండు ఎకరాల స్మశాన వాటికను గత ఐదు సంవత్సరాలుగా కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని,ఇప్పటికే 34 గుంటలు కబ్జా చేసి పేదలకు అమ్ముకున్నారని, మిగిలి ఉన్న ఎ 106 గుంటల స్మశాన వాటికను కబ్జా చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. భూ కబ్జాదారులు కొంత మందిని ప్రేరేపించి గుడి పేరుతో కబ్జా చేయడానికి,రాళ్లు కట్టడం ప్రయత్నించారని, ఇట్టి విషయం తెలిసిన వెంటనే స్థానిక అబ్దుల్లాపూర్మెట్ మండలం తహసీల్దార్ సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదు చేశామని తెలిపారు. స్మశాన వాటిక ఆక్రమణపై ఫిర్యాదు చేస్తే చంపుతామని బెదిరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారని యాదయ్య పేర్కొన్నారు. స్మశాన వాటిక రక్షించడం కోసం,ప్రజల హక్కుల కోసం,ఎన్ని ఆటంకాలు వచ్చినా నిలబడతామని అయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు స్మశాన వాటిక రక్షణ కోసం, ప్రజల హక్కుల కోసం నిలబడాలని ఓరుగంటి యాదయ్య డిమాండ్ చేశారు.

## రామరాజ్యం ముసుగులో అర్చకుడిపై దాడి


సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై కొంతమంది మతోన్మాద శక్తులు దాడిచేసిన తీరును సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి ఖండించారు. మంగళవారం చిలుకూరులో రంగరాజన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామరాజ్య ముసుగులో మతోన్మాద మూకలు దాడులు చేయడం సహించరానిదన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మొయినాబాద్ మండల కార్యదర్శి కె. శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, బికెఎం యు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, నాయకులు పుల్లగల్ల మల్లేష్,వడ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.



నిందితులను కఠినంగా శిక్షించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

రామరాజ్య ముసుగులో బాలాజీ టెంపుల్‌లో ప్రధాన అర్చకుడిపై జరిగిన రౌడీ మూకల దాడిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తీవ్రంగా ఖండించారు. మంగళవారం చిలుకూరులో రంగరాజన్‌ను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ రంగరాజన్ లౌకిక, ప్రజాస్వామ్యవాది పరమత సహనం కలిగిన వ్యక్తి అని అలాంటి వ్యక్తిపై మతోన్మాదులు దాడి చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. రంగరాజన్‌ను పరామర్శించిన వారిలో డిజి నరసింహారావు, హిమబిందు, శ్రీరామ్ నాయక్, ఆశయ్య, కోట రమేష్, పగడాల యాదయ్య, కాడిగళ్ల భాస్కర్, సామెల్, జగదీష్, ప్రకాష్ కారత్, అల్లి దేవేందర్ ఉన్నారు.


## అమరుల కుటుంబాలను ఆదుకోవాలి

డాక్టర్ పిడమర్తి రవి



**ప్రజాపక్షం/గండిపేట;** సుదీర్ఘంగా సాగిన ఎస్. సి వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాది గ అమరవీరుల కుటుంబాలను, మాదిగ ఉద్యమకారులను ఆదుకోవాలని ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం శంషాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మాదిగ నాయకులు గుంటి ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పిడమర్తి రవి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిగ అమరవీరుల కుటుంబాలకు భారీగా ఉద్యమకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు 250 గజాల ఇంటి స్థలం ఇతర సంక్షేమ పథకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలకు పైన జరిగిన ఎస్‌సి వర్గీకరణ ఉద్యమం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముగింపు పలికిందని చెప్పారు. మాదిగలు అంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన వెంట ఉంటారని అయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చరిత్ర ఆత్మకమైన ఎస్‌సి వర్గీకరణ అమలు, రాష్ట్రంలో మాదిగలకు వారి వాటా దక్కే విధంగా ఉన్నదన్నారు. 9 శాతం రిజర్వేషన్ మాదిగలకు కేటాయించడానికి పూర్తిగా స్వాగతిస్తున్నామని భవిష్యత్తులో 12 శాతం రిజర్వేషన్ కోసం కార్యచరణ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, కాంగ్రెస్ నాయకు లు మహమ్మద్ నజీరుద్దీన్, శ్రీనివాస్ యాదవ్, పెద్ద గండు శ్రీధర్, భాస్కర్, రమేష్, సురేష్, భీమ్ రావు యాదవ్, మన్నే మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హెచ్‌ఎండిఎ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** సరూర్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని హుడా కాంప్లెక్స్ పక్కన హైదారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ 1981లో సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్ పేరిట నిర్మాణం చేపట్టింది. హైకోర్టు తీర్పు నేపధ్యంలో హెచ్‌ఎండిఎ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్ డిఎస్‌పి జానకిరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య అందులో ఉన్న దుకాణాలు నడుపుతున్న వారిని ఖాళీ చేయించి పంపించి వేశారు. కమర్షియల్ కాంప్లెక్స్‌ను మంగళవారం హెచ్‌ఎండిఏ అధికారులు స్వాధీనం చేస్తున్నారు. గతంలో భవనాన్ని నిర్మించి రంగారెడ్డి జిల్లా కోర్టు భవనం సముదాయాలకు కేటాయించారు. కొన్నేళ్లు కోర్టు నడవగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా కావడంతో ఎల్‌బినగర్‌లోని విశాలమైన స్థలాన్ని ఏర్పాటు చేసింది. 2008 ఎల్‌బినగర్ కు కోర్టును తరలించడంతో అప్పటి నుండి ఖాళీగా ఉంది. ఇందులో 32 దుకాణాలు లీజుకు తీసుకున్న వారు వాటిని అగ్రిమెంట్ , డాక్యుమెంట్ రైటర్స్, చేసుకోవడానికి అక్రమించుకేని నేటి వరకు కొనసాగారు. భవనం స్థితిగతులు బాగాలేదని ఖాళీ చేయాలని గతంలో నోటీసులు ఇచ్చారు. మంగళవారం ఖాళీ చేయించారు.

## 'జిహెచ్‌ఎంసి' సమస్యలపై ప్రభుత్వంతో చర్చిస్తా

ప్రొఫెసర్ కోదండరామ్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** హైదరాబాద్ మహానగరం లో జిహెచ్‌ఎంసి కార్మికులు చేస్తున్నటువంటి సేవలు కాంగ్రెస్ ప్రభుత్వం, పాలకులు ఖచ్చితంగా గుర్తిస్తారని కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఐఎన్‌టియుసి, టిజెఎసి, జిహెచ్‌ఎంసీ కార్మిక యూనియన్ నాయకులతో కలిసి ప్రభుత్వంతో చర్చించి పరిష్కారించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. మంగళవారం ఎల్‌బినగర్ నియోజకవర్గం జిహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఐఎన్‌టియుసి జిహెచ్‌ఎంసీ కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి తెలంగాణ జన సమితి సంపూర్ణ మద్దతు నిర్వహించిన కార్యక్రమానికి ఐఎన్‌టియుసి ఆల్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి, జనక్ ప్రసాద్, సత్యజిత్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆదిల్ షరిఫ్‌లతో కలిసి కోదండరామ్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. జిహెచ్‌ఎంసి కార్మిక యూనియన్ నాయకులు పలు సమస్యలు కోదండరాం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత పాలకుల్లాగా కార్మికుల సమస్యలపై దర్వాజాలు బంద్ పెట్టి నిరంకుశతత్వంగా వ్యవహరించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహరించదన్నారు. గతంలో కార్మికుల సమస్యల పరిష్కరం కోసం పాలకులను కలిసే పరిస్థితి లేదన్నారు. కాని ప్రపజల సహకారంతో సంపూర్ణ మద్దతుతో తెలంగాణలో అధికారం చేపట్టిన్న కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక పక్షపాతిగానే వ్యవహరిస్తుందన్నా రు. కార్మికులు చేస్తున్నటువంటి విధివిధానాలను గుర్తిస్తుందన్నారు. జిహెచ్‌ఎంసి కార్మికుల సమస్యలకు ముమ్ముందు ఎలాంటి పరిస్థితులు రాకూడదని ఉద్దేశ్యంతోనే ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కే.శివకుమార్, ఎం.శివరాజ్, ఆర్.రమేష్, నరసింహ, చరణసింగ్, యాదగిరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రబడ్జెట్‌లో వ్యవసాయంపై వివక్ష

రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి



**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టినా బడెట్‌లో అన్నాదాతకు శ్రామిక వర్గం నిదులు కేటాయిచకుండా కోత పెట్టి కార్పోరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా ఉన్నాదని సిపిఐ అనుబంద సంఘం రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి విమర్శించారు. అబ్దులాపూర్‌మెట్ రైతు వెదిక వద్ద మంగళ వారం ఏర్పాటు చేసినా విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాల సీతారామన్ వ్యవసాయ సబ్సిడీలలో కోత పెట్టి రైతులకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలు సాగు కోసం ఉపయెగించే ఎరువులలో 11వేల కోట్ల రూపాయల కోత పెట్టినారన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నా రాష్ట్రంకు నిధులు తేవడంలో విఫలమైనారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో అధికారంలో ఉన్నా ప్రభుత్వం రాష్ట్రం నుంచి మంత్రులు ఎంపిలుగా ప్రజలు గెలిపించి పంపితే రాష్ట్రంకు నిధులు తేలకపోవడం ప్రజల నిలదీయలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ప్రతి రైతుకు రైతు భరోస పథకం ద్వారా సాగు కోసం ఎకరకు 7500 వేస్తానాని ఇచ్చినా హామీ నిలబెట్టుకోలేదని అన్నారు. ఇప్పటికి రైతుల ఖాతాలలో ప్రభుత్వం ఇస్తామని చెప్పినా వేయకపోవడం దారుణం అన్నారు. అన్నదాతలను ఎన్నికలలో వాడుకోవాడం తప్పా హామీలు అమలు చేయడంలో పాలకులు మాటా తప్పుతున్నారన్నారు. ప్రభుత్వల తీరుపై రైతులు పోరాటలకు సిద్ధం కావాలని వారికి మద్దతుంగా రైతు సంఘం ఉంటుదని తెలిపినారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చల్లా నారాయణరెడ్డి, గంధం బాల్‌రాజు, సరసం బాల్‌రెడ్డి, శీలం పెంటయ్య, యాకయ్య,తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ

## రోహిత్ శర్మ సరైన సమయంలో ఫాంలోకి వచ్చాడు: క్రిస్ గేల్



ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు రోహిత్ శర్మ సరైన సమయంలో ఫాంలోకి వచ్చాడని వెస్టిండీస్ స్టార్ క్రికెటర్ క్రిస్ గేల్ అన్నారు. వన్డేల్లో సత్తాచాటే ఆటగాళ్లలో రోహిత్ ఒకడని ప్రశంసలు కురిపించారు. ఛాంపియన్స్ ట్రోఫీ టాప్ 4లో ఇండియా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు ఉండే అవకాశం ఉందని చెప్పారు.

మరో 13 పరుగులు చేస్తే దిగ్గజాలను దాటేస్తాడు



# భారీ రికార్డుకు చేరువలో రోహిత్..

టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ భారీ రికార్డుకు చేరువలో ఉన్నాడు. అతను మరో 13 పరుగులు చేస్తే వన్డేల్లో అత్యంత వేగంగా 11,000 పరుగులు చేసిన రెండో ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. సచిన్, రికీ పాంటింగ్, సౌరభ్ గంగూలీ, జాక్వెస్ కలిస్ వంటి దిగ్గజాల కంటే వేగంగా 11 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా హిట్ మ్యాన్ నిలుస్తాడు. ఈ అరుదైన జాబితాలో విరాట్ కోహ్లి అగ్రస్థానంలో ఉన్నాడు. కోహ్లి 222 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఇప్పటివరకు రోహిత్ 259 ఇన్నింగ్స్‌ల్లో 10,987 రన్స్ చేశాడు. ఇంగ్లాండ్‌తో బుధవారం జరిగే మూడో వన్డేలో రోహిత్ ఈ భారీ రికార్డును సాధించే అవకాశముంది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేలో రోహిత్ (119; 90 బంతుల్లో) శతకం బాది ఫామ్‌లోకి వచ్చిన సంగతి తెలిసిందే. హిట్‌మ్యాన్‌కిది వన్డేల్లో 32వ సెంచరీ కాగా.. అంతర్జాతీయ క్రికెట్‌లో 49వ శతకం. రోహిత్ మరో సెంచరీ చేస్తే సచిన్ తెందూల్కర్ (100), విరాట్ కోహ్లి (81) తర్వాత 50 సెంచరీలు చేసిన మూడో భారత ఆటగాడిగా రికార్డుల్లోకెక్కుతాడు.

**వన్డేల్లో అత్యంత వేగంగా 11,000 పరుగులు చేసిన ఆటగాళ్లు**

విరాట్ కోహ్లి (భారత్) 222 ఇన్నింగ్స్‌ల్లో
సచిన్ టెండూల్కర్ (భారత్) 276 ఇన్నింగ్స్‌ల్లో
రికీ పాంటింగ్ (ఆస్ట్రేలియా) 286 ఇన్నింగ్స్‌ల్లో
సౌరభ్ గంగూలీ (భారత్) 288 ఇన్నింగ్స్‌ల్లో
జాక్వెస్ కలిస్ (దక్షిణాఫ్రికా)–293 ఇన్నింగ్స్‌ల్లో
కుమార సంగక్కర (శ్రీలంక) 318 ఇన్నింగ్స్‌ల్లో
ఇంజామామ్ ఉల్ హక్ (పాకిస్థాన్) 324 ఇన్నింగ్స్‌ల్లో
సనత్ జయసూర్య (శ్రీలంక) 354 ఇన్నింగ్స్‌ల్లో
మహేల జయవర్దెనె (శ్రీలంక) 368 ఇన్నింగ్స్‌ల్లో

## కేఎల్ రాహుల్ ఔట్, పంత్ ఇన్..

తొలి రెండు మ్యాచుల్లో గెలిచి జోష్ మీదున్న టీమిండియా.. ఇప్పుడు మూడో వన్డేలోనూ గెలిచి సిరీస్ ను క్లీన్ స్వీప్ చేయాలని పట్టుదలతో ఉంది. అయితే ఈ మ్యాచ్ కోసం తుది జట్టులో పలు మార్పులు చేయనుంది. బెంచ్ బలాన్ని పరీక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను 4–1 తేడాతో సొంతం చేసుకుంది టీమిండియా. ఇక ఇప్పుడు వన్డే సిరీస్ లోనూ గెలిచి.. ఆత్మవిశ్వాసంతో ఛాంపియన్స్ బరిలోకి దిగాలనుకుంటోంది. అయితే అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఈ మూడో వన్డేలో పలు మార్పులో బరిలోకి దిగనున్నట్లు తెలిసింది. మూడో వన్డే కోసం వికెట్ కీపర్ రిషభ్ పంత్, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్, ఫాస్ట్ బౌలర్ అర్ష్ దీప్ సింగ్‌కు అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం.



ఇప్పటి వరకు ఈ సిరీస్ లో ఆడని ఈ ముగ్గురు.. మూడో వన్డే తుది జట్టులో ఉంటారని క్రికెట్ వర్గాలు అంటున్నాయి. వికెట్‌కీపర్ కేఎల్ రాహుల్ ప్లేస్ లో పంత్, షమి స్థానంలో అర్ష్‌దీప్ ఆడొచ్చు. మొదటి వన్డేలో ఆడిన స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ కూడా ఈ మూడో వన్డేలో ఆడొచ్చు. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆడిన అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా స్థానాల్లో కుల్దీప్ యాదవ్, సుందర్‌ను తీసుకునే అవకాశం ఉంది. యశస్వి జైస్వాల్ మళ్లీ బెంచ్ కే పరిమితం అవ్వొచ్చని సమాచారం.

**తుది జట్టు (అంచనా)**

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్య, రిషభ్ పంత్ (వికెట్‌కీపర్), హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.

## ఆర్సీబీలో ఈ బ్యూటీఫుల్ లేడీస్ డౌటే!



మరో మూడు రోజుల్లో మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 14 నుంచి ఈ సీజన్ మొదలు కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గుజరాత్ టైటాన్స్‌తో ఓపెనింగ్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. అయితే ఈ సారి ఆర్సీబీలో కొంతమంది స్టార్ ప్లేయర్స్ గాయాలబారిన పడటం కాస్త ఆందోళన కలిగించే విషయమే. ఇప్పటికే సోఫీ డివైన్ వ్యక్తిగత కారణాలతో ఆటకు కాస్త బ్రేక్ తీసుకుంది. స్పిన్నర్ సోఫీ మోలినెక్స్ గాయం కారణంగా అందుబాటులో ఉండట్లేదు. కేట్ క్రాస్ కూడా గాయం కారణంగా తప్పుకుంది. ఇక రీసెంట్ గా యాషెస్ సిరీస్ లో గాయపడి కోలుకున్న ఆల్ రౌండర్ ఎల్లిసె పెర్రీ మళ్లీ జట్టుతో కలిసింది. కానీ ఆమె ఇంకా పూర్తిగా ఫిట్ నెస్ సాధించినట్లు కనిపించట్లేదు. దీంతో మోలినెక్స్ స్థానంలో చార్లీ డీన్(ఇంగ్లాండ్, డివైన్, క్రాస్ స్థానంలో హీథర్ గ్రహమ్, కిమ్ గర్త్‌ను తీసుకొచ్చారు.



## ఎన్టీఆర్-నీల్ ప్రాజెక్ట్ వికారాబాద్‌లో?

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూ.ఎన్టీఆర్ రీసెంట్‌గా దేవర మూవీతో బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ హిట్ అందుకున్నాడు. దర్శకుడు కొరటాల శివ డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఇక ఈ సినిమా ఇచ్చిన సక్సెస్‌తో తారక్ ప్రస్తుతం బాలీవుడ్ మూవీ 'వార్2'లో నటిస్తున్నాడు. ఈ సినిమా తర్వాత, ఆయన తన నెక్స్ట్ చిత్రాన్ని దర్శకుడు ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో చేయనున్నాడు. ఇప్పటికే ఎన్టీఆర్‌నీల్ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. తారక్ లాంటి పవర్ హౌజ్‌తో ప్రశాంత్ నీల్ ఎలాంటి విధ్వంసం సృష్టిస్తాడా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని.. ఫిబ్రవరి 17 నుంచి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుందని తెలుస్తోంది. ఈ షూటింగ్‌లో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేయనున్నారట. వికారాబాద్ అడవులు, పరిసర ప్రాంతాల్లో ఈ షూటింగ్ జరగనుందని తెలుస్తోంది. ఇక ఈ షూటింగ్‌లో ఎన్టీఆర్ మార్చి నెలలో జాయిన్ కానున్నట్లు తెలుస్తోంది. రుక్మిణి వాసంత్ హీరోయిన్‌గా నటించనున్న ఈ సినిమాకు డ్రాగన్ అనే టైటిల్‌ను పెట్టాలని మేకర్స్ భావిస్తున్నారు.

## రీల్

## అనిల్ రావిపూడి నెక్ట్స్ చిత్రం మెగాస్టార్‌తో..?



టాలీవుడ్‌లో హిట్ మెషిన్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు దర్శకుడు అనిల్ రావిపూడి. ఆయన నుంచి వచ్చిన రీసెంట్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. ఇక ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ హీరోగా నటించడంతో వారిద్దరి కాంబినేషన్‌లో హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్నారు. ఇక ఇప్పుడు అందరి చూపు అనిల్ రావిపూడి నెక్స్ ప్రాజెక్ట్‌పై పడింది. ఇప్పటికే తన నెక్స్ట్ చిత్రాన్ని మెగాస్టార్ చిరంజీవితో చేయబోతున్నట్లు దర్శకుడు అనిల్ రావిపూడి ప్రకటించాడు. ఇక ఈ సినిమా కూడా పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానుందని ఆయన చెబుతున్నాడు. అయితే, ఈ సినిమాలో వింటేజ్ చిరంజీవిని చూపించబోతున్నట్లు అనిల్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించి ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమా కోసం అనిల్ రావిపూడి తనదైన మార్క్ టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాకు 'సంక్రాంతి అల్లుడు' అనే టైటిల్‌ను ఆయన ఫిక్స్ చేసినట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలో 'రౌడీ అల్లుడు' లాంటి వింటేజ్ చిరంజీవిని మనకు చూపించబోతున్నాడట ఈ క్రేజీ డైరెక్టర్. మరి నిజంగానే చిరంజీవి కోసం 'సంక్రాంతి అల్లుడు' అనే టైటిల్‌ను అనిల్ రావిపూడి ఫిక్స్ చేశాడా.. అనేది తెలియాల్సి ఉంది.

## ఏదీ అతిగా చేయొద్దు!



రకుల్ రీసెంట్‌గా గాయపడిన విషయం తెలిసిందే. గాయం నుంచి కోలుకున్న అమ్మడు ఇప్పుడు మళ్లీ తన తర్వాతి సినిమా షూటింగ్ లో బిజీగా ఉంది. గాయపడిన రకుల్ కొన్నాళ్ల పాటూ రెస్ట్ తీసుకుని ఇప్పుడు సెట్స్‌లోకి అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో రకుల్ తన గాయం గురించి, దాన్నుంచి ఆమె నేర్చుకున్న విషయాల గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. గాయపడిన తర్వాత తనకు తన శరీరంపై గౌరవం పెరిగిందని, దాని వల్ల కెరీర్ పై దృష్టి పెట్టగలగడం నేర్చుకున్నట్టు రకుల్ తెలిపింది. అంతేకాదు ఏదీ అతిగా చేయకూడదని తనకు అర్థమైనట్టు రకుల్ ఈ సందర్భంగా చెప్పింది. మన శరీరం మాట మనం వినాలని, లిమిట్స్‌ను దాటి మరీ అతిగా ఎక్సర్‌సైజులు చేయొద్దని రకుల్ అందరికీ సూచిస్తుంది. గాయం నుంచి కోలుకుని మళ్లీ సెట్స్‌లోకి రావడం ఎంతో ఆనందాన్నిస్తుందని, ఇక నుంచి ఎక్కువ ప్రెజర్ తీసుకోకుండా వర్క్ చేస్తానని రకుల్ వెల్లడించింది. ఇక తన భర్త గురించి మాట్లాడుతూ, ఆయన తన బెస్ట్ ఫ్రెండ్ అని చెప్పుకొచ్చింది. ఎవరైనా ప్రాణ స్నేహితుడిని పెళ్లి చేసుకున్నప్పుడు ఆ లైఫ్ చాలా అందంగా, ఆనందంగా ఉంటుందని చెప్పిన రకుల్, తన భర్త ఆమెని ప్రతీ విషయంలో అర్థం చేసుకుంటూ, ఆమె చేసే ప్రతి పనికీ మద్దతు ఇస్తూ ఉంటాడని, అతను దొరకడం తన అదృష్టమని రకుల్ పేర్కొంది.

## పుస్తకంపై దాడికి నవచేతన పబ్లిషింగ్ హౌస్ ఖండన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో ఈ నెల 8వ తేదీన విశాలాంధ్ర బుక్ స్టాల్‌పై హిందుత్వ, మతోన్మాద ముష్కరుల దాడిని నవచేతన పబ్లిషింగ్ హౌస్ తీవ్రంగా ఖండించింది. మరో పుస్తక దుకాణంపై కూడా దాడిచేసి అక్కడ అమ్ముతున్న ఖురాన్ విశ్లేషణ గ్రంథాన్ని చించివేయడం దుర్మార్గమని నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకవర్గం ఒక ప్రకటనలో పేర్కొంది. రాజ్యాంగ విలువలపై, భావ ప్రకటనా స్వేచ్ఛపై, ప్రగతిశీల సాహిత్యంపై ఆర్‌ఎస్‌ఎస్ మూకలు చేస్తున్న దాడిని తిప్పికొట్టాలని అభ్యుదయవాదులను, లౌకికవాదులను నవచేతన పబ్లిషింగ్ హౌస్ కోరింది. ఇక ముందు ఇట్లాంటి దాడులు జరగకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని నవచేతన పబ్లిషింగ్ హౌస్ విజ్ఞప్తి చేసింది.

## రష్యాలో కలిసిపోవచ్చు!

(మొదటి పేజీ తరువాయి)



మంగళవారంనాడు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ అనేక ఆసక్తికరమైన విషయాలు చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడాననీ, ఉక్రేన్‌లో యుద్ధ విరమణకు ముమ్మర యత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. మూడు సంవత్సరాలుగా పూర్తిశక్తిసామర్థ్యాలను ధారపోసి తన అస్తిత్వాన్ని సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకునేందుకు పాశ్చాత్యదేశాల మద్దతుతో ఉక్రేన్‌దేశం రష్యాపై ఒకవైపు పోరాటం చేస్తుండగా దాని అస్తిత్వాన్ని, భవితవ్యాన్ని సందిగ్ధంలో పడేసేవిధంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ''వాళ్ళు (ఉక్రేన్) ఒక ఒప్పందం చేసుకోవచ్చు, చేసుకోకపోవచ్చు, ఏదో ఒకనాటికి వాళ్ళు రష్యాలో ఒక భాగంగా కలిసిపోవచ్చు, లేదా కలిసిపోకపోనూవచ్చు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఉక్రేన్‌లో ఉన్న విలువైన, అత్యంత అరుదైన భూగర్భ ఖనిజాల వాణిజ్యం చేసే ఆలోచనలను ఆయన ప్రస్తావిస్తూ, అమెరికాసహాయం కింద ఉక్రేన్‌కు తిరిగి పెట్టుబడులు సమకూరుస్తామని చెప్పారు. ఉక్రేన్‌పై పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన పుతిన్ ఉక్రేన్‌లోని నాలుగు ప్రాంతాలలోని భాగాలను తమలో కలుపుకున్న నేపథ్యంలో ఆ దేశం తమకు పూర్తిగా లొంగిపోవాలని కోరుతున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యతో ఉక్రేన్ దేశం నివ్వెరపోయే పరిస్థితులు వస్తాయి. ఇదిలా ఉండగా ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై స్పందించాలని రష్యా కేంద్ర కార్యాలయం క్రెమ్లిన్‌ను పాత్రికేయులు కోరారు. దీనిపై క్రెమ్లిన్ కార్యాలయ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ, ఇప్పటికే ఉక్రేన్‌లోని ప్రాముఖ్యంగల పెద్ద ప్రాంతం రష్యాలో కలిసిపోవాలని కోరుకుంటున్నదనీ, ఈ భాగం ఇప్పటికే రష్యాలో కలిసిపోయిందనడం కాదనలేని సత్యమని పాత్రికేయులతో అన్నారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై యుద్ధం ప్రారంభించినప్పుడు కేవలం కొద్దిరోజుల్లోనే రాజధాని కీవ్‌ను తాము స్వాధీనం చేసుకుంటామని, ఆ తర్వాత కొద్దివారాలకే మిగిలిన ఉక్రేన్ దేశాన్ని తమలో కలిపేసుకుంటామని రష్యా భావించింది. కానీ ఇప్పటికి మూడు సంవత్సరాలు గడిచిన తర్వాత ఐదోవంతు భాగాన్ని మాత్రమే తనలో కలుపుకుంది. ఈ విలీనాన్ని చట్టబద్ధం చేసుకోవడంకోసం ఉక్రేన్‌లోని డోనెట్స్క్, లూహాన్స్క్, జెపోర్జియా, ఖెర్సన్ ప్రాంతాలలో ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేసింది. దీనిని ఒక ప్రచార కార్యక్రమంగా అంతర్జాతీయ పరిశీలకులు కొట్టిపారేశారు. ట్రంప్ వ్యాఖ్యలతో ఈ రిఫరెండం ఏకీభవిస్తోందని ద్మిత్రీ పెస్కోవ్ అన్నారు.కాగా ఉక్రేన్–రష్యా మధ్య శాంతి చర్చల ప్రయత్నాల్లో బ్రహ్మాండమైన పురోగతి సాధించామని ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పారు.

# సమాచారం లేకపోవడమేమిటి?

### వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పిఏసి సభ్యులు అసంతృప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వద్ద తగినంత సమాచారం లేదని పిఏసి సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మరింత సమగ్రంగా సమాచారాన్ని సిద్ధం చేయాలని పిఏసి సభ్యులు వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. ఇందుకు స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వచ్చే సమావేశానికి పూర్తి సమాచారాన్ని అందిస్తామని తెలిపారు. ప్రజా పద్దుల కమిటీ (పిఎఏసి) సమావేశం మంగళవారం శాసనసభ భవనంలోని కమిటీ హాల్ లో జరిగింది. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖపై సమీక్షించారు. పిఏసి ఛైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు రేవూరి ప్రకాష్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, అహ్మద్ బిన్ అబ్దుల్ బలాల, టి.భానుప్రసాద్‌రావు, ఎల్.రమణ, సత్యవతి రాథోడ్, శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ పి.మాధవి, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ రాకేశ్ సి.సజ్జన్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, నూతన ఆసుపత్రుల నిర్మాణం, ఆసుపత్రులలో మౌలిక వసతులు, నూతన మెడికల్ కాలేజీల నిర్మాణం, ఔషధాల పంపిణీ, డాక్టర్లు, సిబ్బంది సమస్యలు, పిజి సీట్ల వివరాలు, వైద్య, ఆరోగ్యంపై సుమారు మూడు గంటలకు పైగా కులంకుషంగా, సుదీర్ఘంగా కమిటీ చర్చించింది. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించి 2014–15 నుండి 2021–22 వరకు ఉన్న పెండింగ్ ఆడిట్ ఫైళ్లను పిఎఏసి కమిటి సమీక్షించింది. ప్రజా ఆరోగ్యానికి సంబంధించి వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అత్యంత ప్రాముఖ్యత కలిగినదని, ఈ శాఖ ద్వారా మరింత సమర్ధవంతంగా గ్రామీణ ప్రాంతాలలో వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రజా పద్దుల కమిటీ (పిఎఏసి) పలు సూచనలు చేసింది.



### ఇసుక అక్రమ రవాణాకు అవకాశం లేకుండా

# పకడ్బందీగా చర్యలు

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇసుక అక్రమ రవాణాకు ఏమాత్రం అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. రాష్ట్రంలో ఇసుక లభ్ధిని సమీక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం తెలంగాణ సచివాలయంలో మైనింగ్ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సరిపడ ఇసుక అందుబాటులో ఉండేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆమె కలెక్టర్‌లను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి ఇసుక రీచ్‌లు, స్టాక్యార్డులను భౌతికంగా తనిఖీ చేయాలని కలెక్టర్‌లకు తెలిపారు. తనిఖీలు నిర్వహించే బృందాలలో ఆర్‌డిఓ, డిఎస్‌పి స్థాయి అధికారి ఉండాలన్నారు. అధికారులు స్టాక్యార్డులు, ఇసుక రీర్ల ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లతో పాటు అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలను కూడా తనిఖీ చేయాలన్నారు. రాష్ట్రంలోని ఇసుక మార్కెట్‌లకు వెళ్లే రహదారులను గుర్తించాలని కలెక్టర్‌లను ఆమె ఆదేశించారు. పోలీసు, రవాణా శాఖ అధికారులతో రోడ్డు పెట్రోలింగ్‌లు నిర్వహించాలన్నారు. తనిఖీల కోసం సంబంధిత శాఖలతో సంయుక్త బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రీచ్‌లు, స్టాక్యార్డుల నుండి అనధికారికంగా ఇసుకను తరలించకుండా 24 గంటలు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు ఏమాత్రం అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిజిపి జితేందర్, ఇంటెలిజెన్స్ డిజి బి.శివధర్ రెడ్డి, ఎడిజిపి (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, డిఎంజి శశాంక, టిజిఎండిసి ఎం.డి. సుశీల్ కుమార్ ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## తరం కాదు

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా జనం పక్షాన పోరాటాలు సాగిస్తారని కమ్యూనిస్టులు సమాజ చైతన్య చోదకులని అన్నారు. కొండన్న మక్తల్ ప్రాంతంలో అనునిత్యం ప్రజల పక్షాన గొంతు వినిపించేవాడని అలాంటి వ్యక్తి కోల్పోడం ఈ ప్రాంతానికి తీరని నష్టదాయకమని అన్నారు. కొండన్న కుటుంబానికి ఇచ్చారు.

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాట వెంకట రెడ్డి మాట్లాడుతూ..: నరేంద్ర మోడీ ప్రభుత్వంలో దేశం అన్ని రంగాల్లో దివాలా తీస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ పీఠికకు సమాధి కడుతూ, సార్వభౌమాధికారాని సామ్రాజ్యవాద దేశాలకు తాకట్టు పెడుతూ దేశ సంపదను కొల్లకొడుతున్నారని అన్నారు. హోమ పక్షవాదులు సిపిఐ శ్రేణులు లౌకిక ప్రజాస్వామ్య ప్రత్యామ్నయం కోసం పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఏం బాల నరసింహ సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కే. విజయరాములు, సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ సిపిఐ నారాయణపేట జిల్లా సమన్వయ కార్యదర్శి నరసింహ, సహాయ కార్యదర్శి సంతోష్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు కిరణ్ భగవంతు, సిపిఎం జిల్లా నాయకులు ఆంజనేయులు, సిపిఎం నాయకులు గోవిందరాజ్, సిపిఐ నాయకులు పి.సురేష్, సీ.ఎన్ శెట్టి శ్రీహరి, డి.రాము, వెంకటేష్ ఆర్.అల్వాల్ రెడ్డి, రాబర్ట్, కుతుబ్, రమేష్, భరత్, రఘు, నాగరాజు, పద్మావతి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



## మృత్యు ఒడికి హైదరాబాదీలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణిస్తున్న మినీ బస్సును ట్రక్కు ఢీకొట్టింది. ఉదయం 8.30 గంటలకు జరిగిన ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జబల్‌పూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. బాధితుల్లో 8మందిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారం, రాఘవేంద్రనగర్‌కు చెందిన వారిగా గుర్తించగా, మరొకరిని రంగారెడ్డి జిల్లా నాచారం వాసిగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మృతి చెందిన వారిని ఆనంద్ కస్నారీ, శశి కస్నారీ, రవి వైశ్య, టివి ప్రసాద్, మల్లారెడ్డి, బాలకృష్ణ శ్రీరామ్, రాజుగా, క్షతగాత్రులను ఎస్.నవీనాచార్య, వి.సంతోష్‌గా గుర్చించామని, ఈ 9మంది ప్రయాణికులు బంధువులు, స్నేహితులు అని వారు చెప్పారు. కాగా, జబల్‌పూర్‌లో జిల్లాలో మొహల, బార్గి గ్రామాల మధ్య ఉన్న కెనాల్ సమీపంలో ప్రమాదం జరిగినట్లు జిల్లా అధికారులు తెలిపారు. సిమెంట్ లోడ్‌తో జబల్‌పూర్ నుంచి కాట్నీ వైపు వెళ్తున్న లారీ పైవేపైకి రాంగ్‌రూట్‌లో వచ్చి మినీ ఊస్సును ఢీకొట్టిందన్నారు. దీంతో బస్సు కెనాల్, ట్రక్కు మధ్యలో ఇరుక్కుపోయిందని చెప్పారు. ప్రమాదానికి గురైన లారీ మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉండగా, మినీ బస్సు ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉందని సిహోరా పట్టణ ఇన్‌స్పెక్టర్ విపిన్ సింగ్ చెప్పారు. ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామన్నారు. ప్రమాదం అనంతరం ట్రక్కు డ్రైవర్ పరారయ్యాడని, కేసు నమోదు చేశామని చెప్పారు. పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించడానికి ముందే స్థానికులు ట్రక్కులో ఇరుక్కుపోయిన బాధితులను బయటకు తీశారు. అయితే మినీబస్సు వెనుక వచ్చిన కారు కూడా ప్రమాదానికి గురైందని, కారులో ఉన్న ఎయిర్‌బ్యాగ్‌ల వల్ల వాహనంలో ఉన్న వారందరూ ప్రాణాలతో బయటపడ్డారని స్థానికులు పేర్కొన్నారు. ఘటన పట్ల సిఎం మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. మృతులకు సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానిభూతిని తెలిపారు. ఇలాంటి ప్రదేశాలకు ప్రయాణించేటప్పుడు ప్రజలు ఒక స్థాయికి మించి శ్రమించవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలను నివారించడానికి తమ డ్రైవర్లకు సరైన విశ్రాంతి, నిద్ర ను కల్పించాలని కూడా ఆయన ప్రజలకు సూచించారు. ఇదిలా ఉండగా, మైహర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. వీరు ప్రయాణిస్తున్న ఎస్‌విని కంచన్ పూర్ గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందని నాదన్ దెహత్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి కెఎన్ బంజారే తెలిపారు. కుంభమేళాకు వెళ్లి తిరిగి ఇండోర్‌కు వస్తుండగా తెల్లవారుజామున 4 గంటలకు ప్రమాదం జరిగిందన్నారు. క్షతగాత్రులను సాత్నా జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com